




జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ ముఠాలు చెలరేగిపోతున్నాయి. ఐపీఎల్ పోటీలు ఊపందుకోవడంతో పందేలను కూడా జోరుగా సాగిస్తున్నాయి. టాస్ పడ్డప్పటి నుంచి బెట్టింగ్‌లు ప్రారంభించి మ్యాచ్ ముగిసే వరకూ కొనసాగిస్తున్నాయి. ధనాధన్ టోర్నీలో సిక్సర్లు, ఫోర్లతో పరుగుల వరద పారుతుండగా.. బంతిబంతికీ బెట్టింగ్ వేసి అనేక మంది ఆర్థికంగా 'ఔట్' అవుతున్నారు. అప్పులపాలై పొలాలు, స్థలాలు అమ్ముకొని వీధిన పడుతున్నారు. కొందరైతే బెట్టింగ్ మాఫియా బెదిరింపులకు భయపడి ఇంట్లో తెలియకూడదని పారిపోతున్నారు. మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలూ ఉన్నాయి. బెట్టింగ్‌లకు అలవాటుపడిన వారి జేబులు ఖాళీ అవుతుండగా, పంటర్స్‌కి మాత్రం కాసుల వర్షం కురుస్తోంది. గతంలో బోర్డులు ఏర్పాటు చేసి ఏజెంట్ల ద్వారా ఆడేవారు. అయితే ప్రస్తుతం యాప్స్‌లో అలవాటు పడ్డారు. రెండు నెలలపాటు ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు బెట్టింగ్ నిర్వాహకుల భరతం పట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బెట్టింగ్ భూతం

ఐపీఎల్ పోరు.. పందేల జోరు

- వీధినపడుతున్న కుటుంబాలు
- సింగరాయకొండ కేంద్రంగా మాఫియా
- వైసీపీ నేత, పాత నేరస్థులపై నిఘా
- పోలీసుల ముమ్మర తనిఖీలు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ బెట్టింగ్ భూతం విరుచుకుపడుతోంది. ముఖ్యంగా యువతను బలితీసుకుంటోంది. సెల్‌ఫోన్ల పుణ్యమా అని జిల్లా అంతటికీ పాకి కుటుంబాలను గుల్లచేస్తోంది. జనాల జేబులకు చిల్లుపడుతుండగా, యాప్‌లలో మాత్రం లక్షలు చేతులు మారుతున్నాయి. గతంలో ఒంగోలు కేంద్రంగా బుకీలు రాకెట్‌ను నడిపించేవారు. ప్రస్తుతం సింగరాయకొండకు మకాం మార్చారని తెలుస్తోంది. అక్కడ వైసీపీ నేత బుకీగా వ్యవహరిస్తూ కొండపి, కందుకూరు, ఒంగోలు ప్రాంతాల్లో పంటర్స్‌ను ఏర్పాటు చేసి పందేలు వేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కువగా బార్ అండ్ రెస్టారెంట్లు, లాడ్జిలలో మకాం వేసి ఆడేవారిని ప్రోత్సహించి నిత్యం లక్షలు దోచుకుంటున్నారు. అంతేకాదు కొంతమంది హోటల్స్, రెస్టారెంట్లలో పనిచేసే వెయిటర్స్ ద్వారా కూడా బెట్టింగ్‌లు వేయిస్తున్నారు. యువకులు గ్రూపులుగా ఏర్పడి రూ.500, వెయ్యితో పందేలు మొదలుపెట్టి లక్షల్లో పోగొట్టుకుని బికారులుగా మారుతున్నారు. ఇలా గ్రామాల వరకు క్రికెట్ బెట్టింగ్ జాడ్యం పాకింది. కొంతమంది సాయంత్రానికి పట్టణాలకు వచ్చి బార్లలో కూర్చొని ఆట పూర్తయ్యే వరకు బెట్టింగ్‌లు వేసి జేబులు ఖాళీ చేసుకొని ఇంటికి వెళుతున్నారు.

ముఠా గుట్టు బయటపడింది ఇలా...

జరుగుమల్లి మండలానికి చెందిన ఓ యువకుడు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన జరుగుమల్లి పోలీసులు దర్యాప్తు చేస్తుండగా బెట్టింగ్ ముఠా

మిగతా 6వ పేజీలో

నిరంతరం తనిఖీలు చేస్తున్నాం

క్రికెట్ బెట్టింగ్‌లపై నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. కనీసం పది బృందాలు ఒంగోలు నగరంలో ఇదే పనిలో ఉన్నాయి. గతంలో క్రికెట్ బెట్టింగ్ కేసులలో నిందితులుగా ఉన్న వారిపై నిఘా ఉంచాం. బెట్టింగ్ ముఠాల సమాచారం ఉంటే 100, 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలి. బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయి.



- రాయపాటి శ్రీనివాసరావు, ఒంగోలు డీఎస్పీ

బెట్టింగ్ జరిగే తీరు ఇదీ..

బుకీలు కొంతమంది (పంటర్స్)ని ఎంపిక చేసుకొని బెట్టింగ్ దందా నడిపిస్తున్నారు. ఆయా ప్రాంతాలలో పంటర్స్ యువత, గతంలో బెట్టింగ్‌కు అలవాటు పడిన వారిని ఎంపిక చేసుకుని వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి యాప్ లింక్‌లు పంపిస్తారు. లింక్‌ల ద్వారా తమ సెల్‌ఫోన్ల నుంచే బెట్టింగ్‌లు వేయిస్తారు. యూజర్ నంబరు, పాస్‌వర్డు మాత్రం పంటర్స్ దగ్గరే ఉంటాయి. వారి ఆధ్వర్యంలోనే బెట్టింగ్‌లు ఆడే వారికే యాప్‌లు ఓపెన్ అయ్యేలా చర్యలు తీసుకుంటారు. లింక్‌లు అన్నీ ప్రైవేటు సర్వర్లతో యాడ్ అయి ఉంటాయి. దీంతో ఆన్‌లైన్‌లో ఇలాంటి వారిని గుర్తించడం కూడా కష్టం. బెట్టింగ్‌లు వేసేవారు 25శాతం పంటర్స్‌కు ఇవ్వాలి. పది వేలు పందెం వేసి గెలిస్తే రూ.7,500 వస్తాయి. ఓడిపోతే పది వేలు చెల్లించాలి. ఇలా బెట్టింగ్‌ల యాప్‌ల షరతులకు అంగీకరించిన వారికే యాప్‌లో లాగిన్ ఇస్తారు. కాగా కొందరు గెలిచినా సరే డబ్బులు తిరిగి ఇవ్వలేదని సమాచారం. ఓడిపోయిన వారు మాత్రం వెంటనే డబ్బులు కట్టాల్సిందే. లేకుంటే వారికి వేధింపులు తప్పవు.

దీపం వెలుగులు

లక్షలాది కుటుంబాలకు లబ్ధి

- పెండింగ్ లేకుండా సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో 3.90 లక్షల మందికి రూ.31.63 కోట్లు జమ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మహిళల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న దీపం-2 పథకానికి జిల్లావ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హత ఉన్న పేదలందరికీ ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన విషయం విదితమే. తదనుగుణంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. గత ఏడాది దీపావళి పండుగను



పురస్కరించుకొని దీపం-2 పథకాన్ని ప్రారంభించారు. నాలుగు నెలలకు ఒక పర్యాయం సబ్సిడీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం చెప్పిన విధంగానే సబ్సిడీ నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతోంది. జిల్లాలో ఆయా గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 3,95,551 మంది లబ్ధిదారులు ఉచిత దీపం-2 పథకానికి సిలిండర్లు బుక్ చేయగా 3,91,399 మందికి ప్రభుత్వం సబ్సిడీ సొమ్ము విడుదల చేసింది. గ్యాస్ సిలిండర్ తీసుకున్న వారం, పది రోజుల్లోనే 3,90,185 మంది లబ్ధిదారులకు సబ్సిడీ రూ.31,63,33,989 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమైంది. కేవలం 1,214 మంది ఖాతాలకు మాత్రం జమ కాలేదు.

వివిధ కారణాలతోనే అందని లబ్ధి

గ్యాస్ ఏజెన్సీలో ఉన్న నంబరుకు బ్యాంకు అకౌంట్ అనుసంధానం కాకపోవడం, ఈకేవైసీ లేకపోవడం వంటి కారణాలతో కొంత మంది లబ్ధిదారులకు సబ్సిడీ జమ కాలేదు. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ పథకం గత నెలాఖరుకు ముగిసింది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా జిల్లా వ్యాప్తంగా ఉచిత గ్యాస్ పథకం బాగా అమలవుతుండటంతో

మిగతా 6వ పేజీలో



విద్యుత్ వెలుగుల్లో ఒంగోలు కొండపైన ఉన్న సీతారామ స్వామి ఆలయం

కల్యాణం చూతము రారండి...

శ్రీరామనవమిని ఆదివారం ఘనంగా జరుపుకునేందుకు ప్రజానీకం సిద్ధమైంది. విద్యుత్ దీపాలతో ఆలయాలు కాంతులీనుతున్నాయి. ఊరూరా జానకిరాముల కల్యాణానికి ఏర్పాట్లు జరిగాయి. వివిధ ప్రాంతాల్లో స్థానికులు కమిటీలుగా ఏర్పడి పండుగను వైభవంగా నిర్వహించేందుకు రెడీ అయ్యారు.

7

రెవెన్యూ వర్సెస్ ఫారెస్ట్

- సీబీజీ ప్లాంట్‌కు గంగదొనకొండలో 799.40 ఎకరాలు కేటాయింపు
- పనులను ప్రారంభించిన రిలయన్స్ సంస్థ
- ఆ భూమి తమదని అడ్డుకున్న ఫారెస్టు అధికారులు
- ఎఫ్ఎల్ఆర్‌లో ఆ ఊసే లేదంటున్న రెవెన్యూ
- సమన్వయ లోపంతో నిలిచిన పనులు



పనులు ఆపి పక్కన ఉంచిన ఎక్స్‌కవేటర్లు



పనులను అడ్డుకుంటున్న ఫారెస్టు అధికారులు

కురిచేడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమన్వయ లోపం కురిచేడు మండలం గంగదొనకొండలో ఏర్పాటుకానున్న రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు శాపంగా మారింది. భూముల కేటాయింపులో ఏర్పడిన సమస్యతో ఆ సంస్థ చేపట్టిన పనులు నిలిచిపోయాయి. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనలో టీడీపీ కూటమి ప్రభుత్వం వేగంగా ఉంది. రిలయన్స్ సంస్థ 500 సీబీజీ ప్లాంట్‌ల ఏర్పాటుకు సిద్ధం కావడంతోపాటు మొట్టమొదట పీసీపల్లి మండలంలో భూమి పూజ కూడా చేశారు. అదే తరహాలో కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామంలో ప్లాంటు ఏర్పాటుకు 799.40 ఎకరాలు కేటాయించారు. దీంతో పదుల సంఖ్యలో యంత్రాలతో శుక్రవారం నుంచే రిలయన్స్ ప్రతినిధులు పెద్దఎత్తున పనులు ప్రారంభించారు. శనివారం అటవీ శాఖాధికారులు వచ్చి నిలిపివేయించారు.

రెవెన్యూ రికార్డులో గయాలు భూమి

కురిచేడు మండలం గంగదొనకొండ పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 88లో 548.95 ఎకరాలు, సర్వే నంబరు 90లో 250.45 ఎకరాలు మొత్తం 799.40 ఎకరాల భూమిని సీబీజీ ప్లాంటుకు కేటాయించారు. భూమికి రెవెన్యూ అధికారులు క్లియరెన్స్ ఇవ్వగా కలెక్టర్ అప్రూవల్ చేశారు. అది పూర్తిగా గయాలు భూమి అని రెవెన్యూ రికార్డులలో ఉంది. భూమికి అప్రూవల్ రావడంతో రిలయన్స్ సంస్థ శుక్రవారం నుంచి పనులు ప్రారంభించింది. అందుకు సంబంధించి 40కు పైగా ఎక్స్‌కవేటర్లు, పెద్ద యంత్రాలు తీసుకువచ్చి చిల్లచెట్లు తొలగించే పని చేపట్టారు. శనివారం సాయంత్రానికి 150 ఎకరాలలో శుభ్రం చేశారు. ఈ సమయంలో అటవీ శాఖ డీఆర్వో కేబీ నాయక్, ఎఫ్‌బీవో వై.ధనలక్ష్మిలు ప్లాంటు నిర్మాణ స్థలానికి వచ్చారు. 'ఆ భూమి అటవీ శాఖదని, మా అనుమతులు లేకుండా పనులు చేయవద్దని' అడ్డుకున్నారు. ఆభూమిలో గతంలో తాము నీరు నిలిచే ట్రెంచింగ్ చేశామని, మేము నిర్మించిన పిల్లర్లు కూడా ఉన్నాయని వారు వాదించారు. రెవెన్యూ అధికారులేమో ఎఫ్ఎల్ఆర్‌లో అది పూర్తిగా గయాలు భూమి అని ఉన్నదని, అటవీ శాఖ భూమి అందులో లేదని అందుకే అనుమతులు ఇచ్చామని చెబుతున్నారు. గతంలో మా అనుమతులు లేకుండా ట్రెంచింగ్ తీశారని వారు అంటున్నారు. అంతేకాక 1974లోనే 88 సర్వే నంబరులో 55 మంది రైతులకు 168.40ఎకరాలు, సర్వే నంబరు 90లో 9 మంది రైతులకు 28 ఎకరాలు అసైన్డ్ భూమి ఇచ్చామని చెబుతున్నారు. చాలా కాలంపాటు ఆభూములలో రైతులు పంటలు సాగు

మిగతా 6వ పేజీలో

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లోపలి పేజీల్లో

ఒంగోలులో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్



ప్రణాళికాబద్ధంగా ఉపాధి పనులు

- లక్ష్యానికి అనుగుణంగా పూర్తిచేయాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పక్కన డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రానున్న మూడు నెలల్లో ఉపాధి హామీ పథకం పనులను లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ పథకం ద్వారా ఉపాధి కూలీలకు 1.11 కోట్ల పనిదినాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 7వతేదీ నుంచి జిల్లాలో రోజువారీ 1.96 లక్షల మంది కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు. స్థానిక జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో శనివారం ఏపీడీలు, ఏపీవోలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. 2025-26 ఆర్థిక

మిగతా 6వ పేజీలో

బెట్టింగ్ భూతం

(5వ పేజీ తరువాయి)

గుట్టురట్టు అయింది. తప్పిపోయిన యువకుడు తిరుపతిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, అతనిని తీసుకొచ్చి విచారించగా తాను బెట్టింగ్‌లు వేసి డబ్బులు పోగొట్టుకున్నానని తెలిపాడు. పైగా అప్పుల పాలై బెట్టింగ్ రాయుళ్ల ఒత్తిడికి తట్టుకోలేక తప్పించుకు తిరుగుతున్నట్లు తెలిపాడు. దీంతో పోలీసులు బెట్టింగ్ ముఠాపై దాడులు చేసి ఇరవై మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఈ ముఠా ఒంగోలు, కందుకూరు, కొండపి నియోజకవర్గాలలో ఏజెంట్ల ద్వారా రాకెట్ నడుపుతున్నట్లు విచారణలో వెల్లడైంది. అందుకు సూత్రధారి బుకీగా అవతరామెత్తి గత ప్రభుత్వం హయాంలో రూ.కోట్లు సంపాదించినట్లు తెలుస్తోంది. అదేక్రమంలో వైసీపీ నేత మరి కొంతమందిని భాగస్వాములను చేసుకొని ఈ వ్యవహారం నడిపిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ కేసులో ఉన్న నలుగురు ముఖ్యులు పరారీలో ఉన్నారు. ఇదిలా ఉండగా ఒంగోలు నగరంలో డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు నేతృత్వంలో 15 పోలీసు బృందాలు శుక్రవారం రాత్రి ఆకస్మికంగా 30 ప్రాంతాల్లో తనిఖీలు చేశాయి. 10 మందిని అదుపులోకి తీసుకున్నాయి. వారిలో కొందరి సెల్‌ఫోన్‌లలో బెట్టింగ్ యాప్‌లు ఉండటంతో పాటుగా, కొంతమంది బెట్టింగ్ ఆడుతున్నట్లు కాల్ హిస్టరీని గుర్తించారు.

ప్రణాళికాబద్ధంగా ఉపాధి పనులు

(5వ పేజీ తరువాయి)

సంవత్సరంలో ఉపాధి పథకం ద్వారా ఐదు రకాల పనులు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. జిల్లాలో రూ.4.72 కోట్ల వ్యయంతో 1,475 పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. పశుసంవర్థక శాఖ అధికారులను సమన్వయం చేసుకొని ఈ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలో రూ.47.50 కోట్ల వ్యయంతో 9,500 సేద్యపు నీటి కుంటలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించామని చెప్పారు. అందులో రోజువారీ పనులు కోరే కూలీలకు కూడా 15 నుంచి 20శాతం వరకు పనులు కేటాయించామన్నారు. జిల్లాలో రూ.101.70 కోట్ల అంచనా వ్యయంతో 4,043 కి.మీ ఫీల్డ్ చానల్, ఫీడర్ చానల్‌లో పూడికతీత పనులు చేపడతామని తెలిపారు. 546 చెరువులలో రూ. 54.60 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఉపాధి కూలీ రోజుకు కనీస వేతనం రూ.290 పొందే విధంగా డ్వామా అధికారులు, సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ వర్సెస్ ఫారెస్ట్

(5వ పేజీ తరువాయి)

చేశారని, అప్పుడు పట్టించుకోని అటవీ శాఖ అధికారులు ఇప్పుడు ఎందుకు అడ్డుకుంటున్నారని రెవెన్యూ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఏదిఏమైనా కూటమి ప్రభుత్వం పరిశ్రమలు స్థాపించి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందనే ఆశలు ప్రజల్లో చిగురిస్తున్న తరుణంలో రెండు శాఖ మధ్య సమన్వయ లోపంతో ప్లాంటు పనులు ఆగాయి. వెంటనే దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ప్లాంటు పనులు చేపట్టేలా సత్వర చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుకుంటున్నారు.

‘దీపం’ వెలుగులు

(5వ పేజీ తరువాయి)

లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రణాళికాబద్ధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే సామాజిక పింఛన్లను పెంచి అమలు చేశారు. దీపావళి కానుకగా దీపం-2 పథకాన్ని ప్రారంభించారు. సబ్సిడీ సొమ్ము కొద్దిరోజుల్లోనే బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండటంతో వినియోగదారులు ఉపశమనం పొందుతున్నారు.

డీఎస్సీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో జిల్లాలోని డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సర్కిల్ సంచాలకులు ఎం.అంజల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న 2025 మెగా డీఎస్సీ పరీక్షలకు సిద్ధపడుతున్న బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ) అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. టెట్ పాసై ఉండాలని, దరఖాస్తుతోపాటు టెట్ మార్కులు, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రం, ఆధార్, జెరాక్స్ కాపీలు జతపరచాలన్నారు. రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను కూడా జత చేసి ఒంగోలులోని ప్రకాశంభవనం ఎదురు గల ప్రభుత్వ కార్యాలయాల కాంప్లెక్స్ (పాత రిమ్స్)లోని బీసీ స్టడీ సర్కిల్‌లో అందజేయాలని కోరారు. వివరాలకు సెల్ 99892 85530, 8985090926 ద్వారా సంప్రదించాలన్నారు.

పాల వ్యాను ఢీకొని విద్యార్థికి గాయాలు

మద్దిపాడు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పాలవ్యాను ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలైన సంఘటన కొలచనకోటలో శనివారం జరిగింది. కొలచనకోట గ్రామంలో సిరిగేపల్లి ప్రసాద్ టీ దుకాణం నిర్వహిస్తున్నారు. ఇంటర్ పూర్తయిన ఆయన కుమారుడు శ్రవణ్ టీ దుకాణం నుంచి ఇంటికి వెళుతుండగా పాల వ్యాన్ వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రవణ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఒంగోలులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11న ఒంగోలు బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు బార్ అసోషియోషన్ ఎన్నికలు ఈనెల 11వ తేదీన జరగనున్నాయి. ఈనెల 2న నామినేషన్లు, 3న స్క్రూటినీ, 4న ఉపసంహరణలు జరిగాయి. అనంతరం పోటీలో ఉన్నవారి వివరాలు ఇలా ఉన్నాయి. అసోషియోషన్ అధ్యక్ష పోటీకి ఆరుగురు బరిలో ఉన్నారు. అయితే వారందరూ సీనియర్ న్యాయవాదులు కావటంతో పోటీ తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. పోటీలోఉన్న బొడ్డు భాస్కరరావు, గోకునకొండ శ్రీనివాసరావు, చావలి రమేష్‌బాబు, నాయుడు ఈశ్వరరావు, పీఎస్‌వీ.సత్యనారాయణరెడ్డి, వేల్పుల తిరుమలకృష్ణయాదవ్ పోటీలో ఉన్నారు. ఉపాధ్యక్ష పోటీలో చుండూరి కృష్ణమూర్తి, మొటుమరి బలరామ్ అలాగే మహిళా రిప్రజెంటిటివ్‌కు ఎం.హెలీనాదీపాలత, తోట రాగ సుధారాణిలు బరిలో నిలిచారు. కాగా మూడు పదవులకు మాత్రమే ఎన్నికలు జరుగుతాయి.

నాలుగు పదవులు ఏకగ్రీవం

శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణల జరిగాయి. దీంతో జనరల్ సెక్రటరీగా సలగల జగజ్జీవన్‌రామ్, జాయింట్ సెక్రటరీగా వేల్పూరి గ్రేస్‌కుమారి, లైబ్రరీ సెక్రటరీగా గంటా శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా కాటుకూరి సంపత్‌కుమార్‌లు ఏకగ్రీవం అయ్యారు.

విద్యుత్ సరఫరాలో సమస్యలు

● హైవోల్టేజీతో కాలిపోయిన గృహోపకరణాలు

కొండపి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. శుక్రవారం రాత్రి హైవోల్టేజీ రావడంతో మద్దులూరు రోడ్డులోని సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న పలు దుకాణాలు, గృహాల్లోని ఫ్రిజ్‌లు, ఫ్యాన్‌లు కాలిపోయాయి. వోల్టేజీలో హెచ్చుతగ్గులతో బల్బులు కూడా దెబ్బతింటున్నాయని పలువురు తెలిపారు. ఈనేపథ్యంలో మద్దులూరు రోడ్డులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేశారు. వేసవి దృష్ట్యా అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

ప్రమాదం జరిగితే అంతే సంగతులు!

» బల్లికురవ, సంతమాగులూరు రోడ్డు పక్కనే స్తంభాలు
» నిత్యం వందలాది గ్రానైట్ లారీల రాకపోకలు
» కరెంట్ పోల్స్‌తో పొంచి ఉన్న ముప్పు
» నీడనిచ్చే చెట్ల నరికివేత » పట్టించుకోని అధికారులు





బల్లికురవ మల్లాయపాలెం రోడ్డు పక్కనే నూతనంగా వేస్తున్న విద్యుత్ లైన్, మలుపుల వద్ద తారు రోడ్డును ఆనుకొని ఉన్న స్తంభాలు, విద్యుత్ లైన్ ఏర్పాటుకు రోడ్డు మార్జిన్‌లో ఉన్న పెద్ద చెట్లను తొలగించిన దృశ్యం

బల్లికురవ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటులో అధికారుల పర్యవేక్షణ కొరవడుతుంది. ఇష్టానుసారంగా రోడ్ల పక్కనే విద్యుత్ స్తంభాలు వేస్తుండడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ప్రమాదాలు జరగక ముందే అధికార్లు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటులో దశాబ్దాల నుంచి ప్రజలకు నీడను ఇచ్చే రోడ్డు మార్జిన్లలో ఉన్న చెట్లను సైతం నరికి వేస్తున్నారు. స్తంభాలను రోడ్డుకు కొంచెం దూరంగా ఏర్పాటు చేస్తే సమస్య ఉండదని ప్రజలు అంటున్నారు.

బల్లికురవ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి మల్లాయపాలెం వరకు గ్రానైట్ క్వారీలు ఫ్యాక్టరీలకు ప్రత్యేక విద్యుత్ లైన్‌ను అధికారులు ఏర్పాటు చేయిస్తున్నారు.ఈ విద్యుత్ లైన్ ఎర్పాటుపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ నూతన విద్యుత్ లైన్ ఏర్పాటుతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. బల్లికురవ సంతమాగులూరు అర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లోనే విద్యుత్ స్తంభాలను పాతుతున్నారు. రోడ్డును ఆనుకొని స్తంభాలు ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యం వందలాది గ్రానైట్ లారీలు తిరిగే ఈ రోడ్డులో కరెంట్ పోల్స్‌ను చూసి వాహన దారులు సైతం బెంబేలెత్తి పోతున్నారు. రాత్రుళ్లు వేగంగా వచ్చే వాహనాలు మలుపులలో ఉన్న స్తంభాలతో ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందని వారు అంటున్నారు. ఎప్పుడో రెండు దశాబ్దాల కిందట ఉన్న స్తంభాలు అప్పుడు రోడ్డు వేయక పోవడంతో దూరంగా ఉన్నాయని ఇప్పుడు ఈ రోడ్డు డబుల్ రోడ్డుగా అభివృద్ధి చెందిందని ఇప్పుడు కూడా స్తంభాలను రోడ్డు మార్జిన్‌లలో వేస్తే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ లైన్ పేరుతో ఎంతో పెద్ద పెద్ద వృక్షాలను సైతం కొట్టేశారని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ లైన్ వేసే కాంట్రాక్టర్ స్తంభాలను రోడ్డుకి దూరంగా వేయకుండా రోడ్డు పక్కన వేసి తన పని తాను చేసి చేతులు దులుపుకున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎత్తు ఉన్న పోల్స్ రోడ్డు మార్జిన్‌లో వ రుసగా ఉండడంతో భయమేస్తుందని వాహనదారులు అంటున్నారు. విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంవల్ల నూతన విద్యుత్ లైన్ రోడ్డు మార్జిన్‌లో వేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను రోడ్డు కు దూరంగా ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ వృక్షాల నరికి వేత

బల్లికురవ నుంచి వీర్ల గంగమ్మ దేవాలయం వరకు ఎంతో కాలం నుంచి రోడ్డు పక్కన బాటసారులకు నీడను ఇచ్చే భారీ వృక్షాలను విద్యుత్ లైన్ ఏర్పాటుతో తొలగించారు. ఈ రోడ్డులో వెళ్లే బాటసారులు వేసవిలో కాసేపు చెట్ల నీడన కుర్చొని సేద తీరి వెళ్లే వారని కానీ ఇప్పుడు చెట్లు లేకపోవడంతో రోడ్డు బోసిపోతుందని, ఎండలు ఈ ఏడాది తీవ్రంగా ఉన్న సమయంలో చెట్లను నరికివేయడం సరికాదని ప్రజలు అంటున్నారు. దశాబ్దాలుగా ఉన్న చెట్లను నరికి వేసి అమ్మకాలు చేశారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త బ్రిడ్జితో తీరిన కష్టాలు

అద్దంకి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణంతో పలు గ్రామాల కష్టాలు తీరాయి. తిమ్మాయపాలెం-ఇలపావులూ రు ఆర్‌అండ్‌బీ రోడ్డులో అద్దంకి మం డలం పేరాయపాలెం వద్ద శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి మూడున్నర సంవత్సరాల కిందట కూలింది. వైసీపీ హయాంలో ఎలాంటి నిధులు కేటాయించక పోవడం తో అద్దంకి మండలంలోని పేరాయపా లెం, ధేనువకొండ, ఉమ్మనేనివారిపాలంలతో పాటు చీమకుర్తి, తాళ్లూరు మండలాలలోని పలు గ్రామాల నుంచి అద్దంకి కి రాకపోకలు నిలిచిపోయాయి.



పేరాయపాలెం వద్ద దోర్నపు వాగుపై నిర్మించిన బ్రిడ్జి

అద్దంకి-ధేనువకొండ బస్ సర్వీస్ ను కూడా రద్దు చేశారు. గ్రామస్థులు తాత్కాళికంగా మరమ్మతులు చేసుకున్నా బిక్కుబిక్కు మం టూ ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రత్యేక దృష్టి సారించి సుమారు40 లక్షల రూపాయల వ్యయంతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయింపజేశారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో రాకపోకలు పునరుద్ధరణ అయ్యాయి.

పోలీస్ శాఖకు ఎమ్మెల్యే ఏలూరి ప్రశంసలు

» చోరీ కేసు 24 గంటల్లోనే ఛేదించారని కితాబు
» ఇంకొల్లు పోలీసుల పనితీరు భేష్
» సీఐ రమణయ్య, ఎస్ఐ సురేష్‌కు ఎస్పీ అభినందనలు



ఎస్పీ తుషార్ డూడీతో డీఎస్పీ మహ్మద్ మొయిన్, సీఐ రమణయ్య, సిబ్బంది

పర్చూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శనివారం ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఇంకొల్లు పట్టణానికి చెందిన జాగర్లమూడి శివప్రసాద్ ఇంట్లో జరిగిన చోరీ కేసును 24 గంటల వ్యవధిలోనే ఛేదించి అద్భుత పనితీరు కనపరిచారని, పోలీసుల కృషి ఎమ్మెల్యే ఏలూరి కొనియాడారు. ఇంకొల్లు స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 3న అర్ధరాత్రి సమయంలో రూ.75 లక్షల చోరీ జరిగి, రూ.55,50,000 నగదు, రూ.20లక్షల విలువ కలిగే 24 సవర్ల బంగారు అభరణాల చోరీ కేసును ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు 24 గంటల్లోనే ఇంకొల్లు పోలీసులు ఛేదించి అంతర్ రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారని ఇది పోలీసుల పనితీరుకు నిరద్శనమన్నారు. ప్రజలకు రక్షణ కల్పించటం, ప్రజల ఆస్తులను కాపాడటంలో పోలీసుల పనితీరు అద్భుతంగా ఉందని కితాబు ఇచ్చారు. అలాగే ఎస్పీ తుషార్ డూడీ పోలీసులు ప్రతిభను అభినందించారు. చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్, ఇంకొల్లు సీఐ వై.రమణయ్య, ఎస్సై జి.సురేష్, పోలీసు సిబ్బంది జి.వీర్రాజును ఎమ్మెల్యే ఏలూరి అభినందించారు.

శింగరకొండ మండపానికి రూ.లక్ష విరాళం

అద్దంకి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండప నిర్మాణానికి దాతలు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం భీమవరానికి చెందిన నలబోతు వెంకటమోహనరావు, ఉమాదేవి దంపతులు శనివారం ఆలయ ఈవో తిమ్మానాయుడుకు రూ.1,01,116 నగదును అందజేశారు. వెంకటమోహనరావు, ఉమాదేవి దంపతులు శింగరకొండలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి వార్లను దర్శించుకున్నారు. వాహనపూజలు, ఆకుపూజలు, అర్చనలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

అద్దంకి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నియోజకవర్గ నేతలతో అన్నారు. బాపట్ల జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమించిన అద్దంకికి చెందిన బంగారుబాబు ఆధ్వర్యంలో విజయవాడలో పురందేశ్వరిని కలిశారు. జిల్లాలో అన్ని మండల శాఖల అధ్యక్షులను నియమించాలన్నారు. జాగర్లమూడి యలమందరావు, పరుచూరి శ్రీనివాసరావు ఉన్నారు.

తెలుగుభాష సేవకు దక్కిన గౌరవం

» పుట్టంరాజు దంపతులకు ఘన సన్మానం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అద్దంకి సాహితీ, సాంస్కృతిక రంగాల్లో రాష్ట్ర స్థాయి గౌరవాన్ని తీసుకురావడంలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సాధన అద్దంకిని రాష్ట్ర స్థాయిలో నిలపడంతోపాటు తెలుగు భాషకు ఆయన చేసిన సేవలకు దక్కిన గౌరవమని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకున్న పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తికి శనివారం చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో సాహితీ కౌముది, రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అభినందన సభ వారణాసి రఘురామశర్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వక్తలు పుట్టంరాజు చేసిన సాధన, కృషిని, సేవలను కొనియాడారు. అనంతరం పుట్టంరాజు శ్రీరామమూర్తి దంపతులను ఘనంగా సన్మానించారు.

పాండురంగ దేవాలయానికి విరాళం

చీరాల, మార్చి 5 ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : విఠల్‌నగర్ పాండురంగ దేవాలయానికి మరమ్మతులకు వాకర్స్ అసోసియేషన్ చీరాల సభ్యులు తన్నీరు రామారావు రూ.51,116 చెక్కును శనివారం కమిటీ ప్రతినిధులు శ్రీరామ చంద్రమూర్తికి అందజేశారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రతినిధులు మాట్లాడుతూ దేవాలయాలకు విరాళాలు అందజేయడంపై అభినందించారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, గురు ప్రసాద్, నారాయణమూర్తి, తిరుపతిరావు, నారాయణ, స్వామి, సుబ్బారావు, రమేష్, పూర్ణా, కిషోర్, శివాంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.

రాజ్యాంగ అంశాలపై అవగాహన

పేరాల(చీరాల), మార్చి 5 ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : ప్రతి పౌరుడు భారత రాజ్యాంగంలోని 10 ముఖ్యమైన అంశాలు, లక్ష్యాలపై అవగాహన కలిగి ఉండాలని వక్తలు అన్నారు. పేరాల కరూర్ వైశ్యా బ్యాంక్ వద్ద శనివారం ప్రచార కమిటీ, సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బీఆర్ అంబేద్కర్ జయంతి సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో చర్చా వేదికలు, సమావేశాలు, సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కోట వెంకటేశ్వరరెడ్డి, హరి హరరావు, రవి కుమార్, జయరామిరెడ్డి, జేజిబాబు, వెంకటేశ్వర్లు, రత్నారెడ్డి, వెంకయ్య పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్ర పాఠశాల వార్షికోత్సవం

చీరాల, మార్చి 5 ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : పాపరాజు తోటలోని రాఘవేంద్ర ఇంగ్లీషు మీడియం స్కూల్ 16వ వార్షికోత్సవం వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ముఖ్య అతిథులుగా పొగడదండ రవికుమార్, సైన్స్ ఉపాధ్యాయులు పవని భానుచంద్రమూర్తి, టీడీపీ నాయకులు నక్కల వెంకట రమణరావు పాల్గొన్నారు. విద్యాభ్యాసంపై విద్యార్థులకు ప్రత్యేక సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

పామూరుకు రెండోసారి ఏఎంసీ పీఠం



రమాదేవి (ఫైల్)

పామూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పామూరు మండలానికి రెండు పర్యాయాలు ఏఎంసీ చైర్మన్ పదవులు దక్కాయి. 2014 లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఉగ్ర పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామానికి చెందిన దారపనేని చంద్రశేఖర్‌ను కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించారు. అనంతరం కదిరి బాబురావు హయాంలో వరుసగా రెండేళ్ల దారపనేని చైర్మన్‌గా వ్యవహరించారు. మళ్లీ 10 సంవత్సరాల అనంతరం 2024లో ఎమ్మెల్యేగా గెలిచిన ఉగ్ర పామూరు మండలానికి ఏఎంసీ చైర్‌పర్సన్ అవకాశం కల్పించారు. కందులవారిపల్లి గ్రామానికి చెందిన యారవ రమాదేవి అనే మహిళకు చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన ఘనత ఉగ్రకే దక్కింది. తొలిసారిగా పామూరు మండలానికి చెందిన మహిళకు పదవి దక్కడం విశేషం. 2019లో వైసీపీ హయాంలో పామూరు పట్టణానికి చెందిన దరిశిరాము, షేక్ చాంద్ బాషలకు ఏఎంసీ వైస్‌చైర్మన్లుగా అవకాశం కల్పించిన విషయం పాఠకులకు తెలిసిందే.

ఉగ్రకు ఏఎంసీ చైర్‌పర్సన్ భర్త కృతజ్ఞతలు

ఎన్ని అవాంతరాలు ఎదురొచ్చినా ఇచ్చిన మాట ప్రకారం తమ కుటుంబానికి ఏఎంసీ చైర్మన్ పదవి ఇచ్చి మాట తప్పడు మడమ తిప్పని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి జీవితాంతం రుణ పడి ఉంటానని ఏఎంసీ చైర్‌పర్సన్ రమాదేవి భర్త టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు అన్నారు. కనిగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో పామూరు టీడీపీ నాయకులతో శనివారం కలిసారు. ఈ సందర్భంగా ఉగ్రను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉగ్రను కలిసిన వారిలో షేక్ ఖాజారహంతుల్లా, దరిశి రాము, గట్లా కొండారెడ్డి తదితరులు ఉన్నారు.

ఏఎస్సై ఆకస్మిక మృతి

● కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎస్పీ



ఏఎస్ఐ వేణుగోపాలరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం/నాగులుప్పలపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కార్యాలయంలో ఐటీ కోర్‌టీమ్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న వేణుగోపాల్‌రావు (52) ఆకస్మికంగా మృతిచెందాడు. శనివారం ప్రమాదవశాత్తూ కాలుజారి పడి ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనంతరం వేణుగోపాల్ మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన నాగులుప్పలపాడు తరలించారు. ఎస్పీ ఏఆర్.దామోదర్ నాగులుప్పలపాడు వెళ్లి వేణుగోపాల్ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. విధి నిర్వహణలో ఏఎస్సై మృతిచెందడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. పోలీసుశాఖ వారి కుటుంబానికి అండగా ఉంటుందని అన్నారు. వేణుగోపాల్‌రావు మృతదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్పీ వెంట ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు, సీఐ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీలు శ్రీనివాసరావు, రాయపాటి శ్రీనివాసరావు, సీఐలు రాఘవేంద్ర, సూర్యనారాయణ, శ్రీకాంత్‌బాబు, హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒకేషనల్ జవాబుపత్రాల మూల్యాంకనం

ఒంగోలు విద్య, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో భాగంగా ఆదివారం నుంచి ఒకేషనల్ కోర్సుల జవాబు పత్రాలు, సంస్కృతం జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభం కానుంది. ఒకేషనల్ కోర్సుల పేపర్లు దిద్దేందుకు 40 మందిని, సంస్కృతం పేపర్లు దిద్దేందుకు పది మంది టీచర్లను ప్రత్యేకంగా నియమించారు. ఇప్పటికే మూల్యాంకనం ప్రారంభమైనా టీచర్ల కొరతను ఎదుర్కొంటున్న మూడు సబ్జెక్టులకు శనివారం రెండేసి గ్రూపులు అంటే 14 మంది చొప్పున ఇంగ్లీషు, సోషల్, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు అదనంగా టీచర్లు రావడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. మొదట నిర్దేశించిన ప్రకారం మూల్యాంకనం ఈనెల 9 నాటికి పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

12నుంచి బ్యూటీషియన్‌పై ఉచిత శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రూడ్‌సెట్ సంస్థలో ఈనెల 12వ తేదీ నుంచి 35 రోజుల పాటు బ్యూటీపార్లర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు అర్హులన్నారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డుకలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తామని, వివరాలకు 9573363141 సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

కోర్టు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు



కోర్టు బిల్డింగ్ పనులు పరిశీలిస్తున్న జస్టిస్ మన్మథరావు

సింగరాయకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సివిల్ జడ్జి కోర్టు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక మండల కాంప్లెక్స్ ఆవరణలో జరుగుతున్న పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎ.భారతి, ఎస్పీ దామోదర్, కందుకూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.నిఖిల్‌రెడ్డి ఉన్నారు.



సీతారాముల కల్యాణం చూతము రారండి

● నేడు శ్రీరామనవమి ● వేడుకకు సిద్ధమైన దేవాలయాలు

'శ్రీరాఘవం.. దశరథాత్మజ మప్రమేయం.. సీతాపతిం... రఘులాన్వయ రత్నదీపం... అజానుబాహుం... అరవింద దళాయతాక్షం' అంటూ ప్రజలందరూ భక్తిపారవశ్యంతో అయోధ్యరాముని కొలుస్తూ, వాడవాడలా కల్యాణోత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహిస్తూ సీతారాముల కల్యాణం జగత్కల్యాణంగా పరమ పవిత్రమైనదిగా భావిస్తూ పరవశించిపోయే శుభదినం 'శ్రీరామనవమి'. అటువంటి శ్రీరామనవమి పర్వదిన వేడుకలను, కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లావ్యాప్తంగా పలు దేవాలయాలు, సంస్థలు ఏర్పాట్లు పూర్తిచేశాయి.

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధనవమిని 'శ్రీరామనవమి'గా జరుపుకోవటం ఆనవాయితీ. త్రేతాయుగంలో దశరథ మహారాజు నిర్వహించిన పుత్రకామేష్టి యాగం ఫలితంగా సాక్షాత్తూ ఆ శ్రీమహావిష్ణువే శ్రీరామునిగా కౌసల్యాదేవికి చైత్రశుద్ధ నవమినాడు జన్మించినందున ఆ రోజును శ్రీరామనవమిగా జరుపుకుంటాం. ఇక శ్రీమహావిష్ణువు శ్రీరామునిగా లోకకల్యాణం కోసం జన్మించి రావణ సంహారం చేశాడనేదానికి ప్రతీకగా ఆయన జన్మించిన శ్రీరామనవమి రోజునే అభిజిత్ లగ్నంలో కల్యాణోత్సవాన్ని జరుపుకోవటం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ శ్రీరామనవమి వసంతరుతువులో వస్తుంది. దీంతో ఉగాది మొదలుకుని శ్రీరామనవమి వరకు తొమ్మిది రోజులపాటు 'వసంత నవరాత్రులు' జరుపుకోవటం, ఈ తొమ్మిది రోజులు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించటం పరిపాటి.



ఒంగోలులో మామిడి, అరటి తోరణాల కొనుగోళ్లు

చలువ పందిళ్లు, వడపప్పూ పానకం

శ్రీరామనవమి అనగానే గుర్తుకు వచ్చేది తాటాకు పందిళ్లు, వడపప్పు, పానకం. శ్రీరామనవమి చైత్రమాసంలో వస్తుంది. అప్పుడే వేసవికాలం ప్రారంభం అయి ఎండలు పెరుగుతుంటాయి. అందువల్ల పెద్దవాళ్లు ఈ విధమైన ఏర్పాట్లు చేశారని చెబుతారు. గ్రామాల్లో, పట్టణాల్లో శ్రీరామనవమి కల్యాణోత్సవాన్ని చూడటానికి ప్రజలు పెద్దసంఖ్యలో వస్తారు. అప్పుడు ఎండతాపాన్ని తట్టుకోవటానికి తాటాకు పందిరి అయితే చల్లగా ఉంటుంది. ఎండ కారణంగా ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది కనుక కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు విసనకర్రలను పంపిణీ చేస్తారు. ఇక కల్యాణోత్సవం పూర్తయిన తర్వాత పెసరపప్పుతో తయారు చేసిన వడపప్పును, బెల్లం, మిరియాలు, ఏలకులు కలిపి చేసిన పానకాన్ని ఇస్తారు. ఇవి అన్నీ కూడా శరీరానికి చలువ చేసే పదార్థాలే.

పెరిగిన పూలు, పండ్ల ధరలు

పండగ అనగానే ముఖ్యంగా కావల్సింది పూజకు ఉపయోగించే పూలు, పండ్లు. దీంతో వీటి ధరలు శుక్ర, శనివారాల్లో భారీగా పెరిగాయి. గతంలో పావు కిలో రూ.70 నుంచి రూ.80 ఉండే విడిపూలు ప్రస్తుతం రూ.100కు పెరిగింది. అరటిపండ్లు మొదలు అన్ని రకాల పండ్ల ధరలు సైతం పెరిగాయి. అయినా తప్పదు కనుక ప్రజలు వాటిని కొనుగోలు చేయటానికి రావటంతో ఒంగోలు నగరంలోని గాంధీరోడ్డు, కొత్త కూరగాయల మార్కెట్ ప్రాంతాలు జనాలతో రద్దీగా మారాయి.

వివిధ ప్రదేశాల్లో కల్యాణోత్సవాలు

● జిల్లాలోని గ్రామాల మొదలు పట్టణాల వరకు ఉన్న సీతారామచంద్ర స్వామి దేవస్థానాలు, శ్రీకృష్ణమందిరాలు మొదలైన వైష్ణవాలయాల్లో ఆదివారం సీతారామ కల్యాణోత్సవం నిర్వహించటానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. వివిధ ప్రాంతాల్లో స్థానికులు కమిటీలు ఏర్పడి కల్యాణోత్సవం నిర్వహించటానికి సైతం ఏర్పాట్లు చేశారు.

● ఒంగోలు నగరానికి వస్తే స్థానిక గడియారం వారి వీధిలోని కుర్తాళం పీఠపాలిత అనంత కోదండరామస్వామి దేవస్థానం, గుర్రంవారి వీధిలోని సీతారామచంద్రమూర్తి దేవస్థానం, ఐశ్వర్యనగర్ సీతారామస్వామి దేవస్థానం, సంతపేట సాయిబాబా మందిరం, నిర్మల్‌నగర్ పార్కువద్ద ఏర్పాటుచేసిన కల్యాణమండపం, పోలీస్ క్వార్టర్స్‌లోని సీతారామాలయం, మంగమూరు రోడ్డు పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం, రామ్‌నగర్ సీతారామచంద్రమూర్తి దేవస్థానం, సీతారాంపురం సీతారామచంద్ర స్వామి దేవస్థానం మొదలైన అనేక చోట్ల శ్రీరామనవమి పండుగ సందర్భంగా కల్యాణోత్సవాలు ఏర్పాటుచేశారు. కొన్నిచోట్ల కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ సైతం జరుగనుంది.



పంగులూరు దళితవాడలోని రామాలయం

పంగులూరు దళితవాడలో దశాబ్దాలుగా వేడుకలు

పంగులూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి పర్వదిన సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవానికి పంగులూరు దళితవాడలోని రామాలయం ముస్తాబైంది. దశాబ్దాల క్రితం దళితవాడలో నిర్మితమైన రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు మూడురోజుల పాటు కాలనీవాసులు ఎంతో వేడుకగా నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో ఘనంగా జరిగే నవమి వేడుకలో కాలనీ వాసులు అధికసంఖ్యలో పాల్గొంటారు. సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. కళ్యాణానికి ముందు దళితవాడలోని తొమ్మిది మంది పెద్దలు కంకణాలు ధరిస్తారు. వేదపండితులు స్వామి వారి కల్యాణం నిర్వహించే సందర్భంలో స్వామి వారికి పొంగలి నైవేద్యంగా సమర్పిస్తారు. దళితవాడ రామాలయంలో శాస్త్రోక్తంగా జరిగే స్వామివారి కల్యాణానికి ఏటా బాచిన వంశస్తులు దివంగత రాఘవయ్య, అప్పారావు కుటుంబాలతో పాటు కుర్రా వంశస్తులు తలంబ్రాలు, వడపప్పు, పానకం ప్రసాదాలుగా సమకూర్చడం ఆనవాయితీ. వాటిని ఉత్సవ కమిటీ మేళతాళాలతో ఊరేగింపుగా తోడ్కొని వస్తారు. రెండవ రోజు సందిరేవు పేరుతో జరిగే కార్యక్రమంలో దేవుడి ఊరేగింపు, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలుగా కోలాటం, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. మూడవ రోజు స్వామివారికి పూజలు నిర్వహించి కంకణాలు తీయడంతో వేడుక ముగుస్తుంది.



పంగులూరు దళితవాడలో సీతారాముల కల్యాణానికి ముస్తాబవుతున్న రామాలయం

నగరంలో మసాజ్ సెంటర్లు

● మహిళలతో పురుషులకు మర్దన

● నెల్లూరు బస్టాండ్‌లో తనిఖీలు

● నలుగురుని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలో మసాజ్ సెంటర్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. పది సెంటర్లు ఉన్నట్టు తెలుస్తోంది. గతంలో పోలీసులు దాడులు నిర్వహించి హెచ్చరికలు జారీ చేసినా మళ్లీ కొనసాగుతుండటం చర్చనీయాంశమైంది. ఇటీవల స్థానిక గొడుగుపాలెంలో నిర్వహిస్తున్న మసాజ్ సెంటర్‌లో గంజాయి ప్యాకెట్లు, కండోమ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మసాజ్ సెంటర్లపై ఎస్పీ సీరియస్‌గా ఉన్నా కిందిస్థాయి సిబ్బంది ఉదాసీనత వల్ల తిరిగి అన్ని సెంటర్లలో మహిళలతో మసాజ్ ప్రారంభించారు. శనివారం స్థానిక నెల్లూరు బస్టాండ్ వెంగమాంబ కాంప్లెక్స్‌లో క్రిష్టల్ సెలూన్ సెంటర్‌లో ఒంగోలు టూటౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించి ఇద్దరు పురుషులతో పాటుగా ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. అక్కడ సెలూన్ నిర్వాహకుడు పుచ్చకాయల వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేశారు.

● మసాజ్ మాటున అసాంఘిక కార్యకలాపాలు

మసాజ్ చేయంచుకోవడానికి రిసెప్షన్‌లో రూ.2500 తీసుకుంటారు. అక్కడ నుంచి లోపల ప్రత్యేక గదుల్లో మహిళలతో పురుషులకు మసాజ్ చేయిస్తారు. మసాజ్ మాటున అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. అందుకోసం మరో నాలుగు వేలు అధికంగా తీసుకుంటున్నట్లు చర్చ నడుస్తోంది. కొన్ని మసాజ్ సెంటర్లకు వచ్చిన వారిని అక్కడున్న రిసెప్షనిస్టులు అనుబంధ గృహాలకు పంపిస్తున్నారు. ఈ తరహా మసాజ్ సెంటర్లు నగరంలో మళ్లీ ప్రారంభమయ్యాయి.

● సెలూన్ నిర్వాహకుడిపై కేసు నమోదు : సీఐ

నెల్లూరు బస్టాండ్‌లో క్రిష్టల్ సెలూన్ నిర్వహిస్తున్న పుచ్చకాయల వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేశామని ఒంగోలు టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు తెలిపారు. అక్కడ ఇద్దరు మహిళలతో పాటుగా, ఇద్దరు పురుషులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. మహిళలు పురుషులకు మసాజ్ చేయడం చట్టపరంగా నేరం అని అన్నారు.

ముగిసిన ఇంటర్ మూల్యాంకనం

● రెండో వారంలో ఫలితాలు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏకేవీకే జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ముగిసింది. జవాబు పత్రాల స్క్రూట్నీ, మార్కుల స్కానింగ్ ప్రక్రియ కూడా పూర్తయింది. ప్రస్తుతం మార్కుల్లో ఏమైనా తేడాలు, తప్పులు వేస్తే వాటిని సరిచేసే కార్యక్రమం జరుగుతోంది. ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఒకేసారి ప్రకటించేందుకు బోర్డు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 12 లేదా రెండోవారం చివరలో ఫలితాలు ప్రకటిస్తామని బోర్డు అధికారులు చెప్తున్నారు.

ముండ్లమూరు ఎస్ఐ పోస్టుకు పలువురు పోటీ

ముండ్లమూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐ నాగరాజు బదిలీ కావటంతో ఆయన స్థానంలో వచ్చేందుకు పలువురు ఎస్ఐలు పోటీ పడుతున్నట్టు సమాచారం. ముందు వరుసలో గతంలో ముండ్లమూరు ఎస్ఐగా పని చేసి ప్రస్తుతం ఒంగోలు ఎస్‌బీలో పని చేస్తున్న గంగుల వెంకట సైదులు ఉన్నారు. ఆ తరువాత ఒంగోలు టౌన్ పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న షులి శివ నాగరాజు, కమలాకర్, రజియా సుల్తాన్, అబ్దుల్ రెహ్మాన్‌తో పాటు పి. భూషణ్ అనే వారు ముండ్లమూరు పోలీసు స్టేషన్‌కు వచ్చేందుకు పోటీ పడుతున్నారు. ఇప్పటికే గతంలో ముండ్లమూరులో పని చేసి సమర్థవంతుడుగా పేరు తెచ్చుకున్న వెంకట సైదులునే వరించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

జగ్జీవన్‌రామ్ జీవితం యువతకు ఆదర్శం

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు నగరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సామాజిక న్యాయం కోసం పోరాటం చేసిన జగ్జీవన్‌రామ్ జీవితం నేటి యువతకు ఆదర్శమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. శనివారం జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని పురస్కరించుకుని స్థానిక నెల్లూరు బస్టాండ్ సెంటర్, కలెక్టర్ కార్యాలయం కూడలి వద్ద బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఆమె పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు నివాళులు అర్పించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ దేశాభివృద్ధిలో జగ్జీవన్‌రామ్ పాత్ర ఎనలేనిదన్నారు. వివక్షను ఎంతో ధైర్యంగా ఎదుర్కొని ఉన్నత స్థాయికి చేరుకున్న ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని ఆమె అన్నారు. సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయకుమార్ మాట్లాడుతూ ఎన్నో శాఖలకు మంత్రిగా పనిచేసిన జగ్జీవన్‌రామ్ దేశం కోసం అవిరళంగా కృషి చేశారన్నారు. ఆహార భద్రత కల్పించే విషయంలో ఆయన చేసిన కృషి మరువలేదన్నారు. నేటి యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన జగ్జీవన్‌రామ్ జీవితం త్యాగాలతో పునీతమయ్యిందన్నారు. జిల్లా వ్యాప్తంగా శనివారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖాధికారి అంజలి, వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఏకలవ్యనగర్‌లో ఒంగోలు ఆర్‌డీవో పర్యటన

● భూములు పంపిణీ చేయాలని ఎస్టీలు, ఎస్సీల విన్నపం

తాళ్లూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏకలవ్యనగర్ గ్రామంలో ఒంగోలు ఆర్‌డీవో లక్ష్మీ ప్రసన్న శనివారం సాయంత్రం పర్యటించారు. ఆర్‌వోఆర్ చట్టం ప్రకారం ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలని పలువురు ఎస్టీలు గత కొంత కాలంక్రితం ప్రభుత్వాధికారులకు దరఖాస్తు పెట్టుకున్నారు. ప్రభుత్వాలు మారినా ఎస్టీలకు భూముల పంపిణీ జరగలేదు. తమకు భూములు పంపిణీ చేసి ఆదుకోవాలని కొందరు ఉన్నతాధికారులకు దరఖాస్తు పెట్టుకున్నారు. దీంతో ఒంగోలు ఆర్‌డీవో లక్ష్మీ ప్రసన్న ఏకలవ్యనగర్ గ్రామాన్ని సందర్శించారు. ఆగ్రామంలో ఎందరు నివాసముంటున్నారు, వారి స్థితిగతులను, పూర్తివివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్టీలకు భూములు పంపిణీ చేసేందుకు ఆర్‌డీవో వచ్చారన్న సమాచారంతో సోమవరప్పాడు గ్రామంలో నివసిస్తున్న కొందరు ఎస్సీలు ఆర్‌డీవోను కలిశారు. ఎస్టీకాలనీలో నివాసముండక, ఇతరప్రాంతాల్లో ఎక్కడో నివాసముంటున్న వారు భూముల కోసం దరఖాస్తు పెట్టుకున్నారని విన్నవించారు. తాముఎంతో కాలంగా ఈ భూములు సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని, ఎస్సీలకు భూములు పంచిన తరువాతే ఎస్టీలకు పంపిణీ చేయాలని కోరారు. గతంలో కూడా ఎస్టీలకే భూములు పంపిణీ చేశారని, ఎస్సీలకు పంపిణీ జరగలేదని వాపోయారు. తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలంటూ వాదనకు దిగారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్‌కె.సంజీవరావు, మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, వీఆర్‌వో ఎం.రమణారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు

సింగరాయకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు సూచించారు. మండలంలోని బింగినపల్లిలో శనివారం ఆగ్రామ అభ్యుదయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో నానాటికీ ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ఆరోగ్య నియమాలు పాటించాలి సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన వారు స్వగ్రామాల్లో సేవా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ప్రజలు దీర్ఘకాలిక రోగాల బారిన పడకుండా ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రాష్ట్ర టూరిజం బోర్డు ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ శిబిరం ఏర్పాటుకు సహకరించిన ఒంగోలు కిమ్స్, విజయవాడ అనిలా హాస్పిటల్స్ వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు నూకసాని సుబ్బారావు, గ్రామ సర్పంచ్ జట్టి విజయలక్ష్మి, టీడీపీ నేతలు సన్నెబోయిన శ్రీనివాసులు, పులి ప్రసాద్, అభ్యుదయ కమిటీ సభ్యులు నూకసాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మెగా వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

బాలికకు వేధింపులు

నిందితుడిపై పోక్సో కేసు నమోదు

కొండపి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కొండపి మండలం కె.ఉప్పలపాడులో 12 ఏళ్ల బాలికను 52 సంవత్సరాల వ్యక్తి వేధిస్తున్నాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్ కథనం మేరకు.. ముండ్లమూరు మండలానికి చెందిన దంపతులు తమ 12 ఏళ్ల కుమార్తెను తీసుకొని పచ్చాకు పనుల కోసం సుమారు రెండు నెలల క్రితం కె.ఉప్పలపాడుకు వచ్చారు. తల్లిదండ్రులు రోజూ పచ్చాకు పనులకు వెళ్తుండగా బాలిక తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న నివాసంలో ఒంటరిగా ఉంటోంది. అక్కడే పొగాకు బ్యారన్ వద్ద పనిచేస్తున్న సాధు వెంకటకోటయ్య ఆ బాలికను కొద్దిరోజులుగా వేధిస్తున్నాడు. ఆమె ప్రైవేటు భాగాలను తాకుతూ వెకిలిగా ప్రవర్తిస్తున్నాడు. ఆయన వేధింపులకు తట్టుకోలేకపోయిన బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు శనివారం ఉదయం కొండపి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వెంకటకోటయ్యపై పోక్సో కేసు నమోదు చేశారు. కనిగిరి డీఎస్పీ ఈశ్వర్‌యశ్వంత్ సాయంత్రం గ్రామానికి వెళ్లి విచారించారు. కేసును ఆయన దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

నివాళులర్పించిన కలెక్టర్ అన్సారియా, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తదితరులు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ మేరకు స్థానిక ప్రకాశంభవనం సమీపంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు సమితి నగర అధ్యక్షుడు గుంటూరి ప్రభుదాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మేయర్ గంగాడ సుజాత, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. మాజీ ఉప ప్రధానిగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, డీఆర్వో చినఓబులేసు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి రాజు, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజక్, నాయకులు టీఏ.కిషోర్‌బాబు, తేళ్ళ జాన్సన్, కనుమూరి సుబ్బారావు, రవికుమార్, రాయపాటి సుబ్బారావు, కంభంపాటి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో..

బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఒంగోలులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మూరి రవిచంద్ర, చుండి శ్యామ్, వై.శశికాంత్ భూషణ్, గొల్లపూడి బాబూరావు, హగ్గయ్యరాజ్, కామేపల్లి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి బండారు మదన్, పెద్దిశెట్టి వరలక్ష్మి, కుంచాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..



నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్, పోలీసు అధికారులు

ఒంగోలు క్రైం: సామాజిక న్యాయం కోసం కృషి చేసిన మహనీయుడు బాబూజగ్జీవన్‌రామ్ అని ఎస్పీ ఏఆర్.దామోదర్ కొనియాడారు. శనివారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో..

ఒంగోలు కలెక్టరేట్: స్థానిక వైసీపీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, మాదాసి వెంకయ్య, వైఎం.ప్రసాదరెడ్డి,



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ అన్సారియా, మేయర్ సుజాత, ఎమ్మెల్యే విజయ్‌కుమార్

బత్తుల బ్రహ్మానందరెడ్డి, కఠారి శంకర్, డీఎస్.క్రాంతికుమార్, బొట్లా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

- జగ్జీవన్‌రామ్ జయంతిని స్థానిక జడ్పీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జడ్పీ పరిపాలనాధికారులు చల్లా శ్రీనివాసకుమార్, పసుపులేటి శ్రీనివాసరావు, చుండూరి వెంకటసుబ్బారావు, రావినూతల పద్మావతిలు నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.
- బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకట్రావు, శ్రీనివాసులు, ప్రసాదరావు, కుమారస్వామి, కొండలరాయుడు, కె.దేవసహాయం, శరత్‌చంద్రబాబు, మనోహరరావు పాల్గొన్నారు.
- కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఒంగోలులో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి రాష్ట్ర కమిటీ సభ్యుడు అట్లూరి రాఘవులు, బి.రఘురాం, మోజెస్ నివాళులర్పించారు.

ఈదుమూడిలో..

నాగులుప్పలపాడు: దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ అని టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్ అన్నారు. ఈదుమూడిలోని జగజ్జీవన్‌రామ్‌కాలనీలో జగజ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుర్రా వీరాంజనేయులు, కొండ్రగుంట రంగారావు, లంబు నాగేశ్వరరరావు, తేళ్ల ఏలియా, కొమ్మూరి సైమన్, చీలి కోటయ్య, కొమ్మూరి యాకోబు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకురి : జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు చీమకుర్తి పట్టణంలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. మందా కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం జరిపారు. కార్యక్రమంలో తొరటి ఆనంద్, బొంతా ఏసుదాసు, కోటేశ్వరరావు, జడ విజయ్‌కుమార్, పాటిబండ్ల జక్రయ్య, కొండయ్య, వెంకటేశ్వర్లు, సలోమాను, కర్లా ప్రసాద్, పాటిబండ్ల భిక్షాలు పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ: అణగారిన వర్గాల హక్కుల సాధనకు, అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి బాబూజగ్జీవన్‌రామ్ అని ఎస్పీ దామోదర్ కొనియాడారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా శనివారం నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఎస్పీ పాల్గొన్నారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు ఎనలేనివని కీర్తించారు. కార్యక్రమంలో సీఐ హజరతయ్య, ఎస్సైలు బి.మహేంద్ర, నాగమల్లేశ్వరరావు, బత్తుల మహేంద్ర పాల్గొన్నారు.



ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

కొండపిలో..

కొండపి: మాజీ ఉపప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని స్థానిక మండల కార్యాలయాల సెంటర్‌లో శనివారం వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఢాకా పిచ్చిరెడ్డి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో యనమద్ని రాయుడు, పలుగ్రామాల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మద్దిపాడులోని టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు ప్రభాకర్‌రావు, చింతల శ్రీనివాసరావు, పోకూరి శ్రీనివాసరావు, రావి నరసింహారావు, దుద్దకూరి డేవిడ్, కాకర్ల వాసుబాబు, కొత్త సుమన్, శుద్దపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు. అటు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అరుణ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్, మండవ బాలచంద్రమౌళి, నారా సుబ్బారెడ్డి, ఎండీ.మజీజ్, పయనం ప్రభాకర్, బోడె పోగో కొండయ్య, వైసీపీ నాయకులు పాల్గొన్నారు. బసవన్నపాలెం అరుంధతి నగర్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు జయంత్‌బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండవ గోవిందరాజులు, అబ్బూరి శేషగిరిరావు, రెబ్బవరపు ప్రభాకర్‌రావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు చర్యలు

- కొత్త మోటార్లు ఏర్పాటు
- ప్రారంభించిన మేయర్ సుజాత

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈమేరకు గత కొద్దిరోజులుగా నగరంలో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారడం, అందుకు మోటార్లు సమస్య ప్రధానంగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో యుద్ధప్రాతిపదికన రూ.24 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన మూడు మోటార్లను న్యూ ఫిల్టర్‌బెడ్‌లో ఏర్పాటు చేయగా మేయర్ గంగాడ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొత్త మోటార్లు ఏర్పాటు వల్ల 7వ జోన్‌లో నీటి సరఫరాలో ఇబ్బందులు తొలగుతాయని చెప్పారు. అలాగే ముందు ఉన్న 45 హెచ్‌పీ మోటారు ఇప్పటికే రెండుసార్లు రీవైండింగ్ జరిగిందన్నారు. నగర నీటి అవసరాల దృష్ట్యా కొత్తవాటిని కొనుగోలు చేశామని చెప్పారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశాలతో నగరంలో నీటి సరఫరాలో సమస్యలేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈ చంద్రయ్య, డీఈ అనిల్, ఏఈ రాజశేఖర్, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ కాట్రగడ్డ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



నూతన మోటార్లను ఆన్ చేస్తున్న మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

తాగునీటి పరీక్షలు పరిశీలన

నగరంలో తాగునీటి పరీక్షలను కమిషనర్ వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఈ మేరకు రెండవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి నగరంలోని ఓవర్ హెడ్ ట్యాంకులకు విడుదల చేసే నీటిని తనిఖీ చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కలుషిత నీరు వలన ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. ఖచ్చితంగా తాగునీటి పరీక్షలు చేసిన తర్వాత విడుదల చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

ఎమ్మెల్యే బీఎన్ ● పాటిమీదపాలెం స్కూలులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

చీమకుర్తి, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాటిమీదపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో దాతల సహాయంతో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. బడుగు, బలహీన వర్గాలు ఎక్కువగా ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందివ్వటమే కాక, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సహకరిస్తున్న దాతలను అభినందించారు. చివరిగా ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీసీతారామస్వామి ఆలయంలో నేడు గోపూజ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం సీతారామపురంలో ఉన్న శ్రీసీతారామస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 7గంటలకు గోపూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ సేవా సమితి అధ్యక్షుడు మొగిలి ఆనందరావు తెలిపారు. శనివారం స్థానిక ఆలయ ప్రాంగణంలో ఈమేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటల నుంచి శ్రీసీతారామస్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, క్విస్ విద్యా సంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు. నగరంలోని ప్రజలందరూ కుటుంబ సమేతంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తోట రవినాయుడు, పెద్దిశెట్టి వరలక్ష్మి, ఏనుగుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

30శాతం ఐఆర్‌ను ప్రకటించాలి : ఏపీటీఎఫ్

ఒంగోలు విద్య, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ.కీర్తి డిమాండ్ చేశారు. స్థానిక హెచ్‌ఎం అసోసియేషన్‌భవన్‌లో శనివారం ఏపీటీఎఫ్ జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షుడు బి.వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్.లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీఏ, సరెండర్‌లీవ్‌ల బకాయిలు విడుదల చేయాలని, 117 జీవోను పూర్తిగా రద్దు చేసి పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు మీడియం కొనసాగించాలని, విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి గ్రామ పంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ స్కూలును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీని వెంటనే ప్రకటించి టీచర్ పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో ఐఫీయా, ఏపీటీఎఫ్ నాయకులు పీవీ.సుబ్బారావు, బి.అశోక్‌కుమార్, పీవీ.ప్రభాకరరావు, టి.పాండురంగస్వామి, సీహెచ్.కబీర్, సురేష్‌బాబు, జి.పాండు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కీర్తి

శ్రీరామనవమి శుభాకాంక్షలు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీరాముడి మార్గంలోనే ఆదర్శ సమాజం కోసం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పండగను ప్రజలు అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను అందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.
- మాజీమంత్రి శిద్దా రాఘవరావు, జిల్లాప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

మద్దిపాడు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్థల యజమానులు తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ శివరామయ్య సూచించారు. శనివారం మద్దిపాడులో ఆయన మాట్లాడుతూ వ్యాపార సంస్థలు, హోటళ్లు, పలు కార్యాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దీనివల్ల నేర నియంత్రణ చేయవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పన్ను చెల్లింపులపై 5 శాతం వడ్డీ రాయితీ

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెల్లించాల్సిన ఆస్తి, నీటి, ఖాళీ స్థలం పన్నులు ముందుగానే చెల్లించే వారికి వడ్డీపై 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పన్నులు చెల్లింపునకు ప్రజలు సహకరించారన్నారు. అలాగే వచ్చే ఏడాది మార్చి 31లోపు చెల్లించే పన్నులకు ఎలాంటి వడ్డీ భారం లేకుండానే ముందుగానే చెల్లించే అవకాశం ఉందని, అందులో భాగంగా 5 శాతం వడ్డీ రాయితీని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కల్వర్టును ఢీకొన్న టిప్పర్



కల్వర్ట్ గోడను ఢీకొన్న టిప్పర్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పిన టిప్పర్ రోడ్డు పక్కనున్న కల్వర్టును ఢీకొన్న సంఘటన ఉప్పుగుండూరు వద్ద హైవేపై శనివారం తెల్లవారుజామున జరిగింది. చీరాల వైపు నుంచి ఒంగోలు వెళుతున్న టిప్పర్ ఉప్పుగుండూరు సమీపంలోని నాగన్న వాగు వద్ద రోడ్డు పక్కనున్న కల్వర్టు గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

ఒంగోలు క్రైం, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతూ గుర్తుతెలియని వృద్ధురాలు (60)మృతి చెందింది. ఈ సంఘటన టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం జరిగింది. చెన్నై నుంచి వెళుతున్న హజరత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో ఆమె శరీరం ఛిద్రమైంది. రైల్వే ఎస్ఐ కె.మధుసూదనరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సాధికారతకు టీడీపీ కృషి

- ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): మహిళలకు మెరుగైన అవకాశాలు కల్పించి మహిళా సాధికారతకు తెలుగుదేశం పార్టీ విశేషంగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. మద్దిపాడు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన మన్నం రాజేశ్వరి, మన్నం ప్రసాద్, చీమకుర్తి టీడీపీ నాయకులతో కలిసి శనివారం ఒంగోలులో ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి రావటానికి సంపూర్ణ సహకారం అందించినందుకు బొకేను అందజేసి రాజేశ్వరి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. గత ఎన్నికల సమయంలో తన గెలుపు కోసం మన్నం ప్రసాద్, రాజేశ్వరి దంపతులు చేసిన కృషిని గుర్తుచేశారు. రాబోయే కాలంలో మహిళలకు ఇంకా మెరుగైన అవకాశాలను కల్పిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గొల్లపూడి సుబ్బారావు, కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి రాంబాబు, మన్నం వెంకయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, శిద్దా సుధాకర్, కందిమళ్ల గంగాధరరావు, బుజ్జి, పూనాటి వెంకట్రావు, రామినేని యోగయ్య, గొల్లపూడి కోటేశ్వరరావు, కరుణాకరరెడ్డి, ముప్పూరి చలమయ్య, యడ్లపల్లి సురేష్, గొల్లపూడి శ్రీనివాసరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు బొకే అందజేస్తున్న మన్నం రాజేశ్వరి, ప్రసాద్

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం వద్ద కోలాట ప్రదర్శన

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : వసంత నవరాత్రులలో భాగంగా శనివారం జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నిర్మల్ నగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నిర్మల్‌నగర్ పార్కు దగ్గర ఏర్పాటు చేసిన ఎదురుకోలు, క్విజ్ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ సందర్భంగా ములుకుట్ల సుబ్రహ్మణ్యశర్మ, కోటేశ్వరశర్మల ఆధ్వర్యంలో ఎదురుకోలు సన్నాహ కార్యక్రమాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. అనంతరం పురాణాలకు సంబంధించిన క్విజ్‌ను పి.మాధవి, కృష్ణవేణిలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, తాటిపర్తి గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ కంచర్ల సుబ్బారావు, ఎన్.భాస్కరరావు, సోమేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షించారు. అటు స్థానిక సీతారాంపురం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కోలాట ప్రదర్శన సైతం భక్తులను ఆకట్టుకుంది.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని బీమ్ సేవా సమితి, బీమ్ ప్రగతి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంబేడ్కర్ క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగుతోంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో కేసీసీ, ఎఫ్‌సీసీ జట్లు తలపడగా, కేసీసీ జట్టు విజయం సాధించింది. 54 పరుగులు సాధించి జట్టు గెలుపుకు కృషి చేసిన వంశీ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ సర్పంచ్ కాట్రగడ్డ రఘుపతిరావు, న్యాయవాది ముప్పరాజు నాగేశ్వరరావు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు దాసరి కోటేశ్వరరావు, ఎం.ఆదినారాయణ, పిల్లి శ్రీరాములు, అంగలకుర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బహుమతిని అందజేస్తున్న రఘు

ఘనంగా ఆంధ్ర హైస్కూల్ స్నాతకోత్సవం

ఒంగోలు(రూరల్), ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆంధ్ర హైస్కూల్ స్నాతకోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు అతిథులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డాక్టర్‌లు రామలింగేశ్వరరావు, రమణారెడ్డి, కార్తిక్, ఏపీటీసీఏ టౌన్ అధ్యక్షురాలు లక్ష్మి, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు, డైరెక్టర్ విజయలక్ష్మి, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న అతిథులు

కందుల కొనుగోలు కేంద్రం పరిశీలన

కొండపి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెట్లూరులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏవో విజయ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కందులు పండించిన వారు ఆ గ్రామ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో వీఏఏల వద్ద సీఎం యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఆతర్వాత మాత్రమే కొనుగోలు కేంద్రంలో కందులు కొంటారని తెలిపారు. ఇప్పటి వరకు 450 క్వింటాళ్ల కందులను రైతులు అమ్మారన్నారు. క్వింటాకు రూ.7,550 మద్దతు ధర ప్రభుత్వం ఇస్తున్నదన్నారు. కార్యక్రమంలో కొండపి పీఏసీఎస్ సీఈవో నల్లపు పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఏవో విజయ్‌కుమార్

10న ప్రజావేదిక

సంతనూతలపాడు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో ఈనెల 10న ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారన్నారు. అధికారులు, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

క్రైం సమాచారం

రోడ్డుప్రమాదంలో బాలుడు మృతి

గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఘటన



మృతిచెందిన శివకాశి

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తిప్పాయపాలెం గ్రామం వద్ద శనివారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోడే శివకాశీ (8) విద్యార్థి స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. శనివారం ఇంటి నుంచి బాలుడు జాతీయ రహదారి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో స్థానికులు హుటాహుటిన కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తిప్పాయపాలెం గ్రామానికి చెందిన కోడె వెంకటేశ్వర్లు, బాలకుమారిల దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడి రోడ్డు దాటుతూ అకాల మృతితో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. శివకాశీ రోడ్డు వెంబడి ఉన్న ఓ దుకాణంలో తినుభండారాలు కొనుక్కోనేందుకు రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. రూరల్ ఎస్ఐ అంకమ్మరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవా మద్యం బాటిళ్ల పట్టివేత



పట్టుబడిన గోవా మద్యం

కంభం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం చిన్న కంభం గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిలువ ఉంచిన 50 గోవా ఫుల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు చిన్నకంభం గ్రామానికి చెందిన నక్కా ప్రసాద్ ఇంట్లో శోదాలు నిర్వహించారు. 50 మద్యం సీసాలు పట్టుబడినట్లు తెలిపారు. గతంలో ఇదే ఇంట్లో పలుమార్లు దాడులు నిర్వహించి గోవా మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మార్కాపురం రూరల్, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మార్కాపురం రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మార్కాపురం మండలం పెద్ద యాచవరం గ్రామానికి చెందిన యర్రగుంట్ల అల్లూరయ్య (58) వ్యవసాయ కూలిగా జీవనం వెళ్లదీస్తున్నాడు. శనివారం మార్కాపురం రైల్వేస్టేషన్ సమీపంలోని గజ్జలకొండ వైపు ఉదయం డోన్ నుండి గుంటూరు వైపు వెళ్తున్న రైలు క్రింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అల్లూరయ్యకు భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పంచనామా నిమిత్తం స్థానిక సర్వజన వైద్యశాలకు తరలించారు.

పొగాకు చెక్కుల దొంగలు అరెస్టు

తర్లుపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బర్లీ పొగాకు చెక్కులను రెండు నెలల నుంచి దొంగలు అపహరిస్తున్నారు. పొగాకు పొలాల్లో వేసిన మండెలను, చెక్కులను, దొంగలు ఎత్తుకెళ్లడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. శుక్రవారం రాత్రి నాయుడుపల్లె గ్రామానికి చెందిన తవణం మహేష్‌కు చెందిన చెక్కులను దొంగలు ఎత్తుకెళ్లారు. వాటిని తర్లుపాడులో ఒక వ్యాపారస్తుడికి విక్రయించినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. రైతులు వ్యాపారస్తుడి వద్దకు వెళ్లి పరిశీలించగా దొంగల పేర్లు చెప్పారు. ఈ మేరకు పలువురు రైతులు తర్లుపాడు ఎస్ఐ బ్రహ్మనాయుడుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువురు దొంగలను అదుపులోకి తీసుకుని విచారించారు. అక్రమంగా కొనుగోలు చేస్తున్న వ్యాపారస్తులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో దోషికి జైలు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న కేసులో గిద్దలూరు ప్రాంతానికి చెందిన వ్యక్తికి తిరుపతిలోని ఎర్రచందనం రాష్ట్రస్థాయి ప్రత్యేక సెషన్ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. అందిన సమాచారం మేరకు, గతంలో గిద్దలూరు మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన వెంకటరమణ ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో పట్టుబడ్డాడు. తిరుపతిలోని ఎర్రచందనం రాష్ట్రస్థాయి ప్రత్యేక జిల్లా సెషన్ కోర్టు విచారణ చేపట్టింది. కోర్టు వెంకటరమణను దోషిగా తేల్చి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.6లక్షల జరిమానా విధించింది. ఆయన్ను గుంటూరులోని సెంట్రల్ జైలుకు తరలించారు.

బెల్లం ఊట ధ్వంసం

● ఎక్సైజ్ శాఖాధికారులు విస్తృతదాడులు



బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

పెద్దదోర్నాల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ చెర్లోపల్లి గ్రామంలో ఎక్సైజ్ శాఖాధికారులు శనివారం విస్తృత దాడులు నిర్వహించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం వెంకటరెడ్డి అధ్వర్యంలో ఆ శాఖ సిబ్బందితో గ్రామం శివారు నల్లమల అటవీ ప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో నాటుసారా తయారు చేయడానికి సిద్ధంగా ఉన్న 400 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. నిందితుడు పిక్కిలి వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. విచారించి బెల్లం అమ్మిన వారి వివరాలు తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెంకటరెడ్డి తెలిపారు. నాటు సారా పాత నేరస్తులను తహసీల్దారుకు బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి



కొండాయపాలెం గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

పొదిలి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించారు. అందులో భాగంగా శనివారం మండలంలోని కొండాయపాలెం గ్రామంలో హరిత రాయబార పారిశుధ్య కార్మికులు సైడు కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభించారు. గ్రామంలో మొత్తం తిరుగుతూ చెత్తాచెదారం తీసి మురుగునీరు నిల్వలు లేకుండా చేస్తున్నారు. అన్నిగ్రామాల్లో ఇదే తరహా కార్యక్రమం చేపట్టాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యూ శేషగిరి పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాల నియంత్రణ

డీఎస్పీ నాగరాజు



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నిరంతరం అప్రమత్తంగా ఉండడంతోనే సైబర్ నేరాలను నియంత్రణ సాధ్యపడుతుందని మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు అన్నారు. ఆయనతో డివిజన్ పరిధిలోని పలు అంశాలపై జరిపిన 'ముఖాముఖి'లో వివరాలు వెల్లడించారు.

ప్రశ్న: సైబర్ నేరాల నియంత్రణకు పోలీసుశాఖ ఎంత కసరత్తు చేస్తున్నా ఎందుకు ఉధృతి తగ్గడం లేదు?

డీఎస్పీ: సాంకేతిక పెరగడంతో పాటు దాన్ని దుర్వినియోగం చేసేవాళ్ల సంఖ్య కూడా పెరుగుతోంది. సాంకేతికతను అడ్డుపెట్టుకుని ఆర్థిక మోసాలకు పాల్పడే వాళ్లకు కొదవలేకుండా పోతోంది. ముఖ్యంగా గతంలో కొన్ని పద్ధతుల ద్వారా సైబర్ నేరాలకు పాల్పడేవాళ్లు. వాటికి అడ్డుకట్ట వేసేసరికి ఇప్పుడు కొత్తపంథాలో మోసాలకు పాల్పడుతున్నారు. ఒకప్పుడు ఓటీపీలు అడిగితే ఎవరైనా చెబితే బ్యాంకు ఖాతాలు కొల్లగొట్టేవాళ్లు. కానీ ఇప్పుడు ఒక చిన్నపాటి లింక్ పంపి కూడా ఖాతాల్లో డబ్బులు దోచేస్తున్నారు. అంతేకాక ఫోన్‌లు హ్యాక్‌చేసి వ్యక్తిగత సమాచారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజల్ని నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వీటన్నింటికీ శాశ్వతపరిష్కారం అనేది ఉండదు నిరంతరం ప్రజలు అప్రమత్తంగా ఉండడంతోనే వాటికి అడ్డుకట్ట పడుతుంది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసుశాఖ సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది.

ప్రశ్న: గంజాయి వినియోగం ఎక్కువగా ఉంది. కట్టడికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.?

డీఎస్పీ : గతంతో పోల్చితే గంజాయిపై పోలీసుశాఖ ప్రత్యేక దృష్టిపెట్టింది. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే గంజాయి అమ్మకందారులను గుర్తించి కేసులు నమోదు చేశాం. గంజాయికి అలవాటుపడ్డ కొందరు ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుని సేవిస్తున్నట్లు సమాచారం ఉంది. వారిపై కూడా దృష్టిపెట్టాం తప్పకుండా గంజాయి విక్రయాలను, వినియోగాన్ని నియంత్రిస్తాం.

ప్రశ్న: ప్రధాన పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.?

డీఎస్పీ : ఒకప్పటితో పోల్చితే నేడు వాహనాల సంఖ్య కొన్ని రెట్లు పెరిగింది. కానీ అదే సమయంలో రహదారులు మాత్రం కుంచించుకు పోతున్నాయి. ఇప్పటికే మార్కాపురం పట్టణంలో ప్రధాన రహదారుల్లో ఆక్రమణల తొలగింపు వలన ప్రస్తుతం కొంతమేర ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయి. డివిజన్‌లోని ఇతర పట్టణాల్లో కూడా ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, మున్సిపాలిటీ, పంచాయితీ అధికారులు చొరవచూపి ఆక్రమణల తొలగింపు చేపడితే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.

ప్రశ్న: రహదారి ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.?

డీఎస్పీ : డివిజన్ పరిధిలోని జాతీయ రహదారులపైనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రవాణశాఖతో కలిసి ఇప్పటికే బ్లాక్‌స్పాట్స్ గుర్తించాం. వేకువజామున జరిగే ప్రమాదాలతోనే ప్రాణనష్టం ఎక్కువగా ఉంటోంది. అదేవిధంగా టూవీలర్ వాహనాలపై జరిగే ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడంతోనే ఎక్కువశాతం మరణాలు నమోదవుతున్నాయి. డివిజన్ పరిధిలో హెల్మెట్ వాడకంపై ప్రత్యేకడ్రైవ్‌లు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం. వాహనదారులు హెల్మెట్‌ను తప్పక ధరించేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: చోరీలు, చైన్ స్నాచింగ్‌లు ఎక్కువయ్యాయి. నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

డీఎస్పీ: దొంగతనాలకు సంబంధించి డివిజన్ పరిధిలో పెండింగ్ కేసులు దాదాపు పరిష్కరించాం. దొంగతనాలు జరగకుండా పట్టణాల్లో రాత్రి గస్తీ కూడా పక్కాగా జరుగుతోంది. తాళాలు వేసి ఉన్న ఇళ్లలోనే చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎక్కువ రోజులపాటు ఊర్లు వెళితే పోలీసుస్టేషన్‌లో తప్పక సమాచారం ఇవ్వాలి. ఆయా ఇళ్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెడతారు. అంతేకాక వేసవిలో ఆరుబయట నిద్రించడాన్ని దొంగలు అవకాశంగా మలుచుకునే ప్రమాదం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ప్రశ్న: బెట్టింగ్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

డీఎస్పీ : డివిజన్ పరిధిలో ఆర్గనైజ్డ్ బెట్టింగ్ ఎక్కడా జరగడంలేదు. ఎక్కువగా యువత మొబైల్‌లో యాప్‌ల ద్వారా బెట్టింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్ నేపథ్యంలో అన్ని పోలీసుస్టేషన్‌లను అప్రమత్తం చేశాం. గతంలో బెట్టింగ్‌లకు పాల్పడి కేసుల్లో ఉన్నవారికి కౌన్సిలింగ్‌లు నిర్వహించాం. బెట్టింగ్‌పై డివిజన్ పరిధిలో ప్రత్యేక దృష్టిపెట్టి నియంత్రణకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం.

వేంకటేశ్వరునిగా సీతారామస్వామి



వేంకటేశ్వరస్వామి అలంకరణలో రాములవారు

గిద్దలూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బద్వేల్ రోడ్డులోని సీతారామస్వామి దేవస్థానంలో వసంత నవరాత్రులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శనివారం స్వామి వారు వేంకటేశ్వరస్వామి ఆలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతల ద్వారా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాములస్వామి వార్ల ఎదురు కోల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన అందరిని అలరించింది. ఆయా కార్యక్రమాలలో దేవస్థాన గౌరవాధ్యక్షులు విఠా సుబ్బరత్నం, అధ్యక్షులు చీతిరాల నాగార్జున రావు, కార్యనిర్వాహక అధ్యక్షులు రాచపూటి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి శివపురం వెంకటరామయ్య పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

గిద్దలూరు : శ్రీరామనవమి వేడుకలకు ప్రజలు సిద్ధమయ్యారు. సీతారాముల కల్యాణ మహోత్సవాలు నిర్వహించేందుకు పలు దేవాలయాలలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని అమ్మవారిశాలలో 6వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగ సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ తెలిపారు. పాత బద్వేల్ రోడ్డులోని సీతారామస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి 7గంటలకు సీతారామచంద్రమూర్తుల దివ్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. అలాగే బద్వేల్ రోడ్డులోని పట్టాభిరామస్వామి దేవాలయంలో కూడా సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించనున్నారు. గ్రామాలలోని అన్ని రామాలయాలలో, ఆంజనేయస్వామి దేవస్థానాలలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. కాగా శ్రీరామనవమి పర్వదినాన్ని పురష్కరించుకుని విశ్వహిందూ పరిషత్, నియోజకవర్గాల దేవాలయాల సమన్వయ కమిటీ, సీతారామాంజనేయ ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు పాత బద్వేల్ రోడ్డులోని సీతారామస్వామి దేవస్థానం నుండి భారీఎత్తున మోటార్ సైకిళ్లతో శోభాయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



భరతనాట్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీరామనవమికి సర్వం సిద్ధం

మార్కాపురం వన్‌టౌన్ : శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలోని అన్ని వీధుల్లోని రామాలయాలను సిద్ధం చేశారు. పట్టణంలోని ప్రసన్న రామస్వామి, పట్టాభి రామస్వామి, కూరగాయాల మార్కెట్ వద్ద రామస్వామి ఆలయాలతో పాటు అన్ని ఆలయాల వద్ద చలువ పందిళ్లు సిద్ధం చేశారు. భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదంగా ఇవ్వనున్నారు. సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రామాలయాల వద్ద, ఇళ్ల వద్ద మామిడి తోరణాలు కట్టి పండుగ వాతావరణం ఏర్పాటు చేశారు.

ఎడ్ల బలప్రదర్శన పోటీలు

కంభం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం లింగోజీపల్లి గ్రామంలో ఉపదేశ రామస్వామి కల్యాణం సందర్భంగా 7, 8 తేదీలలో రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న జరిగే పోటీల్లో గెలుపొందిన ఎడ్ల జతలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, 8వ తేదిన జరిగే 6 పండ్ల విభాగంలో విజేతలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొనే యజమానుల సోమవారం ఉదయం 7 గంటల్లోపు రూ.500 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9908679558, 9573304649 నంబరును సంప్రదించాలన్నారు.

యోగా గురువుకు సేవా అవార్డు



సేవా అవార్డు అందుకుంటున్న యోగా గురువు నారాయణరెడ్డి

గిద్దలూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు బి.ఎస్.నారాయణరెడ్డికి మదర్‌థెరిస్సా జాతీయ సేవా పురస్కారం లభించింది. మార్కాపురంలోని ఆదరణ వెల్ఫేర్ సొసైటీ సేవా సంస్థ 10వ వార్షికోత్సవం సందర్భంగా నారాయణరెడ్డికి ఈ అవార్డును ప్రధానం చేశారు. మూడు దశాబ్దాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తూ, శుభకార్యాలలో మిగిలిన భోజనాలు పేదలకు పంచిపెడుతూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శంగా నిలిచారు. నారాయణరెడ్డికి మదర్ థెరిస్సా జాతీయ సేవా అవార్డును అందిస్తున్నట్లు ఆదరణ సంస్థ వ్యవస్థాపకులు చెన్నకేశవులు పేర్కొన్నారు.

సోలార్ వీధి లైట్ల ఏర్పాటు



చెన్నారెడ్డిపల్లెలో ఏర్పాటు చేసిన సోలార్ వీధిలైట్లు

తర్లుపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రీ-న్యూ సోలార్ ప్లాంట్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని చెన్నారెడ్డిపల్లి, తర్లుపాడులో సోలార్ విద్యుత్ లైట్‌లను ఏర్పాటు చేశారు. రీ-న్యూ సోలార్ సంస్థ రూ.7.50లక్షలతో 25 సోలార్ విద్యుత్ లైట్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఇప్పటి వరకు ప్రజలు విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో సోలార్ లైట్ కాంతులతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెన్నారెడ్డిపల్లి, తర్లుపాడు సర్పంచులు కుందురు వెంకట సుబ్బులు, పల్లెపోగు వరాలు, మాజీ సొసైటీ అధ్యక్షులు కె.సత్యనారాయణరెడ్డి, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుపై రాయితీ

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 30వ తేదీ లోపు ఇంటిపన్ను ఏకమొత్తంలో చెల్లిస్తే వారికి 5శాతం రాయితీ ఇస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని నగర పంచాయతీ కమీషనర్ ఐ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్ను ఏప్రిల్ 30లోపు చెల్లిస్తే ప్రభుత్వం 5 శాతం రాయితీ ఇస్తోందన్నారు. స్థానిక కార్యాలయంలో ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాలయ్యకు సన్మానం

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన బైలడుగు బాలయ్యయాదవ్‌ను ఉయ్యాలవాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీఆర్‌డీ.కుమార్ మాట్లాడుతూ ఈ పాఠశాల పూర్వవిద్యార్థి, పాఠశాల అభివృద్ధికి తోడ్పడిన వ్యక్తి బైలడుగు బాలయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలగురువయ్య, వెంకటేశ్వర్లు, మహబూబ్‌పీరా, పుల్లయ్య, పుల్లానాయక్, వేణుగోపాల్, కాదరయ్య పాల్గొన్నారు.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ

కంభం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కంభంలోని కందులా పురం కూడలిలో సీఐటీయూ జెండాలను తిరిగి శనివారం ఆవిష్కరించారు. ఆ సంఘం మండల నాయకులు అన్వర్ మాట్లాడుతూ మార్చి 12న జాతీయ రహదారి విభాగం అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సీఐటీయూ జెండాను పీకివేశారన్నారు. తాము ధర్నాలు, రాస్తారోకో సిద్ధమవడంతో ఎస్ఐ నరసింహారావు జెండా ఆవిష్కరణకు అనుమతిస్తానని హామీ ఇచ్చాడన్నారు. దీంతో తాము ఆందోళన విరమించుకున్నామని, ఇచ్చిన హామీమేరకు ఎస్ఐ జాతీయ రహదారి విభాగం అధికారులతో మాట్లాడి జెండా ఆవిష్కరించుకోవడానికి అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. శనివారం సిఐటియు మండలకమిటీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు కలిసి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రోశయ్య. ఖాజావలి, కొత్తూరు, జర్మియా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణను అలవరుచుకోవాలి

● టీడీపీ సీనియర్ నాయకుడు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి



బహుమతులు అందజేస్తున్న కృష్ణకిషోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రమ శిక్షణ కూడా అలవరుచు కోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సీతారామ కళ్యాణ మండపంలో అరుణోదయ ఐఐటీ ఫౌండేషన్ స్కూల్ 29వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నపిల్లలను విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ జింకా చంద్రశేఖర్, ఎంఈవోలు కావడి వెంకటేశ్వర్లు, నాగభూషణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దప్పిలి భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాలుగుళ్ల చిన్నశ్రీనివాసరెడ్డి, సాహితి కొండారెడ్డి, జేవీవీ నాయకులు స్వరూపారెడ్డి, కౌన్సిలర్లు గడ్డం భాస్కర్‌రెడ్డి, లొక్కు రమేష్, చంద్రశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎరిక్షన్‌బాబు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన ఆణిముత్యం బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య అన్నారు. స్థానిక పూలసుబ్బయ్య భవన్‌లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు విజయరామరాజు వర్ధంతి నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ప్రసాద్ రావు, రవికుమార్, ప్రవీణ్, రాజా రమేష్, రంగారావు, ఏఐటీయూసీ నాయకులు కాశీం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మహజన సోషలిస్టు పార్టీ మాదిగ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి గడియారస్తంభం వద్ద నిర్వహించారు. సీఐ సుబ్బారావు పాల్గొని అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ ఇన్‌చార్జ్ పి.కాశీరావు, ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎనిబెర కిశోర్, ఎంఈఎఫ్ నాయకులు చార్లెస్, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాపయ్య, నాగేంద్ర, దాస్, లూకా, గాలీబ్ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి బాలవెంకటేశ్వర్లు అధ్యక్షతన స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న జగజీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బుజ్జిబాబు, సత్యనారాయణరెడ్డి, పాలడుగు వెంకటేశ్వర్లు, సీహెచ్ లింగయ్య, సింగంపల్లి సుబ్బారావు, మల్లిఖార్జున్, శ్రీనివాస్, ఆంజనేయరెడ్డి, చంద్రమౌళి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : బాబుజగ్జీవన్‌రామ్ 117వ జయంతిని మండలంలోని పలు గ్రామాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా త్రిపురాంతకంలో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ దళిత కుటుంబంలో పుట్టిన జగ్జీవన్‌రామ్ దళితజాతికే కాకుండా యావత్ భారతదేశ ప్రజలు బాబూజీ అని పిలిపించుకునే స్థాయికి ఎదిగారన్నారు.

పెద్దదోర్నాల: స్థానిక వైసీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ ఘంటా వెంకట రమణారెడ్డి అధ్యక్షతన ఆ పార్టీ నాయకులు బాబూజగజీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు నాగయ్య, నాయకులు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కంభం : కంభంలో డాక్టర్ జగజ్జీవన్‌రావు 117వ జయంతిని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్‌పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తహసీల్దార్ కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై జగజ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్సీ హాస్టల్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్రనాయకులు పానుగంటి షాలెంరాజు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు నేదురుపల్లి జయరాజ్, ఆర్ఐ పీరా, డిటి వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, ముజీర్ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నగర పంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్తగా, పార్లమెంటేరియన్‌గా విశేష సేవలందించారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లొక్కు రమేష్, టీడీపీ నాయకులు మండ్ల శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది టపావలి పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : సమాజంలో ఉన్న అసమానతలను తొలగించేందుకు మాజీ ఉపప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ చేసిన కృషి అమోఘం అని ఎర్రగొండపాలెం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పుల్లలచెరువు ఎంపీపీ వెంకటయ్య, టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, మేకల వలరాజు, వై.మల్లికార్జునరెడ్డి, పయ్యావుల ప్రసాదు, చిట్యాల వెంగళరెడ్డి, గర్నిపూడి వినయ్, తదితరులు పాల్గన్నారు.

● మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం 117వ జయంతి సందర్భంగా జడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం అజరామరామం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.కిరణ్‌గౌడ్, వైసీపీ మండల కన్వీనరు ఏకుల ముసలారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, పాస్టర్ల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఎస్ సుందరరాజు,జబీబుల్లా, ప్రసాదు పాల్గొన్నారు.







మార్కాపురం, గిద్దలూరులో జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న నాయకులు, వై.పాలెంలో వైసీపీ నాయకుల నివాళి

అవీ..ఇవీ



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న సరస్వతీ విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

తాళ్లూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీ సరస్వతీహైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గుంటూరు జిల్లాలో జరిగిన టి.టెన్‌టెన్నీస్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 విభాగంలో పదవ తరగతివిద్యార్థి తిరుపతిరెడ్డి, అండ్-14 విభాగంలో 8వ తరగతికి చెందిన కె.కార్తిక్‌రెడ్డి, ఎం.కార్తిక్, 9వ తరగతికి చెందిన పి.సంతోష్‌లు ఉత్తమ ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిపోటీలకు ఎంపిక కావటం పట్ల శ్రీ సరస్వతీ విద్యాసంస్థల అధినేత ఏవీ రమణారెడ్డి, హెచ్‌ఎం వావిలాల శ్రీరామమూర్తి, పీఈటీ బిజ్జం వికాస్‌లు విద్యార్థులను అభినందించారు.



దేవస్థానంలో పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

నేడు మహా అన్నదానం

పామూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని ఆకులవీధిలో గల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీరామనవమి వసంత వేడుకల సందర్భంగా భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన గౌరవ అధ్యక్షుడు డాక్టర్ గద్దె ఏడుకొండలు, గద్దే శేషగిరిలు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. నవమి వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఆదివారం ఉదయం స్వామివార్ల శాంతికల్యాణం, మధ్యాన్నం భక్తులకు మహా అన్నదానం, రాత్రికి వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ఛైర్మన్ కటకం శివప్రసాద్ తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో వాయునేని చిన మాల్యాద్రి, కోశాధికారి వాయనేని మాధవ, కటకం మోహన్‌రావు, గద్దే ప్రసాదు, ఉప్పలపాటి సునీల్, గాలి వెంకటేశ్వర్లు, ఉన్నారు.



రామాలయంలో జరిగిన పూజలో పాల్గొన్న భక్తులు

రామాలయంలో కుంకుమార్చన పూజలు

పీసీపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా మండలంలోని పెదయిర్లపాడు రామాలయంలో శనివారం సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన విశేష పూజలను జరిపించారు.ఈ కార్యక్రమంలో గ్రామప్రజలు, భక్తులు పాల్గొన్నారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

శ్రీరామనవమి పండుగకు ఆలయాల ముస్తాబు

ముండ్లమూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని భక్తులు రామాలయాల ముందు పందిళ్లు వేశారు. మండలంలోని భీమవరం, కొక్కెరకొండాయపాలెం, పసుపుగల్లు, వేంపాడు, ముండ్లమూరు, శంకరాపురం గ్రామాల్లో పందిళ్ళు వేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలంకరణలతో తీర్చిదిద్దారు.

రక్షిత నీటిని అందించడమే ధ్యేయం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

సీఎస్‌పురం(పామూరు) ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలకు రక్షిత మంచినీటిని అందించడమే తన ప్రధాన ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని అంబవరం కొత్తపల్లి గ్రామంలోని శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థాన ప్రథమ వార్షిక వేడుకల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఉగ్ర శనివారం పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి బిందెలతో నీటిని పట్టి మహిళలకు అందజేశారు. అలాగే గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ మ్యాచ్‌లను ప్రారంభించి, బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. క్రీడలు యువకుల మధ్య మైత్రి బావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఉగ్రను క్రికెట్ మ్యాచ్‌ల నిర్వాహకులు, క్రీడాకారులు శాలువాతో ఘనంగా సన్మానించి మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, ఎన్‌సీ మాల కొండయ్య, గ్రామ సర్పంచ్ కొండూరు కొండయ్య, భైరవకోన ట్రస్ట్‌బోర్డు మాజీ ఛైర్మన్ ఎం. వెంకటరామరాజు, ముప్పాళ్ల శ్యాంసుందర్‌రాజు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు నీళ్ల బిందెను అందిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలి

కనిగిరి : చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు సహృదయంతో ముందుకు రావాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయం ఎదుట ప్రజల దాహార్తిని తీర్చేందుకు పారిశ్రామికవేత్త కాశిరెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతంలో వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయన్నారు. వివిధ అవసరాలు, పనుల నిమిత్తం వచ్చే పాదచారులు, ప్రజలు వేసవి కారణంగా డీహైడ్రేషన్ గురికావటం సాధారణంగా మారిందన్నారు. ఈ సమయంలో విరివిగా జనసంచార ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయటం వలన ప్రజలకు ఇతోధికంగా సేవలు అందించిన వారవుతారన్నారు. కాశిరెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీను, ఫిరోజ్, బడేబాయి, బాషా తదితరులు పాల్గొన్నారు.

'జలజీవన్'తో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణ

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాల శంకరరావు

ముండ్లమూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రతి గ్రామంలో జల జీవన్ మిషన్ ద్వారా తాగు నీటి ఎద్దడి సమస్యను నివారిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాల శంకర రావు అన్నారు. శనివారం మండలంలోని బొప్పూడి వారిపాలెం, భీమవరం, కొమ్మవరం, అయోధ్య నగర్, రమణారెడ్డిపాలెం, వేములబండ గ్రామాల్లో జల జీవన్ పథకం కింద ద్వారా రూ. 1.88 కోట్ల నిధులతో చేపట్టిన తాగు నీటి ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడుతూ రానున్న మూడు మాసాల్లో ఏ పంచాయతీలోనూ తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. సాగర్ జలాలను దర్శి ఎస్‌ఏపీ ట్యాంక్‌కు నింపుతున్నామన్నారు. అక్కడి నుంచి గ్రామాలకు రక్షిత నీటి ట్యాంక్ ద్వారా ఇంటింటికీ కుళాయి ద్వారా సరఫరా చేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శించాలన్నారు. ప్రధానంగా దర్శి నుంచి మండలంలోని వివిధ గ్రామాలకు సరఫరా అవుతున్న పైపులైన్‌లను లీకులు లేకుండా చూడాలన్నారు. కలుషిత నీరు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. మిగిలి పోయిన పనులను ఈనెలాఖరు కల్లా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముండ్లమూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమాన్ బాబు, పూర్వపు ఏఈ మధుబాబు తదితరులు ఉన్నారు.



బొప్పూడివారిపాలెంలో ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాల శంకరరావు



వృద్ధుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఏఎస్‌ఐ జిలాని బాషా

ఆశ్రమంలోని వృద్ధులకు పోలీసుల సహకారం

వెలిగండ్ల, ఏప్రిల్ 5 : (ఆంధ్రజ్యోతి) ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు వెలిగండ్ల ఏఎస్‌ఐ జిలాని బాషా అండగా నిలిచారు. శనివారం ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ఉన్న కాశినాయన ఆశ్రమంలో తలదాచుకుంటున్న వృద్ధుల దగ్గరికి వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు తెలిపి వారిని వెంటనే స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు మరికొంత మంది చిన్న చిన్న సమస్యలతో ఇంట్లో చెప్పకుండా వచ్చిన వృద్ధులను గుర్తించి వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

పేదవర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి మరువరానిది

జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పేదవర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ చేసిన కృషిని భావితరాలు గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా స్థానిక సర్కిల్ కార్యాలయం ఎదుట ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహోన్నత వ్యక్తుల ఆశయ ఫలాలు అందరికీ అందిననాడే వారికి నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీవీఆర్ మనోహరరావు (చిరంజీవి), దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసరెడ్డి, ఫిరోజ్, నజీముద్దీన్, తిరుపాలు, సిద్దాంతి బారాయిమాం, మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదాబేగం, దొరసానమ్మ, పార్వతమ్మ, తాతపూడి స్టాలిన్ (బుజ్జి), ప్రతాప్, కేవీఎస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో..

దర్శి : దివంగత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం దర్శిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎంఈఎఫ్ నేరెళ్ల జాన్, ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు గూడూరి యోగేశ్వరరావు తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. అదే విధంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోనూ వేడుకలు నిర్వహించారు.

దొనకొండలో

దొనకొండ: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సుధాకర్, మాజీ ఎంపీపీ నూనె విజయకుమారీ, ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు ఉప్పలపాటి కిరణ్‌ప్రసాద్ తదితరులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసిన నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

పామూరులో

పామూరు : స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, దేశ తొలి ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ 117 వ జయంతి వేడుకలను టీడీపీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అమీర్‌బాబు, మన్నం రమణయ్య, షేక్ ఖాజారహంతుల్లా, ఇర్రి కోటిరెడ్డి, డోలా శేషాద్రి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంఆర్‌పీఎస్, బీటీఏ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు.

తాళ్లూరులో

తాళ్లూరు : స్థానిక ఎస్సీకాలనీలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అనపర్తి ఆదామ్ మాదిగ్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు జరిగాయి. టీడీపీ ఎస్సీసెల్ మాజీ అధ్యక్షులు అనపర్తి సుబ్బారావు తదితరులు మాట్లాడారు. ముందుగా జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కురిచేడులో.

కురిచేడు : స్థానిక ఎస్సీ కాలనీలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులు అర్పించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ముఖాముఖి

పల్లె పండుగ పనులు నూరుశాతం పూర్తి

- విరల్‌రాథోడ్, పంచాయతీ రాజ్ డీఈ, దర్శి



ప్రశ్న: పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ఏఏ పనులు నిర్వహిస్తున్నారు ?

జవాబు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మతులకు రూ.15 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఆ పనులన్నీ పూర్తి అయ్యాయి. బిల్లులు కూడా పూర్తి చేసి ఉన్నతాధికారులకు పంపాము. త్వరలో బిల్లులు జమఅవుతాయి.

ప్రశ్న: జడ్పీ నిధుల ద్వారా ఏఏ పనులు నిర్వహిస్తున్నారు ?

జవాబు: జడ్పీ నిధులు ఒక్కో జడ్పీటీసీకి రూ.15 లక్షలు చెప్పున విడుదల అయ్యాయి. ఆ నిధులకు సంబంధించి పనులకు అంచనాలు తయారు చేసి పంపుతున్నాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

ప్రశ్న: గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు పెండింగ్ బిల్లులు ఎంత రావాలి ?

జవాబు: గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు రూ.6 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వంలో విజిలెన్స్ విచారణ వేసి బిల్లులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బిల్లుల్లో కోతలు లేకుండా గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన బిల్లులను యథాతథంగా రివైజ్ చేసి పంపాలని ఆదేశించారు. ఆ మేరకు ఎఫ్‌టీవోలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపాము. త్వరలో వారికి కూడా బిల్లులు జమ అయ్యే అవకాశం ఉంది.

ప్రశ్న: పాత బిల్లులకు ఎఫ్‌టీఆర్‌లు తయారు చేసినందుకు ఆరుశాతం మళ్లీ పర్సెంటేజీలు తీసుకుంటున్నారనే విమర్శలు వాస్తవమేనా ?

జవాబు: ఆ విషయం నాకు తెలియదు. ఏఈలు రివైజ్డ్ బిల్లుల ఎఫ్‌టీవోలు తయారు చేసి నేరుగా ఉన్నతాధికారులకు పంపించారు. దర్శి సబ్ డివిజన్ పరిధిలో సుమారు రూ.6కోట్లు బిల్లులు పంపించాము. త్వరలో వారికి బిల్లులు జమ అయ్యే అవకాశం ఉంది.

తల్లిదండ్రులను అశ్రద్ధ చేయవద్దు



సీఐ భీమానాయక్

పామూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) :వృద్ధాప్యంలో తల్లిదండ్రులను అశ్రద్ధ చేయవద్దని, వారికి సరైన ఆదరణ చూపకుండా నిర్లక్ష్యం చేస్తే అట్టి వారికి చర్యలు తీసుకుంటామని సీఐ ఎం. భీమానాయక్ హెచ్చరించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కొంతమంది వ్యక్తులు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పట్ల రాక్షసంగా ప్రవర్తించడం తన దృష్టికి తెచ్చారని, అటువంటి వారి సమస్యలపై పామూరు పోలీసులు తక్షణమే స్పందిస్తారని, అందుకోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. వృద్ధ తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు స్వయంగా రాలేకపోయినా కేవలం పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే పోలీసులు స్పందిస్తారన్నారు. అదే విధంగా పిల్లలు క్రికెట్ బెట్టింగ్‌ల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకసారి క్రికెట్ బెట్టింగ్‌లలో కేసులు నమోదైతే జీవితకాలం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సీఐ హెచ్చరించారు.

13 న పామూరులో జేవీవీ జిల్లా శిక్షణ తరగతులు

పామూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 13 న పామూరులో జేవీవీ జిల్లా స్థాయి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ టి. చెన్నకృష్ణ తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను స్థానిక చైతన్య నర్సింగ్ హోంలో శనివారం ఆవిష్కరించారు. శిక్షణ తరగతులను స్థానిక ఎస్వీ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తరగతులకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి. మాలకొండారెడ్డి, అబ్దుల్లా, కె. శంకర్, జి. శ్రీనివాస్, వెంకట్రావు, ఉదయ్, సురేష్ ఉన్నారు.



కాలిగ్రఫీ బోర్డుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయిని కవిత

కాలిగ్రఫీతో అందంగా చేతిరాత

కనిగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కాలిగ్రఫీ ద్వారా చేతి రాతను అలవాటు చేసుకోవాలని క్యాలిగ్రఫీ రైటర్ ఉపాధ్యాయిని కవిత అన్నారు. పట్టణ సమీపంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థినులకు క్యాలీగ్రఫీ బోర్డుపై చేతి రాతను మెరుగు పరుచుకునే విధానంపై శనివారం అవగాహన కల్పించారు.సెలవు రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు తాను సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

ఒంగోలు క్రైం, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతూ గుర్తుతెలియని వృద్ధురాలు (60)మృతి చెందింది. ఈ సంఘటన టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం జరిగింది. చెన్నై నుంచి హజరత్ నిజాముద్దీన్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో ఆమె శరీరం ఛిద్రమైంది. రైల్వే ఎస్‌ఐ కె.మధుసూదనరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు ద ర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

ఆదివారం 6 ఏప్రిల్ 2025



సీతారాముల కల్యాణం చూతము రారండి..




నవమి వేడుకలకు ముస్తాబైన పందిళ్లు, ఆలయాలు

బాపట్ల : శ్రీరామనవమి వేడుకలకు సిద్ధమైన శ్రీభావన్నారాయణస్వామి ఆలయం

శ్రీరామనవమి పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించేందు కు భక్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా అంతటా కన్నుల పండువగా సీతారాముల కల్యాణోత్స వాన్ని నిర్వహించ నున్నారు. రామాలయాలు, ఆంజనేయ స్వామి దేవాలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. పల్లెలు, పట్టణాల్లో రాములోరి వేడు కల కోసం ప్రత్యేకం గా పందిళ్లు వేశారు. సీతారా ముల కల్యాణానికి భక్తులు తలం బ్రాలను సిద్ధం చేశా రు. జిల్లా కేంద్రా లైన నరసరావు పేట, బాపట్లతో పాటు గుంటూరు, తెనాలిలో నవమి వేడుకలకు భారీగా ఏర్పాట్లు జరిగాయి.

- బాపట్ల



అకాల వర్షానికి గుంటూరు మిర్చి యార్డులో తడిసిన మిర్చి



కొల్లూరు : వర్షం ధాటికి నేలవాలిన మొక్కజొన్న పైరు

అకాల వర్షం.. నష్టం



కొల్లూరు : అకాల వర్షానికి తడిసిన పచ్చి ఇటుక

మధ్యాహ్నం వరకు ఎండ మండింది. ఉన్నట్లుండి సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై ఈదురు గాలుల తో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. గుంటూరు, తెనాలి, కొల్లూరు, వేమూరు, కొల్లిపర, పెదకూరపాడు తదితర ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతా వరణంలో మార్పులు చోటు చేసుకుని ఉరుములు, పిడుగులతో వర్షం కురిసింది. అకాల వర్షంతో కల్లాల్లోని పంట దిగుబడులను రక్షించుకునేందుకు పట్టలతో రైతులు పొలాల బాట పట్టారు. గుంటూరు మిర్చియార్డులో మిర్చి వర్షార్పణమైంది. - కొల్లూరు, వేమూరు

ఎన్నికలు జరగక.. నిధులు రాక

- నిధులు లేక గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి
- ఎన్నికలు నిర్వహిస్తేనే ఆర్థిక సంఘం నిధులంటున్న కేంద్రం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సమీప పంచాయతీలకు నాలుగేళ్ల క్రితం ఎన్నికలు జరిగి.. ఆర్థిక సంఘం నిధులతో మౌలిక వసతులు సమకూరుతున్నాయి. పాలకవర్గాల ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతున్నాయి. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 69 పంచాయతీల్లో ఎన్నికలు జరగక ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. అయితే ఎన్నికలు జరగని ఫలితంగా ఆయా పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను ఆపేసింది. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించక పోవడాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణిం చింది. కేంద్రం విడుదల చేస్తున్న ఆర్థిక సంఘం నిధులే పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరు. అయితే పాలకవర్గం లేదనే కారణంతో ఇప్పుడు ఈ నిధులనూ నిలిపేయడంతో వాటి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. గత ఏడాది అక్టోబ రులో 15వ ఆర్థిక సంఘం నిధులను కేం ద్రం విడుదల చేసింది. జనవరిలో రెండో విడత నిధులను విడుదల చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 69 పంచాయతీ లు రెండు విడతల్లో సుమారు రూ.7 కోట్లు నిధులను చేజార్చుకున్నాయి. పాలక వర్గాలు ఉంటేనే నిధులు విడుదల చేయాలన్న నిబంధనను కేంద్రం విధించింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఎన్నికల పై ఎప్పటికి దృష్టి సారిస్తుందో.. వాటికి ఎప్పుడు నిధులు వస్తాయో చూడాలి.

రూ.7 కోట్లు కోల్పోయిన 69 పంచాయతీలు

విలీనాలు.. వివాదాలు..

వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాల్టీల సమీపంలోని పలు పంచాయతీలను విలీనం చేశారు. నరసరావుపేట మున్సిపాల్టీలో ఇస్సపాలెం, లింగంగుంట్ల, యలమందల, రావిపాడు, కేసానుపల్లి పంచాయతీల పరిధి లోకి కొంత ప్రాంతాన్ని విలీనం చేశారు. పొన్నూరు మున్సిపాల్టీలో చింతలపూడి, కసుకర్రు, కట్టెంపూడి, ఆలూరు, పెదఇటికంపాడు, వడ్డెముక్కల పంచా యతీలను విలీనం చేశారు. బాపట్ల మున్సిపాల్టీలో అడ వి,



నరసరావుపేట మండలం లింగంగుంట్లలో కనీస వసతులు లేని గిరిజన కాలనీ

అడవివారిపాలెం, ఈస్ట్ బాపట్ల, కొండబొట్ల వారి పాలెం, మరుప్రోలువారిపాలెం, ముత్తాయపాలెం, పిన్ని బోయినవారిపాలెం, పోతురాజుకొత్తపాలెం, తూర్పు పిన్న బోయినవారిపాలెం, వెస్ట్ బాపట్ల పంచాయతీలను విలీ నం చేశారు. చిలకలూరిపేట మున్సిపాల్టీలో దండ మూడి విలీనం చేశారు. గుంటూరు కార్పొ రేషన్‌లో చినపలకలూరు, లాల్‌పురం, మంగళగిరి మున్సిపాల్టీలో ఆత్మకూరు, బేతపూడి, చినకాకాని, చినవడ్లపూడి, కాజ, వెంకటరెడ్డిపాలెం, కురగల్లు, నీరుకొండ, నిడమర్రు, నూతక్కి, పెద వడ్లపూడి, రామచంద్రాపురం, యర్రబాలెం పంచా యతీలను విలీనం చేశారు. తాడేపల్లి మున్సిపాల్టీలో చిర్రావూరు, గుండిమెడ, ఇప్పటం, కొలనుకొండ, మెల్లం పూడి, పెనుమాక, ప్రాతూరు, ఉండవల్లి, వడ్డేశ్వరం పంచాయతీలను విలీనం చేశారు. రాజధాని అమరావ తిలో అబ్బరాజుపాలెం, అనంతవరం, బోరుపాలెం, దొండపాడు, హరిశ్చంద్రాపురం, ఐనవోలు, లింగాయపాలెం, మల్కాపురం, మందడం, నెక్కల్లు, నేలపాడు, పెదపరిమి, రాయపూడి, శాఖమూరు పంచా యతీలను విలీనం చేశారు. ఈ ప్రక్రియలో నిబంధనలు పాటించలేదు. అధికా రం అండతో అధికారులపై వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చి వారికి అనుకూలంగా మున్సి పాల్టీల్లో విలీనం చేశారు. విలీన ప్రక్రియపై అభ్యంతరా లు వచ్చినా అప్పట్లో అధికారులు లక్ష్య పెట్ట లేదు. ఫలితంగా పలువురు కోర్టులను ఆశ్రయిం చారు. దీంతో ఆయా పంచాయతీల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం వివా దాలను పరిష్కరించకుండా వదిలేసింది. కూట మి ప్రభుత్వంలో అయినా కోర్టులోని వివాదాలు పరిష్క రించి ఎన్నికలు నిర్వహిస్తారని ఆశించిన వారికి పది నెలలుగా నిరాశే ఎదు రైంది.

కృష్ణానదిపై.. మరో వంతెన

మాదిపాడు-ముక్త్యాల మధ్య నిర్మాణం

- నాబార్డు రూ60.54 కోట్లు మంజూరు
- క్షేత్రస్థాయిలో మొదలైన పనులు

అమరావతికి దేశంలోని అన్నీ ప్రాంతాలతో సంబంధాలు ఉండేలా అద్భుతమైన రోడ్ నెట్‌వర్కును ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. ఇందులో భాగంగా కృష్ణానదిపై అరడజనుకు పైగా వంతెనలను నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అవి కాకుండా ఏడో వంతెనను కూడా అందుబాటులోకి తెస్తున్నారు. వంతెన పనులను ఇప్పటికే ప్రారంభించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ముక్త్యాల-ఉమ్మడి గుంటూరు జిల్లా మాదిపాడు మధ్య కృష్ణానదిపై రూ.60.54 కోట్లతో మూడు వరుసల వంతెన నిర్మాణ పనులను తాజాగా ఆరంభించారు. నాబార్డు సాయంతో ఈ వంతెనను ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు.



మాదిపాడు-ముక్త్యాల మధ్య కృష్ణానదిపై వంతెనను నిర్మించనున్న ప్రాంతం

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

దేశంలో ఏ రాజధానికి లేనట్లుగా రహదారుల కనెక్టివిటీ అమరావతి నగరానికే సొంతమవుతుంది. రాజధాని అమరావతికి చెన్నై, కలకత్తా, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల నుంచి కనెక్టివిటీ ఉండేలా అమరావతి చుట్టూ రహదారుల నిర్మాణం జరుగుతోంది. ఇప్పటివరకు కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గ వారధిల రూపంలో రెండు బ్రిడ్జిలు ఉండగా మరో అరడజను వంతెనలను నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. వీటిలో విజయవాడ పశ్చిమ బైపాస్ రూపంలో ఓ వంతెన మరికొద్ది రోజుల్లోనే ప్రజలకు అందుబాటులోకి రానుంది. మరో వంతెనను ఉమ్మడి గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం మాదిపాడు-ఉమ్మడి కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలంముక్త్యాల మధ్య నిర్మిస్తున్నారు. ఈ బ్రిడ్జితో ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాల నడుమ అమరావతి సమీప ప్రాంతంలో ఏడో బ్రిడ్జి ఏర్పాటవుతున్నట్లే.



నది మధ్య పిల్లర్లను పరిశీలిస్తున్న సిబ్బంది

రెండున్నర దశాబ్దాల కల

మాదిపాడు-ముక్త్యాల మధ్య కృష్ణానదిపై బ్రిడ్జిని నిర్మించాలన్నది ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల చిరకాల కోరిక. పులిచింతల ప్రాజెక్టు నిర్మాణ సమయంలో దానిపై రోడ్డు నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇటు పల్నాడు, అటు ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల వైపు సిమెంటు, ఇతర పరిశ్రమలు ఉన్నాయి. మధ్యలో నది ఉండడంతో రెండు జిల్లాల నడుమ అటుఇటూ రవాణాకు 70కి.మీలు అదనమై పోతుంది. ప్రస్తుతం పలువురు బల్లకట్టు, ఇతరాత్ర పడవలపై ప్రమాదకరరీతిలో ప్రయాణిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కృష్ణానదిపై వంతెన నిర్మిస్తే రవాణా ఖర్చు తగ్గడంతో పాటు ప్రమాదాలను నివారించవచ్చు. పైగా గుంటూరు నుంచి హైదరాబాద్‌కు రాకపోకలను సాగించేవారికి 50 కిలోమీటర్ల వరకు దూరం తగ్గుతుంది.

నది వెడల్పు చాలా తక్కువ

కృష్ణానది రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా మాదిపాడు-ముక్త్యాల నడుమ కేవలం అర కిలోమీటరు వెడల్పుతో ప్రవహిస్తుంది. పైగా బ్రిడ్జి ప్రతిపాదిత స్థలంలో నది వంపు తిరుగుతున్నట్లు ఉండటంతో (మిగతా 8వ పేజీలో)

పల్లె పాలన.. ఆన్‌లైన్

- ఇక పంచాయతీల్లో అక్రమాలకు చెక్
- గ్రామాల్లో కార్యకలాపాలన్నీ డిజిటలైజేషన్
- కాగిత రహిత పాలనకు మూడు నెలల గడువు
- తొలివిడతలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు 95 కంప్యూటర్లు



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పంచాయతీలను దోచేశారు. పాలనలో పారదర్శకతకు పాతరేశారు. పన్నుల వసూళ్లు.. నిధుల ఖర్చులకు లెక్కాపత్రాలు లేకుండా మింగేశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని కొన్ని పంచాయతీలు అక్రమాలకు కేంద్రాలుగా మార్చేశారు. పంచాయతీలను వేదికగా చేసుకుని వైసీపీ నేతాగణం అనేక అక్రమాలకు పాల్పడిన సంగతి తెలిసిందే. అటు నేతలు.. ఇటు అధికార యంత్రాంగం కలిసి పంచాయతీ లను నిర్వీర్యం చేశారు. ఈ పరిస్థితుల్లో అన్ని వ్యవస్థలను చక్క దిద్దే క్రమంలో కూటమి ప్రభుత్వం పంచాయతీల్లో అక్రమాలపై దృష్టి పెట్టింది. అయితే దేనికీ లెక్కాపత్రం లేకపోవడం, కొన్ని రికార్డులు మాయం చేయడాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఇలాంటి అక్రమాలకు విరుగుడుగా గ్రామ పాలనను పూర్తిగా ఆన్‌లైన్ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా పల్లె పాలనా కార్యకలాపాలను డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా జరిగేలా ఆదేశాలు జారీ చేసింది. పన్నుల వసూలు మొదలుకుని అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల జీతభ త్యాలు, నిధుల ఖర్చు, ఆర్థిక సంఘం నిధులు, గ్రామాభి వృద్ధికి దాతల విరాళాలు.. ఇలా అన్నింటినీ ఆన్‌లైన్ ద్వారానే చేయాలని తద్వారా పారదర్శకత తీసుకు రావాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది. గత ప్రభుత్వంలో ఇలాంటి ఒక వ్యవస్థ లేకపోవడం వల్లే పంచాయతీలను వైసీపీ నేతలు నిలువునా దోచేశారని, భవిష్యత్తులో గ్రామాల్లో ఖర్చు పెట్టే ప్రతి పైసాకు లెక్క ఉండటంతో పాటు గ్రామస్థులకు ఆన్‌లైన్‌లో అవి అందు బాటు లో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రికార్డుల డిజిటలైజేషన్ ద్వారా గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై స్పష్ట త వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే బాపట్ల జిల్లా వ్యాప్తంగా దాదాపు 55 పంచాయతీల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు నిర్ధారించి విచారణ చేస్తున్నారు. ఆన్‌లైన్ చేయడం ద్వారా అవినీతి నిగ్గు తేల్చడం కూడా సులభతరం అవుతుం దనేది ప్రభుత్వం ఉద్దేశంగా ఉంది.

పంచాయతీ పోర్టల్ ద్వారా..

పన్నుల వసూళ్లకు పంచాయతీల్లో స్వర్ణ పోర్టల్‌ను ఇప్పటికే ప్రవేశపెట్టిన ప్రభుత్వం దాని ద్వారానే కార్యకలాపాలు నిర్వహిస్తోంది. క్యూ ఆర్ కోడ్ స్కానర్ల ద్వారా సిబ్బంది పన్నులు వసూలు చేస్తున్నారు. పంచాయతీల్లోని నిధుల నిల్వతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్ల గణాంకాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉంది. గ్రామాభివృద్ధికి ఖర్చు చేసే నిధులు, పనులు ఏ స్థాయిలో ఉన్నాయి ఇలా ప్రతి అంశాన్ని ఆన్‌లైన్ చేయాల్సిందే. ఉద్యోగుల చేతివాటానికి ఏ మాత్రం అవకాశం లేకుండా పం చాయతీలో జరిగే కార్య కలాపాలు ఆన్‌లైన్ గొడుగు కిందకు తేవడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

పంచాయతీల వారీగా నివేదికలు..

బాపట్ల జిల్లాలో మొత్తం 459 పంచాయతీలు ఉండగా ఉమ్మడి గుంటూరు జిల్లా వరకు చూస్తే 1012 పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీల్లో కాగిత రహిత పాలన శ్రీకారానికి మూడు నెలలు మాత్రమే ప్రభుత్వం గడువు ఇచ్చింది. ఈ క్రమంలో ఏయే పంచాయతీల్లో కంప్యూటర్ల కొరత ఉందనే అంశంతో పాటు ఆన్‌లైన్ డేటాను పకడ్బందీగా నిర్వహించ డానికి నైపుణ్యం కలిగిన సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేదా అనే సవివర నివేదికలను పంపాలని పంచాయతీ విభా గాన్ని ప్రభుత్వం ఆదేశించింది. క్షేత్ర స్థాయిల్లో పరిశీలన చేపట్టి ప్రాథమికంగా సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 450 పంచా యతీల్లో కంప్యూటర్ల కొరత ఉందని నివేదిక ఇచ్చారు. స్కిల్ సిబ్బంది అవసరం 300 వరకు ఉంటుందనే ప్రతిపాదనలను యంత్రాంగం పంపింది. ఈ పరిస్థితుల్లో తొలి విడతగా 95 కంప్యూటర్లను ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పంచాయతీలకు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దశల వారీగా అన్ని పంచాయతీలకు కావాల్సిన సాంకేతిక సహాయంతో పాటు సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది.

24 గంటల్లో నిందితుడి అరెస్టు

- రూ.75 లక్షల చోరీ సొత్తు స్వాధీనం
- ఇంకొల్లు పోలీసులను అభినందించిన ఎస్పీ

బాపట్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇంకొల్లులోని బస్టాండ్ ఎదురుగా జాగర్లమూడి శివప్రసాద్ ఇంట్లో ఈ నెల 3న జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు 24 గంటల్లో చేధించారు. నిందితుడ్ని అరెస్టు చేసిన పోలీసులు 55,50,000 నగదు, 24 సవర్ల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో చోరీ సొత్తును మీడియా ఎదుట ప్రదర్శించి, నిందితుడి వివరాలను ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. ఘటన జరిగిన 24 గంటల్లో చోరీ సొత్తు సహా నిందితుడ్ని పట్టుకున్న ఇంకొల్లు పోలీసులను ఎస్పీ అభినందిం చారు. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా గజ్వల్ మండలం అమీద్‌పురం బాలాజీనగర్‌కు చెందిన మహమ్మద్ షరీఫ్ గతంలో చెంచల్‌గూడ సెంట్రల్‌జైలులో ఉండగా గంజాయి కేసులో నిందితుడైన ఇంకొల్లుకి చెందిన సాయితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో మార్చి 30న సాయితో కలిసి షరీఫ్ ఇంకొల్లుకి వచ్చి స్థానికంగా వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 3న రాత్రి శివప్రసాద్ ఇంట్లోకి ప్రవేశించి నగదు, బంగారు ఆభరణాలు అపహరించాడు. చీరాల డీఎస్పీ మహ్మద్‌మోయిన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు వేట చేపట్టాయి. గస్తీ విధుల్లోని కానిస్టే బుల్ కె.హరిశ్చంద్రనాయక్, హోమ్‌గార్డు కె.పనిత్‌కుమార్ ఇచ్చిన సమాచారం మేరకు ఇంకొల్లు సీఐ వైవీ.రమణయ్య, ఎస్ఐ సురేష్ శని వా రం నిందితుడ్ని గుర్తించి అరెస్టు చేశారు. షరీఫ్ తెలంగాణలోని పలు పోలీసుస్టేషన్ల పరిధిలో 14 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు ఎస్పీ చెప్పారు.



స్వాధీనం చేసుకున్న నగదు, నిందితుడి వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ తుషార్ డూడి, పోలీసు సిబ్బంది



కొరిశపాడులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం

మేదరమెట్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని విద్యుత్ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రమైన కొరిశపాడులోని జగ్జీవన్, అంబేడ్కర్ నగర్‌లో నూతనంగా రూ.8లక్షతో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, లైన్లను ఈఈ గ్రామస్థుల సమక్షంలో ప్రారంభించారు. గతంలో కిందికి వేలాడే తీగలతో ఎస్సీకాలనీ వాసుల ఇబ్బందులను గుర్తించి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు నూతన లైన్లను ఏర్పాటు చేసినట్లు ఈఈ తెలిపారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో విద్యుత్ శాఖకు సంబంధించి సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసరావు, సిబ్బంది, ఎస్సీకాలనీ వాసులు పాల్గొన్నారు.

దీపం వెలుగులు

- పెండింగ్ లేకుండా సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో 3.90 లక్షల మందికి రూ.31.63 కోట్లు జమ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మహిళల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న దీపం-2 పథకానికి జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హత ఉన్న పేదలందరికీ ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన విషయం విదితమే. తదనుగుణంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. గత ఏడాది దీపావళి పండుగను పురస్కరించుకొని దీపం-2 పథకాన్ని ప్రారంభించారు. నాలుగు నెలలకు ఒక పర్యాయం సబ్సిడీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం చెప్పిన విధంగానే సబ్సిడీ నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతోంది. జిల్లాలో ఆయా గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 3,95,551 మంది లబ్ధిదారులు ఉచిత దీపం-2 పథకానికి సిలిండర్లు బుక్ చేయగా 3,91,399 మందికి ప్రభుత్వం సబ్సిడీ సొమ్ము విడుదల చేసింది. గ్యాస్ సిలిండర్ తీసుకున్న వారం, పది రోజుల్లోనే 3,90,185 మంది లబ్ధిదారులకు సబ్సిడీ వారి బ్యాంకు ఖాతాల్లో రూ.31,63,33,989 కోట్లు జమయ్యాయి. కేవలం 1,214 మంది ఖాతాలకు మాత్రం జమ కాలేదు.

వివిధ కారణాలతోనే అందని లబ్ధి

గ్యాస్ ఏజెన్సీలో ఉన్న నంబరుకు బ్యాంకు అకౌంట్ అనుసంధానం కాకపోవడం, ఈకేవైసీ లేకపోవడం వంటి కారణాలతో కొంత మంది లబ్ధిదారులకు సబ్సిడీ జమ కాలేదు. కాగా 2024-25 ఆర్థిక సం వత్సరానికి సంబంధించి ఈ పథకం ఈ నెలాఖరుకు ముగియనుంది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా జిల్లావ్యాప్తంగా ఉచిత గ్యాస్ పథకం బాగా అమలు జరుగుతుండటంతో లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రణాళి కాబద్ధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే సామాజిక పింఛన్లను పెంచి అమలు చేశారు. దీపావళి కానుకగా దీపం-2 పథకాన్ని ప్రారంభించారు. సబ్సిడీ సొమ్ము కొద్ది రోజుల్లోనే బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండటంతో వినియోగదారులు ఉపశమనం పొందుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా ఉపాధి పనులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రానున్న మూడు నెలల్లో ఉపాధి హామీ పథకం పనులను లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ పథకం ద్వారా ఉపాధి కూలీలకు 1.11 కోట్ల పనిదినాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 7వతేదీ నుంచి జిల్లాలో రోజువారీ 1.96 లక్షల మంది కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు. స్థానిక జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో శనివారం ఏపీడీలు, ఏపీవోలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం ద్వారా ఐదు రకాల పనులు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. జిల్లాలో రూ.4.72 కోట్ల వ్యయంతో 1,475 పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. పశు సంవర్ధక శాఖ అధికారులను సమన్వయం చేసుకొని ఈ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలో రూ.47.50 కోట్ల వ్యయంతో 9,500 సేద్యపు నీటి కుంటలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించామని చెప్పారు. అందులో రోజువారీ పనులు కోరే కూలీలకు కూడా 15 నుంచి 20శాతం వరకు పనులు కేటాయించామన్నారు. జిల్లాలో రూ.101.70 కోట్ల అంచనా వ్యయంతో 4,043 కి.మీ ఫీల్డ్ చానల్, ఫీడర్ చానల్‌లో పూడికతీత పనులు చేపడతామని తెలిపారు. 546 చెరువులలో రూ. 54.60 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఉపాధి కూలీ రోజుకు కనీస వేతనం రూ.290 పొందే విధంగా డ్వామా అధికారులు, సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ పాల్గొన్నారు.

బెట్టింగ్ భూతం

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ బెట్టింగ్ బూతం విరుచుకుపడుతోంది. ముఖ్యంగా యువతను బలితీసుకుంటోంది. సెల్‌ఫోన్ల పుణ్యమా అని జిల్లా అంతటికీ పాకి కుటుంబాలను గుల్లచేస్తోంది. జనాల జేబులకు చిల్లుపడుతుండగా, యాప్‌లలో మాత్రం లక్షలు చేతులు మారుతున్నాయి. గతంలో ఒంగోలు కేంద్రంగా బుకీలు రాకెట్‌ను నడిపించేవారు. ప్రస్తుతం సింగరాయకొండకు మకాం మార్చారని తెలుస్తోంది. అక్కడ వైసీపీ నేత బుకీగా వ్యవహరిస్తూ కొండపి, కందుకూరు, ఒంగోలు ప్రాంతాల్లో పంటర్స్‌ను ఏర్పాటు చేసి పందేలు వేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కువగా బార్ అండ్ రెస్టారెంట్లు, లాడ్జిలలో మకాం వేసి ఆడేవారిని ప్రోత్సహించి నిత్యం లక్షలు దోచుకుంటున్నారు. అంతేకాదు కొంతమంది హోటల్స్, రెస్టారెంట్లలో పనిచేసే వెయిటర్స్ ద్వారా కూడా బెట్టింగ్‌లు వేస్తున్నారు. యువకులు గ్రూపులుగా ఏర్పడి రూ.500, వెయ్యితో పందేలు మొదలుపెట్టి లక్షల్లో పోగొట్టుకుని దొంగలుగా మారుతున్నారు. ఇలా గ్రామాల వరకు క్రికెట్ బెట్టింగ్ జాడ్యం పాకింది. కొంతమంది సాయంత్రానికి పట్టణాలకు వచ్చి బార్లలో కూర్చొని ఆట పూర్తయ్యే వరకు బెట్టింగ్‌లు వేసి జేబులు ఖాళీ చేసుకొని ఇంటికి వెళుతున్నారు.

ముఠా గుట్టు బయటపడింది ఇలా

జరుగుమల్లి మండలానికి చెందిన ఓ యువ కుడు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేర కు పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన జరుగుమల్లి పోలీసులు దర్యాప్తు చేస్తుండగా బెట్టింగ్ ముఠా గుట్టురట్టు అయింది. తప్పిపోయిన యువకుడు తిరుపతిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, అతనిని తీసుకొచ్చి విచారించగా తాను బెట్టింగ్‌లు వేసి డబ్బులు పోగొట్టుకున్నానని తెలిపాడు. పైగా అప్పుల పాలై బెట్టింగ్ రాయుళ్ల ఒత్తిడికి తట్టుకోలేక తప్పించుకు తిరుగుతున్నట్లు తెలిపాడు. దీంతో పోలీసులు బెట్టింగ్ ముఠాపై దాడులు చేసి ఇరవై మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఈ ముఠా ఒంగోలు, కందుకూరు, కొండపి నియోజకవర్గాలలో ఏజెంట్ల ద్వారా రాకెట్ నడుపుతున్నట్లు విచారణలో వెల్లడైంది. అందుకు సూత్రధారి బుకీగా అవతరామెత్తి గత ప్రభుత్వం హయాంలో రూ.కోట్లు సంపాదించినట్లు తెలుస్తోంది. అదేక్రమంలో వైసీపీ నేత మరి కొంతమందిని భాగస్వాములను చేసుకొని ఈ వ్యవహారం నడిపిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ కేసులో ఉన్న నలుగురు ముఖ్యులు పరారీలో ఉన్నారు.

కొత్త బ్రిడ్జితో తీరిన కష్టాలు

అద్దంకి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణంతో పలు గ్రామాల కష్టాలు తీరాయి. తిమ్మాయపాలెం-ఇలపావులూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో అద్దంకి మండలం పేరాయపాలెం వద్ద శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి మూడున్నర సంవత్సరాల కిందట కూలింది. వైసీపీ హయాంలో ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో అద్దంకి మండలంలోని పేరాయపాలెం, ధేనువకొండ, ఉమ్మనేనివారిపాలంలతో పాటు చీమకుర్తి, తాళ్లూరు మండలాలలోని పలు గ్రామాల నుంచి అద్దంకికి రాకపోకలు నిలిచిపోయాయి. అద్దంకి-ధేనువకొండ బస్ సర్వీస్ ను కూడా రద్దు చేశారు. గ్రామస్థులు తాత్కాలికంగా మరమ్మతులు చేసుకున్నా బిక్కుబిక్కు మంటూ ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ శాఖ మంత్రి



పేరాయపాలెం వద్ద దోర్నపు వాగుపై నిర్మించిన బ్రిడ్జి

గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి సుమారు40 లక్షల రూపాయల వ్యయంతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయింప జేశారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో రాకపోకలు పునరుద్ధరణ అయ్యాయి. ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు సీతారాముల కల్యాణం

ఉప్పుటూరు(పర్చూరు), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలం ఉప్పుటూరు గ్రామంలోని శ్రీ కోనేటి ఆంజనేయస్వామివార్ల దేవాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ సీతారాముల స్వామివార్ల కల్యాణ వేడుకలు జరుగుతాయని కమిటీ నిర్వాహకులు శనివారం ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివార్ల కల్యాణ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

వన్‌టౌన్ సీఐగా సుబ్బారావు బాధ్యతలు



చీరాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ సీఐగా సూర్యాపల్లి సుబ్బారావు శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా విధులు నిర్వర్తించిన మారేడు శ్రీనివాసరావు గుంటూరు రేంజి వీఆర్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ఒంగోలు ఎస్సీ, ఎస్టీ సెల్‌లో విధులు నిర్వహిస్తున్న సుబ్బారావును చీరాలకు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన సుబ్బారావును పలువురు ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అయితే గతంలో సుబ్బారావు ఈపురుపాలెం ఎస్ఐగా పనిచేశారు.



శ్రీరాముడు సకల
గుణ నిధి
ఒకే మాట - ఒకే
బాణం - ఒకటే
సతి
సంపూర్ణ మానవ
తతో సమతను
మమతను పండించిన ఆదర్శమూర్తి
పితృ వాక్య పరిపాలన అశ్రిత సంరక్షణ
ధర్మాచరణ
రాముడిని ఒక్కసారి చూచిన
మాట్లాడిన జన్మలో మర్చిపోలేము
ఇంతటి మహత్తరమైన ప్రసంగాన్ని
అందరూ విని తరలించాలి

- వి.వెంకటరావు,
ఆధ్యాత్మిక పీఠం, చీరాల

తరచూ మంచినీటి పైపులైన్లకు మరమ్మతులు

- లీకవుతున్న పైపులు, దెబ్బతింటున్న వాల్స్
- ఏటా పంచాయతీపై అదనపు ఖర్చుల భారం

మార్టూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పాతికవేలకు పైగా జనాభాగలిగిన మార్టూరు గ్రామ పంచాయతీలో రక్షిత మంచినీటి పథకం నుంచి గ్రామంలో మంచినీటిని సరఫరా చేస్తున్న భూమిలోని పైపులైన్లకు తరచుగా గండ్లు పడుతున్నాయి. పైపులు లీకేజీ కావడం, వాల్‌లు దెబ్బతినడంతో మంచినీరు, మురుగునీరు కలిసిపోతున్నాయి. వాటి మరమ్మతులకు ఏటా గ్రామ పంచాయతీకి 8 నుంచి 10 లక్షలు దాకా డబ్బులు ఖర్చు అవుతున్నాయి. దానికి తోడు గ్రామంలో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నది. కేవలం పైపులైన్లకు మరమ్మత్తులు కావడం, వాల్‌లు దెబ్బతినడంతో గత ఏడాదిక్రితంనుండి జడ్‌పి హైస్కూల్ వద్ద ఓ వర్‌హెడ్ ట్యాంక్‌కు నీరు పంపిణీ చేయకుండా నిలిపివేశారు. దాంతో మండల కాంప్లెక్స్ వద్ద గల పెద్ద ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి గ్రామంలో మంచినీటిని భూమిలోని పైపులైను ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే మండల కాంప్లెక్స్ వద్ద జాతీయ రహదారిపై నున్న బ్రిడ్జి కింద తరచుగా పైపులైన్లు లీకేజీలు వస్తున్నాయి. సాగర్ జలాలు రాజుపాలెం మేజరు నుంచి ఈ పైపలైను ద్వారానే మంచినీటి చెరువుకు నీళ్లు చేరుతున్నాయి. అ క్కడ ఎక్కువగా పైపలైన్లు లేకేజీ కావడంతో మురుగునీరు మంచినీటి పైపులలో కలిసిపోతున్నాయి.

మరమ్మతులకు గురవుతున్న భూమిలోని పైపులైన్లు

దాదాపుగా 25 ఏళ్ల కిందట మార్టూరు గ్రామంలో అంతర్గతంగా మంచినీటిని సరఫరా చేసేందుకు భూమిలో పైపలైన్లు వేశారు. అందువలన వాటికి మరమ్మతులు ఎక్కువగా వస్తున్నాయి. చాలా వరకు పైపులు లీకేజీ కావడం, మరలా వాటిని మరమ్మతు చేయడం పంచాయతీలో పరిపాటిగా మారింది. వారంలో మూడురోజులు ఏదో ఒక కాలనీలో, లేదా నగర్‌లో లేదా ఏరియాలో పైపులు మరమ్మతులకు గురవుతున్నాయి. మార్టూరులో జాతీయరహదారిపై ఫ్లైవోవరు ఏర్పడడంతో ప్రస్తుతం 10 అడుగులు భూమి కింద పైపులైన్లు ఉన్నాయి వాటిని బయటకు తీసి మరమ్మతులు చేయడం పంచాయతీ కార్మికులకు పెద్దసమస్యగా మారింది. ఇక గ్రామ పంచాయతీ వారు ఎస్టిమేట్లు వేయడం మరల కొత్తగా పైపులు తెప్పించడం చేస్తున్నారు. ప్రస్తుతం 10 లక్షల రూపాయలు విలువతో తీసుకువచ్చిన పైపులను మరమ్మతులకు గురైన చోట కొత్తగా వేస్తున్నారు. వాస్తవంగా ప్రజలు మంచినీటి కోసం ఆర్‌వో ప్లాంటులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఏదైనా ఒక రోజు మంచినీటి సరఫరా జరగకపోయినా ప్రజలు సర్దుకుపోతున్నారనే విషయం వాస్తవం



జడ్పీ హైస్కూల్ వద్ద నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్



మండల కాంప్లెక్ వద్ద బ్రిడ్జి కింద పైపులైను ఏర్పాటు కోసం పనిచేస్తున్న పంచాయతీ సిబ్బంది

జలజీవన్ మిషన్ కింద గ్రామానికి రూ.10కోట్లు మంజూరు

కేంద్రప్రభుత్వం గతంలో ఇంటింటికీ కొళాయి ద్వారా మంచినీటిని సరఫరా చేసేందుకు జలజీవన్‌మిషన్ ద్వారా మార్టూరు గ్రామ పంచాయతీకి 10 కోట్లు రూపాయలు మంజూరుచేశారు. అందుకు సంబంధించి గ్రామ పంచాయతీ వారు బ్యాంకు ఖాతాలను కూడా తెరచారు. టెండర్లు కూడా ప్రకటించారు. అయితే గత ప్రభుత్వంలో పనులు చేస్తే బిల్లులు రావనే భయంతో కాంట్రాక్టర్లు ఈ పనులు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవగా వ్యవహరిస్తే జలజీవన్ మిషన్ పనులు త్వరలో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. తద్వారా గ్రామంలో ఇంటింటికీ తాగునీరు అందే అవకాశం ఉంది. అయితే అప్పటి దాకా గ్రామంలో మరమ్మతులకు గురైన పైపులైన్లుకు పంచాయతీ అధికారులు మరమ్మతులు చేస్తూ ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



బీజేపీ నేతలను అభినందిస్తున్న పురందేశ్వరి

బీజేపీని బలోపేతం చేయాలి

అద్దంకి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నియోజకవర్గ నేతలతో అన్నారు. బాపట్ల జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమించిన అద్దంకికి చెందిన బంగారుబాబు ఆధ్వర్యంలో విజయవాడలో పురందేశ్వరిని కలిశారు. జిల్లాలో అన్ని మండల శాఖల అధ్యక్షులను నియమించాలన్నారు. జాగర్లమూడి యలమందరావు, పరుచూరి శ్రీనివాసరావు ఉన్నారు.

శింగరకొండ మండపానికి రూ.లక్ష విరాళం



నగదును ఈవో తిమ్మానాయుడుకు అందజేస్తున్న దాతలు

అద్దంకి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండప నిర్మాణానికి దాతలు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం భీమవరానికి చెందిన నలబోతు వెంకటమోహనరావు, ఉమాదేవి దంపతులు శనివారం ఆలయ ఈవో తిమ్మానాయుడుకు రూ.1,01,116 నగదును అందజేశారు. వెంకటమోహనరావు, ఉమాదేవి దంపతులు శింగరకొండలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి వార్లను దర్శించుకున్నారు. వాహనపూజలు, ఆకుపూజలు, అర్చనలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కృష్ణానదిపై మరో వంతెన

(5వ పేజీ తరువాయి)



ప్రమాదకర పడవ ప్రయాణాలకు చెల్లుచీటి

ప్రవాహం తక్కువగా ఉంటుంది. అరకిలోమీటరు బ్రిడ్జికి అనుబంధంగా మాదిపాడు వైపు అరకిలోమీటరు, ముక్త్యాల వైపు రెండున్నర కిలోమీటర్ల వంతున అప్రోచ్ రోడ్డును నిర్మించాలి. ఇందుకు అవసరమైన భూములు కూడా అందుబాటులో ఉన్నాయి. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా నదిలో 14 పిల్లర్లను నిర్మించనున్నారు. అటూ ఇటూ ఫుట్‌పాత్‌లతోపాటు మూడు వరుసలతో వంతెనను రెండేళ్లలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బ్రిడ్జి నిర్మాణంతో ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజలతోపాటు తెలంగాణాలోని సూర్యపేట, ఖమ్మం జిల్లాల ప్రజలకు ఎంతో వెసులుబాటు కలుగుతుంది. ఈ బ్రిడ్జి వైకుంఠపురం బ్యారేజి కమ్ బ్రిడ్జి కన్నా ముందే ప్రజలకు అందుబాటులోకి రానుంది.

జాప్యం కారణంగా పెరిగిన వ్యయం

మాదిపాడు-ముక్త్యాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి తొలినాళ్లలో రూ.15 కోట్లు వ్యయం కాగలదని అంచనాలను రూపొందించారు. ఆ తర్వాత అది రూ.36.19 కోట్లుగా, ఆ తర్వాత రూ.39.69 కోట్లుకు పెరిగింది. ప్రస్తుతం అంచనా వ్యయాన్ని పెంచి రూ.60.54 కోట్లకు గతేడాది నవంబరులో ఆర్ అండ్‌బీ టెండర్లను ఆహ్వానించింది. వల్లభనేని కనస్ట్రక్షన్స్ కాంట్రాక్టును దక్కించుకునేందుకు ముందుకొచ్చింది. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన బ్రిడ్జి కావడంతో నిధులను సమాకూర్చడానికి నాబార్డు ముందుకొచ్చింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ దిశగా చొరవ చూపి కాంట్రాక్టు సంస్థతో చర్చలు జరిపి వారిని ఒప్పించి మరీ బ్రిడ్జి కాంట్రాక్టును అప్పగించింది. దీంతో సదరు కాంట్రాక్టు సంస్థ తాజాగా బ్రిడ్జి నిర్మాణపనులను ఆరంభించింది.

ముందస్తు పన్ను చెల్లింపులపై 5 శాతం వడ్డీ రాయితీ

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెల్లించాల్సిన ఆస్తి, నీటి, ఖాళీ స్థలం పన్నులు ముందుగానే చెల్లించే వారికి వడ్డీపై 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు కమిషనర్ కె. వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పన్నులు చెల్లింపునకు ప్రజలు సహకరించా రన్నారు. అలాగే వచ్చే ఏడాది మార్చి 31లోపు చెల్లించే పన్ను లకు ఎలాంటి వడ్డీ భారం లేకుండానే ముందుగానే చెల్లించే అవకాశం ఉందని, అందులో భాగంగా 5 శాతం వడ్డీ రాయితీని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెవెన్యూ వర్సెస్ ఫారెస్ట్

- సీబీజీ ప్లాంట్‌కు గంగదొనకొండలో 799.40 ఎకరాల కేటాయింపు
- పనులు ప్రారంభించిన రిలయన్స్ సంస్థ
- ఆ భూమి తమదని అడ్డుకున్న ఫారెస్టు అధికారులు
- ఎఫ్ఎల్ఆర్‌లో ఆ ఊసే లేదంటున్న రెవెన్యూ
- సమన్వయ లోపంతో నిలిచిన పనులు

కురిచేడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమన్వయ లోపం కురిచేడు మండలం గంగదొనకొండలో ఏర్పాటుకానున్న రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు శాపంగా మారింది. భూముల కేటాయింపులో ఏర్పడిన సమస్యతో ఆ సంస్థ చేపట్టిన పనులు నిలిచిపోయాయి. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనలో టీడీపీ కూటమి ప్రభుత్వం వేగంగా ఉంది. రిలయన్స్ సంస్థ 500 సీబీజీ ప్లాంట్‌ల ఏర్పాటుకు సిద్ధం కావడంతోపాటు మొట్టమొదట పీసీపల్లి మండలంలో భూమి పూజ కూడా చేశారు. అదే తరహాలో కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామంలో ప్లాంటు ఏర్పాటుకు 799.40 ఎకరాలు కేటాయించారు. దీంతో పదుల సంఖ్యలో యంత్రాలతో శుక్రవారం నుంచే రిలయన్స్ ప్రతినిధులు పెద్దఎత్తున పనులు ప్రారంభించారు. శనివారం అటవీ శాఖాధికారులు వచ్చి నిలిపివేయించారు.

రెవెన్యూ రికార్డులో గయాలు భూమి

కురిచేడు మండలం గంగదొనకొండ పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 88లో 548.95 ఎకరాలు, సర్వే నంబరు 90లో 250.45 ఎకరాలు మొత్తం 799.40 ఎకరాల భూమిని సీబీజీ ప్లాంటుకు కేటాయించారు. భూమికి రెవెన్యూ అధికారులు క్లియరెన్స్ ఇవ్వగా కలెక్టర్ అప్రూవల్ చేశారు. అది పూర్తిగా గయాలు భూమి అని రెవెన్యూ రికార్డులలో ఉంది. భూమికి అప్రూవల్ రావడంతో రిలయన్స్ సంస్థ శుక్రవారం నుంచి పనులు ప్రారంభించింది. అందుకు సంబంధించి 40కు పైగా ఎక్స్‌కవేటర్లు, పెద్ద యంత్రాలు తీసుకువచ్చి చిల్లచెట్లు తొలగించే పని చేపట్టారు. శనివారం సాయంత్రానికి 150 ఎకరాలలో శుభ్రం చేశారు. ఇదే సమయంలో అటవీ శాఖ డీఆర్‌వో కేబీ నాయక్, ఎఫ్‌బీవో వై.ధనలక్ష్మిలు ప్లాంటు నిర్మాణ స్థలానికి వచ్చారు. 'ఆ భూమి అటవీ శాఖదని, మా అనుమతులు లేకుండా పనులు చేయవద్దని' అడ్డుకున్నారు. ఆభూమిలో గతంలో తాము నీరు నిలిచే ట్రెంచింగ్ చేశామని, మేము నిర్మించిన పిల్లర్లు కూడా ఉన్నాయని వారు వాదించారు. రెవెన్యూ అధికారులేమో ఎఫ్ఎల్ఆర్‌లో అది పూర్తిగా గయాలు భూమి అని ఉన్నదని, అటవీ శాఖ భూమి అందులో లేదని అందుకే అనుమతులు ఇచ్చామని చెబుతున్నారు. గతంలో మా అనుమతులు లేకుండా ట్రెంచింగ్ తీశారని వారు అంటున్నారు. అంతేకాక 1974లోనే 88 సర్వే నంబరులో 55 మంది రైతులకు 168.40ఎకరాలు, సర్వే నంబరు 90లో 9 మంది రైతులకు 28 ఎకరాలు అసైన్డ్ భూమి ఇచ్చామని చెబుతున్నారు. చాలా కాలంపాటు ఆభూములలో రైతులు పంటలు సాగు చేశారని, అప్పుడు పట్టించుకోని అటవీ శాఖ అధికారులు ఇప్పుడు ఎందుకు అడ్డుకుంటున్నారని రెవెన్యూ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఏదిఏమైనా కూటమి ప్రభుత్వం పరిశ్రమలు స్థాపించి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందనే ఆశలు ప్రజల్లో చిగురిస్తున్న తరుణంలో రెండు శాఖ మధ్య సమన్వయ లోపంతో ప్లాంటు పనులు ఆగాయి. వెంటనే దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ప్లాంటు పనులు చేపట్టేలా సత్వర చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుకుంటున్నారు.



పనులను ఆపేసి పక్కన ఉంచిన ఎక్స్‌కవేటర్లు

ప్రమాదం జరిగితే అంతే సంగతులు!






బల్లికురవ - మల్లాయపాలెం రోడ్డు పక్కనే నూతనంగా వేస్తున్న విద్యుత్ లైన్, మలుపుల వద్ద తారు రోడ్డును ఆనుకొని ఉన్న స్తంభాలు, విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం మార్జిన్‌లో ఉన్న పెద్ద పెద్ద చెట్లను తొలగించిన దృశ్యం, గ్రానైట్ వాహనాలకు పొంచి ఉన్న విద్యుత్ లైన్

- బల్లికురవ, సంతమాగులూరు రోడ్డు పక్కనే వేస్తున్న స్తంభాలు
- నూతన విద్యుత్ లైన్ పడిన రోడ్డు మార్జిన్‌లోనే నిత్యం వందలాది గ్రానైట్ లారీల రాకపోకలు
- కరెంట్ పోల్స్‌తో పొంచి ఉన్న ముప్పు
- నీడ నిచ్చే చెట్ల నరికి వేత
- పట్టించుకోని అధికారులు

బల్లికురవ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటులో అధికారుల పర్యవేక్షణ కొరవడుతుంది. ఇష్టానుసారంగా రోడ్ల పక్కనే విద్యుత్ స్తంభాలు వేస్తుండడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ప్రమాదాలు జరగక ముందే అధికార్లు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటులో దశాబ్దాల నుంచి ప్రజలకు నీడను ఇచ్చే రోడ్డు మార్జిన్లలో ఉన్న చెట్లను సైతం నరికి వేస్తున్నారు. స్తంభాలను రోడ్డుకు కొంచెం దూరంగా ఏర్పాటు చేస్తే సమస్య ఉండదని ప్రజలు అంటున్నారు.

బల్లికురవ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి మల్లాయపాలెం వరకు గ్రానైట్ క్వారీలు ఫ్యాక్టరీలకు ప్రత్యేక విద్యుత్ లైన్‌ను అధికారులు ఏర్పాటు చేయిస్తున్నారు.ఈ విద్యుత్ లైన్ ఎర్పాటుపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ నూతన విద్యుత్ లైన్ ఏర్పాటుతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. బల్లికురవ సంతమాగులూరు అర్అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లోనే విద్యుత్ స్తంభాలను పాతుతున్నారు. రోడ్డును ఆనుకొని స్తంభాలు ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యం వందలాది గ్రానైట్ లారీలు తిరిగే ఈ రోడ్డులో కరెంట్ పోల్స్‌ను చూసి వాహన దారులు సైతం బెంబేలెత్తి పోతున్నారు. రాత్రుళ్ల వేగంగా వచ్చే వాహనాలు మలుపులలో ఉన్న స్తంభాలతో ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందని వారు అంటున్నారు. ఎప్పుడో రెండు దశాబ్దాల కిందట ఉన్న స్తంభాలు అప్పుడు రోడ్డు వేయక పోవడంతో దూరంగా ఉన్నాయని ఇప్పుడు ఈ రోడ్డు డబుల్ రోడ్డుగా అభివృద్ధి చెందిందని ఇప్పుడు కూడా స్తంభాలను రోడ్డు మార్జిన్‌లలో వేస్తే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తతన్నారు. విద్యుత్ లైన్ పేరుతో ఎంతో పెద్ద పెద్ద వృక్షాలను సైతం కోట్టేశారని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ లైన్ వేసే కాంట్రాక్టర్ స్తంభాలను రోడ్డుకి దూరంగా వేయకుండా రోడ్డు పక్కన వేసి తన పని తాను చేసి చేతులు దులుపుకున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎత్తు ఉన్న పోల్స్ రోడ్డు మార్జిన్‌లో వరుసగా ఉండడంతో భయమేస్తుందని వాహనదారులు అంటున్నారు. విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంవల్ల నూతన విద్యుత్ లైన్ రోడ్డు మార్జిన్‌లో వేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ వృక్షాల నరికి వేత

బల్లికురవ నుంచి వీర్ల గంగమ్మ దేవాలయం వరకు ఎంతో కాలం నుంచి రోడ్డు పక్కన బాటసారులకు నీడను ఇచ్చే భారీ వృక్షాలను విద్యుత్ లైన్ ఏర్పాటుతో తొలగించారు. ఈ రోడ్డులో వెళ్లే బాటసారులు వేసవిలో కాసేపు చెట్ల నీడన కుర్చొని సేద తీరి వెళ్లే వారని కానీ ఇప్పుడు చెట్లు లేకపోవడంతో రోడ్డు బోసిపోతుందని, ఎండలు ఈ ఏడాది తీవ్రంగా ఉన్న సమయంలో చెట్లను నరికివేయడం సరికాదని ప్రజలు అంటున్నారు. దశాబ్దాలుగా ఉన్న చెట్లను నరికి వేసి అమ్మకాలు చేశారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దేశాయిపేటలో పశువుల నీటి తొట్టె నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

నీటి తొట్టెలతో పశువులకు ప్రయోజనం

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నీటి తొట్టెల నిర్మాణంతో వేసవిలో పశుపక్షాలకు తాగునీటి సమస్య ఉండదని పలువురు టీడీపీ కూటమి నాయకులు అన్నారు. ఉపాధి హామీ నిధులతో మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ అనుమల్లిపేట శివారులో నీటి తొట్టెల నిర్మాణానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మూగ జీవాల భద్రత బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు నానిక వీరభద్రయ్య, వీర ప్రసాదరావు, వెంకటేశ్వర్లు, మల్లేశ్వరి, గ్రామస్థులు పాల్గొన్నారు.

బల్లికురవ ఎస్ఐగా నాగరాజు



బల్లికురవ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఐగా వై.నాగరాజును నియమిస్తు ఎస్పీ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. బల్లికురవ ఎస్‌గా పనిచేస్తున్న జీవీ చౌదరిని జిల్లా అధికారులు వీఆర్‌కు కేటాయించారు. వీఆర్‌లో ఉన్న నాగరాజును బల్లికురవ స్టేషన్‌కు కేటాయించారు. సోమవారం ఎస్ఐగా నాగరాజు బాధ్యతలు చేపట్టనున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బల్లికురవ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత పాఠశాలలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు విజయవాడకు చెందిన ఉష కార్డియాక్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరుగనుంది. ఈసందర్భంగా ప్రజలకు గుండెకు చెందిన అన్ని రకాల పరీక్షలు వైద్య బృందం నిర్వహించి మందులను అందజేస్తారని వైద్య శాల సిబ్బంది తెలిపారు. ఈ ఆకాశాన్ని బల్లికురవ పరిసర గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పోలీస్ శాఖకు ఎమ్మెల్యే ఏలూరి ప్రశంసలు

- చోరీ కేసును 24 గంటల్లోనే ఛేదించారని కితాబు
- ఇంకొల్లు పోలీసుల పనితీరు భేష్
- సీఐ రమణయ్య, ఎస్ఐ సురేష్‌కు ఎస్పీ అభినందనలు



ఎస్పీ తుషార్ డూడీతో డీఎస్పీ మహ్మద్ మోయిన్, సీఐ రమణయ్య, సిబ్బంది

పర్చూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శనివారం ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఇంకొల్లు పట్టణానికి చెందిన జాగర్లమూడి శివప్రసాద్ ఇంట్లో జరిగిన చోరీ కేసును 24 గంటల వ్యవధిలోనే చేధించి అద్భుత పనితీరు కనపరిచారని, పోలీసుల కృషి ఎమ్మెల్యే ఏలూరి కొనియాడారు. ఇంకొల్లు స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 3న ఆర్ధరాత్రి సమయంలో రూ.75 లక్షల చోరీ జరిగి, రూ.55,50,000 నగదు, రూ.20లక్షల విలువ కలిగే 24 సవర్ల బంగారు అభరణాల చోరీ కేసును ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు 24 గంటల్లోనే ఇంకొల్లు పోలీసులు ఛేదించి అంతర్ రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారని ఇది పోలీసుల పనితీరుకు నిదర్శనమన్నారు. ప్రజలకు రక్షణ కల్పించటం, ప్రజల ఆస్తులను కాపాడటంలో పోలీసుల పనితీరు అద్భుతంగా ఉందని కితాబు ఇచ్చారు. అలాగే ఎస్పీ తుషార్ డూడీ పోలీసులు ప్రతిభను అభినందించారు. చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్, ఇంకొల్లు సీఐ వై.రమణయ్య, ఎస్సై జి.సురేష్, పోలీసు సిబ్బంది జి.వీర్రాజు, కె.హరి చంద్ర నాయక్, జీకేవీ సుబ్బారావు, ముకేష్ వర్మ, కె.పనిత్ కుమార్, ఎన్ శరత్‌బాబును ఎమ్మెల్యే ఏలూరి అభినందించారు.



పుట్టంరాజు దంపతులను సత్కరిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

తెలుగుభాష సేవకు దక్కిన గౌరవం

- పుట్టంరాజు దంపతులకు ఘన సన్మానం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అద్దంకి సాహితీ, సాంస్కృతిక రంగాల్లో రాష్ట్ర స్థాయి గౌరవాన్ని తీసుకురావడంలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సాధన అద్దంకిని రాష్ట్ర స్థాయిలో నిలపడంతోపాటు తెలుగు భాషకు ఆయన చేసిన సేవలకు దక్కిన గౌరవమని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకున్న పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తికి శనివారం చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో సాహితీ కౌముది, రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అభినందన సభ వారణాసి రఘురామశర్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వక్తలు పుట్టంరాజు చేసిన సాధన, కృషిని, సేవలను కొనియాడారు. అనంతరం పుట్టంరాజు శ్రీరామమూర్తి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు రావుల బాపయ్య చౌదరి, జానపద కళాపీఠం, రమ్యశ్రీ ఫౌండేషన్, ఘంటసాల గానభారతి, గాత్త వాద్య కళాకారుల సంఘం, సృజన, జాషువా సాహిత్య కళావేదిక, బాటప్ల జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాండురంగ దేవాలయానికి విరాళం



పాండురంగ ఆలయానికి చెక్కును అందజేస్తున్న ప్రతినిధులు

చీరాల, ఏప్రిల్ 5 ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : విఠల్‌నగర్ పాండురంగ దేవాలయానికి మరమ్మతులకు వాకర్స్ అసోసియేషన్ చీరాల సభ్యులు తన్నీరు రామారావు రూ.51,116 చెక్కును శనివారం కమిటీ ప్రతినిధులు శ్రీరామ చంద్రమూర్తికి అందజేశారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రతినిధులు మాట్లాడుతూ దేవాలయాలకు విరాళాలు అందజేయడంపై అభినందించారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, గురుప్రసాద్, నారాయణమూర్తి, తిరుపతిరావు, నారాయణ, స్వామి, సుబ్బారావు, రమేష్, పూర్ణా, కిషోర్, శివాంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.

రాజ్యాంగ అంశాలపై అవగాహన

పేరాల(చీరాల), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పౌరుడు భారత రాజ్యాంగంలోని 10 ముఖ్యమైన అంశాలు, లక్ష్యాలపై అవగాహన కలిగి ఉండాలని వక్తలు అన్నారు. పేరాల కరూర్ వైశ్యా బ్యాంక్ వద్ద శనివారం ప్రచార కమిటీ, సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ జయంతి సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో చర్చా వేదికలు, సమావేశాలు, సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కోట వెంకటేశ్వరరెడ్డి, హరి హరరావు, రవి కుమార్, జయరామిరెడ్డి, జేజిబాబు, వెంకటేశ్వర్లు, రత్నారెడ్డి, వెంకయ్య పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్ర పాఠశాల వార్షికోత్సవం

చీరాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పాపరాజు తోటలోని రాఘవేంద్ర ఇంగ్లీషు మీడియం స్కూల్ 16వ వార్షికోత్సవం వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ముఖ్య అతిథులుగా పొగడదండ రవి కుమార్, సైన్స్ ఉపాధ్యాయులు పవని భానుచంద్రమూర్తి, టీడీపీ నాయకులు నక్కల వెంకట రమణరావు పాల్గొన్నారు. విద్యాభ్యాసంపై విద్యార్థులకు ప్రత్యేక సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ సెక్రటరీ గవిని మణికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ జెండాతో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి





జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, అద్దంకి, పర్చూరులో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

- వేర్వేరుగా పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య, వైసీపీ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల, ఏప్రిల్ 5 ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : సమానత్వం కోసం అహర్నిశలు శ్రమించి అణగారిని బీదాబిక్కు జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం నియోజకవర్గంలో జగ్జీవన్ జయంతిని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, పలు మాదిగ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సుమారు 40 ఏళ్లుగా వివిధ మంత్రి పదవులు అలంకరించి ఉప ప్రధానిగా ప్రజా సేవలో జీవించిన నేత జగ్జీవన్ అని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. పట్టణంలోని ముక్కోణం పార్క్ కూడలిలో ఉన్న జగ్జీవన్ కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో

ప్రజా సేవలకు జీవితాన్ని త్యాగం చేసి అన్ని సామాజిక వర్గాల మన్ననలు పొందిన మహోన్నత వ్యక్తి జగ్జీవన్ అని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. ఆయన విగ్రహానికి వెంకటేష్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఆయనవెంట మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాస రావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, పలువురు కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గోపీకృష్ణ ఆధ్వర్యంలో జగ్జీవన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ అర్జున్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. వేటపాలెం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పాలపర్తి పార్వతి ఆధ్వర్యంలో తహసీల్దార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌కు నివాళులర్పించారు. ముందుగా డప్పులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగ్జీవన్ విగ్రహం వద్దకు చేరుకుని పూల మాలలు కార్యక్రమంలో నాయకులు లక్ష్మీ నరసయ్య మాదిగ, వందనం మాదిగ, తేళ్ల రమేష్, రాంబాబు, రాజా, రమేష్, మురళి, రమేష్, రావినూతల నాగేశ్వరరావు, అరుణ్‌కుమార్, అగస్టీన్, శరత్, సైమన్, స్టాలిన్ పాల్గొన్నారు.

అద్దంకి : సామాజిక అసమానతలను రూపుమాపేందుకు బాబు జగజ్జీవన్‌రామ్ కంకణం కట్టుకొని పనిచేసి దేశ ప్రజల మనస్సులలో చిరస్థాయిగా నిలిచారని టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ వలపర్ల సుబ్బారావు అన్నారు. శనివారం పట్టణంలోని కట్టకిందపాలెంలో జగ్జీవన్ విగ్రహానికి పలు సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ ఎస్సీ సెల్, ఎమ్మార్పీఎస్ నేతలు, రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ, బహుజన సమాజ్ పార్టీల ఆధ్వర్యంలో జరిగాయి. టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, చిన్ని శ్రీనివాసరావు, కాకాని అశోక్, కుందారపు రామారావు, కోటయ్య, నాగేశ్వరరావు, స్టాలిన్, నరేంద్ర, నాగరాజు, జోసఫ్, జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి, వీరయ్య, మురళీసుధాకర్ పాల్గొన్నారు.

బల్లికురవ : డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నక్కబొక్కలపాడు ఎస్సీ కాలనీలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు పీ నాగయ్య, బండబాబురావు, సురభి ప్రభాకరరావు, రవి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న చినగంజాం తహసీల్దార్

ఇంకొల్లు : టీడీపీ కార్యాలయం వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, మార్క్, రామకృష్ణ, కరి శ్రీనివాసరా వు, రఫీ పాల్గొన్నారు. వంకాయలపాడు లో ఎస్సీ సెల్ నాయకుడు సురేష్‌బాబు నివాళులర్పించారు.

పర్చూరు : టీడీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు మక్కెన శేఖర్‌బాబు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శివనాగేశ్వరరావు, సుమన్, శ్రీరాం వెంకట సుబ్బారావు పాల్గొన్నారు. అలాగే కారంచేడు మండల పరిధిలోని ఆదిపూడిలో విగ్రహానికి వీరయ్య, కత్తి సుధాకర్, ఏసోబు నివాళులర్పించారు.

చినగంజాం : జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి తహసీల్దార్ జీవిగుంట ప్రభాకర రావు, సిబ్బంది, వీఆర్వోలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

మార్టూరు : చిమ్మిరిబండలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఏపీటీఎఫ్ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కిషోర్, సురేంద్ర, శ్యామ్, జయకుమార్, రమేష్, జోసఫ్ పాల్గొన్నారు. యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణ, ఉపాధి ఉద్యోగులు నివాళులర్పించారు.

మేదరమెట్ల: కొరిశపాడు, పమిడిపాడు, పి.గుడిపాడు గ్రామాల్లో జగ్జీవన్ విగ్రహాలకు నివాళులర్పించడంతో పాటు ఆయన సేవలను కొనియాడారు.



నివాళి అనంతరం వైసీపీ ఇన్‌చార్జి వెంకటేష్

నిరసనతో నివాళి

- మునిసిపల్ చైర్మన్‌ను కార్యాలయంలోకి ప్రవేశం లేకుండా తాళాలు వేయించిన కమిషనర్
- ఆయన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన చైర్మన్, తదితరులు
- అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్
- కార్యాలయం ముందు ఆందోళన

చీరాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల్లో రాజకీయం వేడెక్కుతోంది. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించడకుండా అడ్డుకున్నారు. మున్సిపల్ కమిషనర్ కార్యాలయం గేట్లకు రాత్రికిరాత్రే తాళం వేశారు. శనివారం మునిసిపల్ చైర్మన్ తన హోదాలో కార్యాలయంలో జగ్జీవన్ జయంతిని నిర్వహించేందుకు వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, పలువురు కౌన్సిలర్లతో ఉదయం చేరుకున్నారు. అయితే ప్రధాన గేట్లకు తాళాలు వేసి ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. వెంటనే పలుమార్లు కమిషనర్ అబ్దుల్ రషీద్‌కు ఫోన్ చేసిన ఆయన నుంచి స్పందన లేదు. దీంతో చైర్మన్ కమిషనర్ తీరుపై అసహనం చెందారు. మునుపెన్నడూలేని విధంగా మహనీయుల కార్యక్రమాన్ని ఇలా అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అయితే గేట్లు వేసి ఉండడంతో చైర్మన్ జంజనం తదితరులు బయట నిరసన తెలుపుతూనే మరోపక్క జగ్జీవన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.



జగ్జీవన్‌కు నివాళి అర్పించిన అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న చైర్మన్ జంజనం, వైస్ చైర్మన్ బొనిగల, వైసీపీ కౌన్సిలర్లు

ఈ విషయమై టీడీపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ సెలవు రోజు కావడంతోనే కార్యాలయానికి తాళాలు వేసినట్లు చెప్పారు. అనవసరంగా వ్యవహారాన్ని చైర్మన్ రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు.

కాగా వైసీపీ నేతల ఆరోపణపై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



ఆకట్టుకున్న రాజమండ్రి కళాకారుల నృత్యరూపకం


వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవం

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపూరుపాలెం పురుగుల పేటలో వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవం వేడుకలు శుక్రవారం రాత్రి కమిటీ ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈక్రమంలో అమ్మవారి చెట్టుకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. మేళతాళాలతో, విద్యుత్ దీపాల అలంకరణతో, అమ్మవారి రాజమండ్రి వేషధారణతో వేడుకలు నిర్వహించారు. అంతేకాకుండా అర్ధరాత్రి వరకు ప్రభ నగరోత్సవం వీధుల్లో జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయి పొంగళ్లు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమం ఆద్యంతం కమిటీ ప్రతినిధులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.



విశేష అలంకరణలో అమ్మవారు

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
ఆదివారం 6 ఏప్రిల్ 2025





శబరి శ్రీరామక్షేత్రంలో కొలువుదీరిన ఉత్సవర్లు

శబరి శ్రీరామక్షేత్రంలో వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో శ్రీరామ నవమి వేడుకలు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటలకు శ్రీరామకోటి స్థూపం మైదానంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరగనుంది. ఉత్సవర్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు అందజేస్తారని ఆలయ చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. కాగా, శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శనివారం క్షేత్రంలో సీతా జయంతి వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఉదయం కోదండరామస్వామికి అభిషేకం, తులసీ దళాలతో సహస్ర నామార్చన, హోమాలు జరిగాయి. సాయంత్రం అర్చన, సీతాదేవిని పెళ్లికూతురును చేయడం, తలంబ్రాలు, బియ్యం కలుపుట, తాంబూలం ఇచ్చి భక్తులను సీతారాముల కల్యాణానికి ఆహ్వానం పలికారు.



సిద్ధమైన కల్యాణవేదిక



తలంబ్రాలు కలుపుతున్న భక్తులు







విద్యుద్దీప అలంకరణలో కోవూరు, అల్లూరులోని కోదండరామస్వామి ఆలయాలు

రామ.. రామ.. జయసీతారామ!

• ఆధ్యాత్మిక లోగిలి.. కోదండరాముడి సన్నిధి • నేడు శ్రీరామనవమి పర్వదినం • ముస్తాబైన జానకీరాముడి ఆలయాలు

శ్రీరాముడు మానవాళికి మార్గదర్శకుడు. ఉత్తమ మానవుడి లక్షణాలు ఎలా ఉండాలో ఆచరించి చూపిన మహనీయుడు. అంతటి మహాపురుషుడి జన్మదిన వేడుకే శ్రీరామనవమి. ధర్మానికి ప్రతిరూపమైన శ్రీరాముడిని కీర్తిస్తూ భక్తజనం పండుగ జరుపుకుంటున్న శుభ తరుణమిది. హిందువులు ఎంతో పవిత్రంగా జరుపుకునే ఈ పండుగకు ప్రత్యేకమైన ఆధ్యాత్మికత, సాంస్కృతిక, పౌరాణిక ప్రాధాన్యతలు ఉన్నాయి. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ఆ జానకీరాముడిని కొలిచేందుకు జిల్లాప్రజానీకం సిద్ధమైంది. ఇప్పటికే రామమందిరాలు ముస్తాబయ్యాయి.

సుందర కాండ పఠించాలి

ముఖ్యంగా శ్రీరామనవమి రోజున భక్తులంతా శ్రీరాముడిని స్మరించుకుని సుందరకాండను పఠించాలి. సంతోషకర జీవితం కోసం సీతారాములను పూజించాలి. కష్టాల నుంచి విముక్తి పొందడానికి గంగా జలాన్ని, ఏదైనా పవిత్ర నది నీటిని ఒక పాత్రలో తీసుకుని 'ఓం శ్రీ హ్రీం క్లీం రామచంద్రాయ శ్రీ నమః' అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలని పండితులు చెబుతున్నారు.

పూజా విధానం

శ్రీరామ నవమి రోజున సూర్యోదయం కంటే ముందే నిద్ర లేవాలి. ఇంట్లో మామిడి ఆకులు, కొబ్బరి కాయను కలశంపై ఉంచాలి. శ్రీ సీతా రాములకు ధూపం, దీపం, పండ్లు, పువ్వులు, వస్త్రాలు సమర్పించాలి. శ్రీరాముడికి నైవేద్యం సమర్పించి పూజ పూర్తయిన తరువాత విష్ణు సహస్రనామం పఠించి హారతి ఇవ్వాలి. నవమి రోజున పానకం, వడపప్పు తయారుచేసి మహా ప్రసాదంగా స్వీకరిస్తారు. దీని వెనుక ప్రకృతి పరమార్థము లేకపోలేదు. ఇది వేసవికాలం కావడంతో వీటిని ప్రసాద రూపంలో సేవించడం వల్ల ప్రజల ఆరోగ్యం, ఆయుష్షు అభివృద్ధి కలుగుతాయని ఆయుర్వేద పండితులు అభిప్రాయం. వసంత రుతువులో వచ్చే గొంతు వ్యాధులకు పానకంలో వినియోగించే మిరియాలు, యాలకులు ఉపశమనాన్ని ఇస్తాయని, ఔషధంలా పని చేస్తాయి. పెసరపప్పును వడపప్పు అంటారు. పెసరపప్పు శరీరంలోని ఉష్ణాన్ని తగ్గించి, చలువ చేస్తుంది. జీర్ణశక్తిని వృద్ధి చేస్తుంది.

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ చంద్రుడిని తెలుగువారు ప్రతి ఇంటా ఇలవేల్పుగా కొలుస్తారు. హిందూ మత విశ్వాసాల ప్రకారం దశరథుడు, కౌసల్య దంపతులకు త్రేతాయుగంలో చైత్ర శుద్ధ నవమి రోజున, వసంత రుతువు కాలంలో శ్రీరాముడు జన్మించాడు. 14 సంవత్సరాల వనవాసం తరువాత రావణ సంహారం అనంతరం శ్రీరాముడు సీతాసమేతంగా అయోధ్యలో సింహాసనాన్ని అధిష్ఠిస్తారు. నవమి రోజున సీతారాముల కల్యాణం జరిగిందని, పట్టాభిషేకం కూడా అదే రోజు జరిగిందని చెబుతారు. శ్రీరామనవమి రోజున రామ నామ స్మరణ చేయడం వల్ల అనేక రెట్లు పుణ్యఫలం లభిస్తుందని భక్తులకు ప్రగాఢ విశ్వాసం. అందుకే ఈ పవిత్రమైన రోజున ప్రతి ఏడాది శ్రీరామనవమి వేడుకలను జరుపుకుంటారు. జిల్లావ్యాప్తంగా అన్ని ఆలయాల్లో పందిళ్లు వేసి సీతారామకల్యాణం జరుపుతారు. ఈ వేడుకలో తలంబ్రాలను పెళ్లి కానివారు అక్షింతలుగా వేసుకుంటే పెళ్లి కుదురుతుందని నమ్మకం.

● దాన ధర్మాలు చేయాలి

పురాణాల ప్రకారం రాముడు పసుపు రంగు వస్త్రాలు ఇష్టపడతాడని తెలుస్తోంది. దీంతో రామాలయాల్లో పసుపు వస్త్రాలు సమర్పిస్తే శ్రీరాముడు సంతోషిస్తాడని, తమ ఇళ్లలో ఆనందం పెరుగుతుందని, శుభ ఫలితాలు వస్తాయని భక్తుల విశ్వాసం. అలాగే పేదలకు అన్నం, బట్టలు తదితర వస్తువులను దానం చేయాలి. దీనివల్ల పుణ్యఫలం దక్కుతుందని పండితులు చెబుతున్నారు.

SUNDAY SPECIAL

ఆనందవనం

• 50 హెక్టార్లలో సుందరప్రాంతం • తరలివస్తున్న ప్రకృతి ప్రేమికులు

చుట్టూ అటవీ ప్రాంతం.. పచ్చని చెట్లు.. వాటిల్లో నుంచి పక్షుల కిలకిలరావాలు.. మనసును హాయిగొలిపే ఆహ్లాదకర వాతావరణం.. ఇవన్నీ నగరవనం సొంతం. సాయంసంధ్యవేళ ప్రశాంతంగా కూర్చోవడానికి పచ్చిక బయళ్లు.. పిల్లలకు ఆటవస్తువులు.. ట్రెక్కింగ్ ట్రాక్.. కళ్లను కట్టిపడేసే వన్యప్రాణుల బొమ్మలు.. మ్యూజికల్ ఫౌంటెన్ అబ్బో ఇలా చెప్పుకుంటూ పోతే నగరవనంలో చాలానే ఉన్నాయి. నెల్లూరుకు పది కి.మీ దూరంలో ఉన్న ఈ సుందర పార్కులో సేద తీరేందుకు నగరవాసులే కాదు.. దూరప్రాంతాల నుంచి కూడా తరలివస్తున్నారు. చిన్నా పెద్ద అని తేడాలేకుండా అందరినీ ఆకట్టుకుంటున్న 'నగరవనం'పై ఆంధ్రజ్యోతి ఆదివారం ప్రత్యేక కథనం...

- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత పరుగు ప్రపంచంలో సెలవు దొరికితేచాలు జిల్లావాసులు మైపాడు, కోడూరు వంటి తీరప్రాంతాలకు వెళ్లి సేదతీరుతారు. మరికొందరు ఆలయాలకు వెళతారు. ఇంకొందరు నగరంలో ఉన్న పార్కుల్లో గడుపుతారు. నగర, పట్టణవాసుల సౌలభ్యం కోసం నగరానికి కూతవేటు దూరంలో అంటే కొత్తూరు సమీపంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నగరవనం అందరినీ ఆకట్టుకుంటోంది. నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల ప్రాంతంలో దాదాపు 125 హెక్టార్ల అటవీ



సందడిగా ఉన్న పిల్లల పార్కు

ప్రాంతంలో ఈ సుందర ప్రాంతం ఏర్పాటుకు 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పునాది వేసింది. మొదటి విడతలో 50 హెక్టార్లలో పార్క్‌ను అభివృద్ధి చేశారు. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వం రూ.1.40 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2.10 కోట్లు మంజూరు చేశాయి.

● ఆహ్లాదానికి.. ఆటలకు ప్రత్యేకం

నగరవనంలో పర్యాటకులు ఆహ్లాదకరంగా గడిపేందుకు అటవీ శాఖ అనేక ఏర్పాట్లు చేసింది. పిల్లల కోసం ప్రత్యేక పార్క్‌ను ఏర్పాటు చేశారు. అలాగే, వాకింగ్ ట్రాక్, ట్రెక్కింగ్ ట్రాక్, ప్రకృతి వ్యూ పాయింట్లు, యోగా సెంటర్, క్యాంటీన్, మ్యూజికల్ ఫౌంటెన్, ఓపెన్‌జిమ్, ఫొటో షూట్ ప్రాంతం, ఫంక్షన్ హాల్, వన్యప్రాణుల బొమ్మలతో కూడిన ఆర్చీలు ఇలా ఎన్నో నగరవనంలో ఉన్నాయి.

● ప్రవేశ రుసుము

నెల్లూరు నగరవనంలో ప్రవేశానికి గత ఏడాది జూన్ నుంచి అటవీశాఖ పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10 చొప్పున రుసుము వసూలు చేస్తోంది. అలాగే, ఫొటోషూట్‌లకు రూ.500, మినీ ఫంక్షన్ హాల్‌కు రూ.5వేలు (రోజుకు), పెద్ద ఫంక్షన్ హాలుకు రూ.10వేలు (రోజుకు) చొప్పున నిర్ణయించారు. వీటితోపాటు ఓపెన్ ఫంక్షన్ హాలు, ఓపెన్ ఆడిటోరియం సైతం అందుబాటులో ఉంది. అలాగే, పుట్టినరోజు వేడుకలు, చిన్న చిన్న శుభకార్యాలు, మిత్రుల సమావేశాలు కూడా జరుపుకొనేందుకు అద్దెకు ఇస్తున్నారు. ఇలా నెలకు అటవీశాఖకు రూ.3లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నగరవనంలోకి అనుమతి ఉంటుంది. త్వరలో సినిమా షూటింగ్‌లకు సైతం నగరవనాన్ని అద్దెకు ఇవ్వనున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

3 నెలల్లో పూర్తిస్థాయిలోకి..

రాష్ట్రంలోనే అతిపెద్ద పార్క్‌గా నెల్లూరు నగరవనాన్ని రూపొందిస్తున్నాము. ఇప్పటివరకు రూ3.5 కోట్లతో దాదాపు 50హెక్టార్లలో అభివృద్ధి చేశాము. ఇంకా కొంత చేయాల్సి ఉంది. నెల రోజుల్లో కేంద్రం మంజూరు చేసిన రూ.60లక్షలు వస్తాయి. ఈ నిధులతో పార్కును అభివృద్ధి చేసి, మూడు నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తాము. ఆహ్లాదకరంగా పచ్చని ప్రకృతిలో గడపాలనే వారు తప్పనిసరిగా నెల్లూరు నగరవనానికి రండి.

- మహబూబ్‌బాషా, డీఎఫ్‌వో









జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ తదితరులు

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ఉపప్రధాని, సంఘ సంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్‌కు ప్రజా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు ఘన నివాళులర్పించారు. శనివారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నగరంలోని వేదాయపాళెంలో ఉన్న ఆయన విగ్రహానికి కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్యమాదిగ తదితర ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు కాగా, టీడీపీ నేతలు జన్నిరమణయ్య మాదిగ, మందా మస్తానయ్య ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు కట్ చేసి, అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో సంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, ఎంఆర్‌పీఎస్ జిల్లా కోఆర్డినేటర్లు బెల్లంకొండ గోపి మాదిగ, కోలగట్ల రమేష్‌మాదిగ, భారత సేవా ఫౌండేషన్ జిల్లా కార్యదర్శి షేక్ ఖాసీం, కొమ్మల కృష్ణయ్య పాల్గొన్నారు.



భారీ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు

మామిడికి ప్రతికూలం!



- మంచుకుతోడు ఈదురుగాలుల ప్రభావం
- మాడిపోతున్న పూత, రాలిపోతున్న పిందె
- దిగుబడులపై తీవ్ర ప్రభావం

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి) : వెంటాడుతున్న తెగుళ్లు.. పెరుగుతున్న పెట్టుబడులతో ఏటా మామిడి రైతులు నష్టాలను మూటగట్టుకుంటున్నారు. పెట్టుబడి కింద రూ.లక్షలు ఖర్చు చేసినా ఆశించినస్థాయిలో దిగుబడి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనూ కురుస్తున్న మంచు మామిడి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం పూత మాడిపోయి, పిందెలు మగ్గి రాలిపోతుండటంతో సాగుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా ఈదురు గాలులతో వర్షం కురుస్తుండటంతో చెట్లపై ఉన్న అర కొరగా కాయలు, పూత నేల రాలుతుండ టంతో రైతులు కోలుకోలేని పరిస్థితి నెలకొంది.

వాతావరణం అనుకూలించక

ఈ ఏడాది మామిడి రైతులకు వాతావరణ పరిస్థితులు ఆశించనంత అనుకూలంగా లేవు. కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు, కావలి, నెల్లూరు ప్రాంతాల్లో సుమారు 8 వేల హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. పొంగ మంచు ప్రభావం ఉండ టంతో పూత మాడిపోయి కొంత మేర రాలిపోతోంది. ఇందుకోసం రైతులు మందులు పిచికారి చేసినా ఫలితం ఉండటం లేదు. పూత పిందె దశకు చేరినా చెట్టు మీద నిలబడటం లేదు. సాధారణంగా లేత తోటలు అయితే ఎకరాకు 2 నుంచి 4 టన్నులు, ముదురు తోటలు అయితే 5 నుంచి 7 టన్నుల దిగుబడి రావాల్సి ఉంది. కానీ ఈ ఏడాది నెలకొన్న ప్రతికూల వాతావరణ పరిస్థితులతో దిగుబడి బాగా తగ్గిపోతుందని రైతులు అంటున్నారు.



అల్లూరు రోడ్డులో దోపిడీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్పీ రాహుల్ మీనా

8

రైలులో చోరీ కేసు.. ముగ్గురిని గుర్తించాం!

- మొత్తం ఆరుగురిగా అనుమానం
- త్వరలోనే నిందితుల అరెస్టు?
- గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్ మీనా
- ఘటనాస్థలిలో వివరాల సేకరణ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	113
స్కిన్ చికెన్	202
స్కిన్‌లెస్	226

కోడిగుడ్ల ధర (100): 430

నెలాఖరులోపు పన్నులు చెల్లిస్తే 5 శాతం రాయితీ

కావలి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కావలి పురపాలక సంఘంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, ఖాళీస్థలం పన్నులను పూర్తిగా ఒకేసారి ఈ నెలాఖరులోపు చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపుదారులు మీ దగ్గరలో ఉన్న మీసేవా కేంద్రంలో, సచివాలయాలలో, మున్సిపల్ కార్యాలయంలో పన్ను చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు

కందుకూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గ ప్రజలకు ప్రజాప్రతినిధులు, నేతలు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, తూమాటి మాధవరావు, మాజీమంత్రి మానుగుంట మహీధరరెడ్డి, వైసీసీ ఇంఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, మాజీఎమ్మెల్యే దివి శివరాంలు వేర్వేరు ప్రకటనల్లో శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలి

● మాలకొండను సందర్శించిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని కందకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్యే నాగేశ్వరరావు శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ప్రధాన ఉప అర్చకుడు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు అనంతరం మహా అన్నదానం, లడ్డుప్రసాదం కౌంటర్, కేశఖండన శాలతో పాటు ఆలయంలో జరుగుతున్న పలు అబివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు నాణ్యమైన భోజనం పెట్టాలని, భక్తులకు అసౌకర్యం కలిగితే సహించేది లేదని తెలిపారు. ఆయన వెంట ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు కాకుమాని హర్ష, సోమినేని రవీంద్ర, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వీఎస్‌యూ ఫస్ట్ ర్యాంక్ విద్యార్థినికి అభినందన



షమితకు మిఠాయి తినిపించి అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఉమ, అధ్యాపకులు

కావలిటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) కావలి ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల బీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థిని షమిత విక్రమసింహపురి యూనివర్సిటీలో ఫస్ట్ ర్యాంక్ సాధించింది. దీంతో శనివారం కళాశాలలో కరస్పాండెంట్ రాజ్‌కుమార్ చౌదరి, ప్రిన్సిపాల్ ఉమమహేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, ఏవో మధు, అధ్యాపకులు, సిబ్బంది షమితకు మిఠాయిలు తినిపించి అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వీఎస్‌యు విడుదల చేసిన డిగ్రీ పరీక్ష ఫలితాల్లో 10కి 10 జీపీఏ సాధించి యూనివర్శిటీ ఫస్ట్ ర్యాంక్ సాధించిచడం గర్వకారణమన్నారు.

ఆక్రమణల చెరలో

డ్రైనేజీ కాలువలు!



అటవీశాఖ కార్యాలయ వీధిలో సీటీవో కార్యాలయం పక్కన కనుమరుగైన కాలువ

» అడిగే నాథుడు కరువు
» వర్షం పడితే రోడ్డుపైకి మురుగు
» పట్టణ ప్రజలకు తప్పని అవస్థలు

కావలిటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణ పరిధిలో డ్రైనేజీ కాలువలు ఆక్రమణలతో కుంచించుకుపోతున్నాయి. ఆ కాలువల్లో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శుద్ధి చేసేందుకు ఏమాత్రం అవకాశం లేనంతంగా కనుమరుగవుతోన్నాయి. సరైన నిర్వహణకు నోచుకోకపోవడంతో ఉన్న సన్నపాటి కాలువలు చెత్తాచెదాలతో నిండిపోయి మురుగు నీరు ముందుకు ప్రవహించలేక నిల్వ చేరి దుర్గంధం వెదజల్లడంతోపాటు పందులకు ఆవాసాలుగా, దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతోన్నాయి. అయినా పట్టించుకునే నాథుడు లేకపోవడంతో వర్షం పడినప్పుడు కాలువల్లో మురుగుతో కలిసి వర్షం నీరంతా రోడ్డు మీదకు చేరుతోంది. దీంతో పట్టణ ప్రజలు అల్లాడుతోన్నారు. ట్రంకురోడ్డు దాటుతూ ఏఎం బేకరి పక్కనున్న దాదాపు 8 అడుగుల పెద్ద డ్రైనేజీ కాలువ ఆక్రమణకు గురై రెండు అడుగులకు కుంచించుకుపోయింది. ట్రంకురోడ్డు ముఖద్వారంలో ఇప్పటికీ 8 అడుగుల కాలువ స్థలం ఉన్నప్పటికీ పోయేకొద్ది అక్రమ నిర్మాణాలతో సన్నగా మారిపోయింది. ఆ కాలువ తిరిగి సీటీవో కార్యాలయం పక్క నుంచి అటవీ శాఖ కార్యాయం రోడ్డు కాలువలో కలిసి సమీపంలోని పాపిరెడ్డి చెరువు గుండా పోతోంది. అయితే కాలువ చివర్లో సీటీవో కార్యాల యం పక్కన 8 అడుగుల స్థలం ఇప్పటికీ అందుబాటులో ఉన్నప్పటికీ సన్నటి కాలువ నిర్మాణంలో ఉండడం వలన వర్షం పడినప్పు డు కాలువ సామర్థ్యం సరిపోక అటవీ కార్యాలయ రోడ్డు మురుగుమయంగా మారడం పరిపాటి అయింది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అందుబాటులో ఉన్న కాలువ స్థలమైన ఆక్రమణకు గురికాకముందే కాలువ వెడల్పు పెంచి నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను పంపించి కాలువ స్థితిగతులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.



ఏఎం బేకరి పక్కన ఆక్రమణకు గురైన కాలువ

న్యూస్ బాక్స్

కిలో పొగాకు రూ.280

కలిగిరి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 454 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో ఎనిమిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 331 బేళ్ల కొనుగోలు చేశారు. నోబిడ్-92, ఆర్ఆర్-5, సీఆర్-17, జంపింగ్‌లాట్స్-9 తదితర కారణాలతో 123 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.230, సగటు ధర రూ.262.52 నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమణయ్య

కావలి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కావలి శాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు యూనియన్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా డీవీ రమణయ్య, కార్యదర్శిగా ఎన్.రామకృష్ణ, కోశాధికారిగా పీ.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా జీ. వంశీ, ఉపకార్యదర్శిగా మనోహర్‌నాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

గ్యాస్ సిలిండర్లు ఏమవుతున్నాయి?

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం శ్రీరామపురంలో వంట గ్యాస్ సిలిండర్లు మాయమవుతున్న ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. దుండగులు రాత్రులు ఇల్లు, టిఫన్ దుకాణాల్లోకి ప్రవేశజంచి సిలిండర్లను అపహరించుకుపోతున్నారని స్థానికులు అంటున్నారు. స్థానిక పోలీసులు గ్యాస్‌సిలిండర్ దొంగలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు అప్రజాస్వామికం

బిట్రగుంట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు అప్రజాస్వామికం అని ముస్లిం మైనార్టీ నేతలు షేక్.నూరుద్దీన్, జహీర్ అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని సీపీఎం కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ముస్లింలు అభ్యంతరాలు తెలుపుతూ ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా కేంద్రం కక్ష పూరితంగా ఆమోదించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు తుమ్మల వెంకయ్య, సీటీటీయూ కార్యదర్శి చల్లా నరహరి, అన్వర్‌బాషా, రామయ్య అహ్మద్‌బాషా, నిజాముద్దీన్, నవీద్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

9న మున్సిపల్ గదులు, హోర్డింగ్‌లకు బహిరంగ వేలం

కందుకూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీగా ఉన్న గదుల లీజుకు, పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రచార హోర్డింగ్‌ల లీజుకు కేటాయించేందుకు ఈనెల 9వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె.అనూష ఒక ప్రకటనలో తెలిపారు. పాత లారీస్టాండ్ ఆవరణలో నిర్మించి ఉన్న మున్సిపాలిటీ గదులలో షాప్ నెం 1, 13, 15లకు, వెంకట నారాయణ బజారులోని కేవీఆర్ కాంప్లెక్స్‌లో షాప్ నెం 6కు, ముత్యాలకుంట పార్కువద్ద గల షాపునకు బహిరంగ వేలం జరుగుతుందని, ఆసక్తి కలిగిన వ్యాపారులు పాల్గొనాలని పేర్కొన్నారు. ప్రచార హోర్డింగ్‌లకు కూడా ఏడాది హక్కు కోసం నిర్వహిస్తున్న బహిరంగ వేలంలో పాల్గొనదలచినవారు రూ.50వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చునని తెలిపారు.

మూడో రోజూ విడుదల కాని నీరు

లింగసముద్రం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం నుంచి శనివారం మూడో రోజు కూడా నీటి సరఫరా జరగలేదు. గురువారం ఈ పథకంకు చెందిన సంపులు శుభ్రం చేసేందుకు అధికారులు, సిబ్బంది నీటి సరఫరాను నిలుపుదల చేశారు. అయితే పెంట్రాలలోని ఫిల్టర్ పాయింట్ వద్ద ఉన్న సంపులలోని వాల్వ్‌లు కూడా మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వాటిని కూడా బాగు చేయించేందుకు అధికారులు మెకానిక్‌ల వద్ద ఇచ్చినట్టు చెప్పారు. వీటిని ఫిల్టర్ పాయింట్ వద్ద బిగించి ఆదివారం ఉదయం నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. మూడు రోజుల పాటు ఈ మంచినీటి పథకం నుంచి నీటి సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తాగునీటి సరఫరా నిలిపివేత

వలేటివారిపాలెం : లింగసముద్రం మండలంలోని మొగిలిచర్ల వద్ద ఉన్న చుండి చెర్లోపాలెం రక్షిత తాగునీటి పథకం మోటారు మరమ్మతులకు గురికావడంతో మండలంలోని మాలకొండ, అయ్యవారిపల్లె, పోలినేనిచెరువు, గరుకుపాలెం, చుండి, పెద్దఅమ్మపాలెం, తదితర గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిపివేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శిరీషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజాస్వామ్యవాది జగ్జీవన్‌రామ్

● కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి



కావలి : బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, తదితరులు

కావలిటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్‌రామ్ సామాజిక యోధుడు, ప్రజాస్వామ్య వాది అని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కొనియాడారు. శనివారం భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని మాగుంట పార్వతమ్మ రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆర్డీవో సన్నీవంశీకృష్ణతో కలసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే ముసునూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ నాయకులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంటరానితనం, ఆర్థిక సామాజిక అసమానతలు రూపుమాపేందుకు జగ్జీవన్‌రామ్ తన జీవితం అంకితం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, జ్యోతి బాబురావు, మొగిలి కల్లయ్య, కండ్లగుంట మధుబాబు నాయుడు, పొట్లూరి శ్రీనివాసులు, ఏగూరి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో చిత్రపటం ఉంచి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతలు కిరణ్, మంద వెంకటేశ్వర్లు, అక్కిలగుంట ఏసు, కత్తి శివయ్య, మహేష్, జానకి, ప్రసాద్ పాల్గొన్నారు.

● బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి ఎద్దు బ్రహ్మయ్య, నేతలు జ్ఞానశేఖర్, మణి, చక్కా రవి, బాలు తదితరులు బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

● బీజేపీ నేతలు భరత్‌కుమార్, అమరా సుబ్బారావు, బ్రహ్మానందం, మంద కిరణ్, పరుసు వెంకటేశ్వర్లు, మంద శ్రీనివాసులు తదితరులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● కావలి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎం.సన్నీ వంశీ కృష్ణ, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్‌లు బాబు జగజ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరు : భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు చర్చి సెంటర్‌లో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంతకుముందు స్థానిక టీడీపీ కార్యాలయంలోను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అట్టడుగువర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని, దేశానికి ఆయన చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, కంచ్రా మాల్యాద్రి, రాయపాటి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, బీజేపీ నాయకుడు గట్టుమనేని హరిబాబు, ప్రజాసంఘాల నాయకులు గురిజాల బెంజిమెన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ నాయకులు కె.వీరారెడ్డి, బూసి సురేష్‌బాబు, వై. ఆనంద్‌మోహన్, షేక్ హుస్సేన్, బాలబ్రహ్మాచారి, ఉప్పుటూరి మాధవరావు, కోటేశ్వరరావు తదితరులు జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు.

కావలి రూరల్ : స్వాతంత్ర్య సమరయోధుడిగా డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ ఎనలేని సేవలు అందించారని ఎమ్పీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు పీ.శ్రావణ్‌కుమార్, ఎమ్పీడీవో కార్యాలయంలో ఎమ్పీడీవో సీహెచ్.శ్రీదేవిలు జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అల్లూరు : స్థానిక టీడీపీ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, కావలి కృష్ణ, నజీర్‌బాషా, ఇస్మాయిల్, వెంకయ్య, శీనయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దళితులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్లు సాల్మన్‌రాజు, గాలి వేణుగోపాల్, దర్శిగుంట వాసు, యశ్వంత్ కుమార్, శ్రీనివాసులు, వికాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఎమ్మార్పీస్ దాని అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. యన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగసముద్రం : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ అని టీడీపీ నేత ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో టీడీపీ నేతలు అంగుళూరి చినకొండయ్య, మన్నేపల్లి నాగేశ్వరరావులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడపా నర్సయ్య, గొల్లపల్లి వెంకటేశ్వర్లు, భట్టరుశెట్టి రమణయ్య, దార్ల మధు, కిలారి మల్లికార్జున, మక్కెన మల్లికార్జున, సీహెచ్ శింగయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ఎస్ సీతామహాలక్ష్మి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ కే శ్రీనివాసులు, ఆర్ఐ రమణయ్య, వీఆర్‌వోలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపురం : ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యసిబ్బంది బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉలవపాడు : ఉలవపాడులోని బస్టాప్ సెంటర్‌లో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు ఆర్ ఐజాక్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కరేడు గ్రామంలోని ఆయన విగ్రహానికి పంచాయతీ పారిశుధ్య కార్మికులు, ఎంఆర్‌పీఎస్ నాయులు గడ్డం నవీన్, పున్నెపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు.

బిట్రగుంట : బోగోలు మండలంలో వాడవాడలా జగ్జీవన్‌రామ్ జయింతి వేడుకలు జరిగాయి. చెంచులక్ష్మీపురం అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత, గిరిజన నాయకులు ఆంధ్ర బుద్ధయ్య, బోగిరి యోహాను ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపట్టానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతలు ఇజ్రయేల్, వెంకటేశ్వర్లు, రాధయ్య, మోషే, ప్రభాకర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, ఎల్.సుధీర్‌బాబు, మాధవరావు, పోతల శీనయ్య, రామోహన్‌రెడ్డి జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ అధ్యక్షుడు ఎస్ఎస్ యాదవ్, జీ.వెంకటేశ్వర్లు, నేతలు వెంకటకృష్ణ, మనోహర్, సూర్యం, రైల్వే పెన్షర్స్ అసోసియేషన్ సభ్యులు గోవిందురాజులు, రాజన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరావు, టీడీపీ నాయకులు

రాయితీతో రైతుకు భరోసా!

» వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు » అర్హుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
» మండలానికి 41 యంత్రాల మంజూరు



రోటోవేటర్‌తో దుక్కి చేస్తున్న రైతు

కొండాపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రైతుకు వ్యవసాయంలో చేయూత అందించేందుకు ప్రభుత్వం పలు రకాల పథకాలు ప్రవేశపెడుతోంది. అందులో భాగంగా వ్యవసాయంలో యాంత్రీకరణ పరికరాలు రాయితీపై అందించనుంది. మండలానికి 41 యంత్ర పరికరాలు మంజూరు అయ్యాయి. ఈ పథకాలు పొందేందుకు దరఖాస్తు చేసుకునే రైతులు సన్న, చిన్నకారు రైతులై ఐదు ఎకరాల లోపు పొలం కలిగి ఉండటంతో పాటు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు కలిగి ఉండాలి. గడచిన ఐదేళ్లలో ఎలాంటి సబ్సిడీలు పొంది ఉండరాదు. ఖరీఫ్, రబీ ఏదో ఒక సీజన్‌లో ఈక్రాప్ నమోదై ఉండాలి. ట్రాక్టరు పరికరాలు పొందాలంటే వాహనం యొక్క ఆర్సీ పత్రాలు దరఖాస్తుతో పొందుప రచాలి. వాహనం కుటుం బంలో వ్యక్తుల పేరుమీద ఉంటే రేషన్ కార్డులో నమోదై ఉండాలి. అన్ని అర్హతలతో కూడిన పత్రాలతో రైతులు రైతు సేవాకేంద్రాలకు వెళ్లిన ట్లయితే వ్యవసాయశాఖ అధికారులు ఆన్‌లైన్లో దరఖా స్తు చేసుకుంటారు. అనుమతి పొందిన రైతు రాయితీ పోను మిగిలిన నగదును వెంటనే చెల్లించాల్సి ఉంటుంది. మంజూరైన పరికరాలలో తైవాన్ స్ప్రేయర్లు 15లో జనరల్-12, ఎస్సీ-2, ఎస్టీ-1 కేటాయించారు. కల్టివేటర్లు 23లో జనరల్-17, ఎస్సీ-4, ఎస్టీ-2, 1 రోటోవేట రు ఎస్టీలకు, రెండు చార్జింగ్ స్ప్రేయర్లు జనరల్ విభాగానికి కేటాయించారు. అన్ని వర్గాల రైతులందరికీ రాయితీ ఒకే విధంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

మండలానికి మంజూరైన రాయితీ పరికరాల వివరాలు

పరికరాలు	మంజూరైనవి	ధర	రాయితీ
తైవాన్ స్ప్రేయర్లు	15	రూ. 26,010	రూ.10,000
కల్టివేటర్లు	23	రూ.43,350	రూ.21,675
చార్జింగ్ స్ప్రేయర్లు	2	రూ 4,480	రూ.1,000
రోటోవేటర్లు	1	రూ 1,46,000	రూ.46,000

12 మంది దరఖాస్తు

ఇప్పటి వరకు 12మంది రైతులు కల్టివేటర్లు, తదితర పరికరాలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కొందరు రైతులు మాత్రమే రాయితీకి సంబంధజంచిన నగదు చెల్లించారు. మరికొందరు రైతులు చెల్లించాల్సి ఉంది. పరికరాలు కావాల్సిన రైతులు స్థానిక రైతు సేవాకేంద్రాల్లోని వీఏలను సంప్రదించాలి.

- షేక్ సైదా, వ్యవసాయాధికారి, కొండాపురం

శ్రీరామనవమి ఉత్సవాల ప్రారంభం



శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా భీమవరప్పాడులో భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కొండాపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడవల్లూరు, భీమవర ప్పాడు తదితర గ్రామాల్లోని రామాలయాల్లో శనివారం శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు ఆలయాలకు తరలివచ్చి పూజలు నిర్వహించారు. భీమవరప్పాడులో ఐదు రోజులు జరిగే ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు గరుడసేవ జరుగుతుంది. అందుకోసం శనివారం సీతరాముల విగ్రహాలకు అభిషేకాలతోపాటు గరుత్మంతుని ఆరాధన, హనుమాన్ చాలీసా పారాయణ, మన్య సూక్తంతో ఆంజనేయస్వామి అభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందచేశారు. ఉభయకర్తలు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

అధ్వానంగా రాళ్లపాడు రోడ్డు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

లింగసముద్రం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపేట రోడ్డు నుంచి రాళ్లపాడు గ్రామానికి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 15 ఏళ్ల క్రితం మెటల్ రోడ్డుగా ఉన్న ఈ రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు. అయితే గత ఐదారేళ్ల నుంచి ఈ రోడ్డుపై ఉన్న తారు, మెటల్ లేచిపోయి గుంతలు పడి ప్రయాణానికి నరకప్రాయంగా మారింది. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో ఈ రోడ్డు క్రమేణా దెబ్బతింటూ వస్తోంది. దీంతో ఒక కిలోమీటరు పొడవు ఉన్న ఈ రోడ్డుపై అడుగడుగున గుంతలు ఏర్పడి దారుణంగా మారింది. అయినా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు సరికదా కనీసం ఒక గుంకైనా తట్టడు మట్టి వేసిన పాపాన పోలేదు. దీంతో కొత్తపేట-శాయిపేట రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు గ్రామస్థులకు ఈ రోడ్డే ఆధారం. ఈ రోడ్డుపై ప్రతినిత్యం ఆటోలు, మోటారు సైకిళ్లు, బస్సులు వెళుతుంటాయి. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గుంతలు పడి, కంకర లేచి అధ్వానంగా ఉన్న రాళ్లపాడు పంచాయతీరాజ్ రోడ్డు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కావలి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్‌కు స్థానిక యూనియన్ నాయకులతో కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులపై కక్ష్య సాధింపులకు పాల్పడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరణించిన, పదవీ విరమణ చెందిన వారి స్థానాల్లో వారి కుటుంబ సభ్యులతో భర్తీ చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలన్నారు. 2005 నుంచి 2019 వరకు కార్మికుల పీఎఫ్‌ను ఆప్కాస్ వారి పీఎఫ్ అకౌంట్‌లో కలపాలన్నారు. రోజువారి కార్మికులను అవుట్‌సోర్సింగ్‌లోకి తీసుకోవాలని, కార్మికుల సంఖ్యను పెంచాలని, చనిపోయిన, పదవీవిరమణ చేసిన కార్మికుల పీఎఫ్‌ను క్లియర్‌చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లె అంకయ్య, నేతలు టీ.వెంకటేష్, వై.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి : కలెక్టర్



నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్టు కలెక్టర్ ఓ. ఆనంద్ చెప్పారు. మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శని వారం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యం లో కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమా లవేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలూ కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని పేర్కొన్నారు. జిల్లాలో పదివేల మంది గిరిజనులకు ఆధార్ కార్డులు లేవని, వారందరికీ ఆధార్ కార్డులు ఇప్పించి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య శాలువా కప్పి సత్కరించారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు స్వర్ణావెంకయ్య ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు విజయకుమార్‌లతోపాటు పలు సంఘాల నాయకులు జగ్జీవన్‌రామ్ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో జేసీ కే. కార్తీక్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

14న ఎస్టీ వర్గీకరణ భేరీ

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 14న నెల్లూరులో ఎస్టీ వర్గీకరణ భేరీ నిర్వహించనున్నట్లు యానా దుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య తెలిపారు. శనివారం నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఆయన విలేక రులతో మాట్లా డారు. ఆ రోజు నగరంలోని వెన్నెల కంటి రాఘవయ్య భవన్ నుంచి వీఆర్సీ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం టౌన్ హాల్లో రాష్ట్రస్థాయి సభ నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఎస్టీల వర్గీకరణకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యానాది గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్య క్షుడు చేవూరు సుబ్బారావు మాట్లాడుతూ ఎస్టీ వర్గీకరణ భేరీకీ తామంతా సంఘీభావం తెలుపుతు న్నామని చెప్పారు. సమావేశంలో వర్గీకరణ భేరీ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నేతలు రాపూరు కృష్ణయ్య, మానికల మురళి, చెంబేటి ఉష, కల్లూరు వరలక్ష్మి, తిరివీధి సతీష్ చంద్ర, కల్లూరు పెంచలప్రసాద్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి జిల్లా స్థాయి క్యారమ్స్ పోటీలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నెల్లూరుక్లబ్‌లో ఈనెల 12 నుంచి 14 వరకు జిల్లాస్థాయి ర్యాకింగ్ క్యారమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ కార్యదర్శి వీ. రఘురామ్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిఉన్న క్రీడాకారులు ఈనెల 10న సాయంత్రం 5 గంటలలోపు క్లబ్‌లోని అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీమన్నారాయణను, తనను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే నెల్లూరు క్లబ్ సభ్యులకు ప్రత్యేకంగా క్యారమ్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

జింకను చంపిన వ్యక్తి అరెస్ట్



క్రిష్టయ్యను అరెస్ట్ చూపుతున్న డీఎఫ్‌వో మహబూబ్‌బాషా, రేంజర్ మాల్యాద్రి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అడవుల్లో తిరిగే జింకను చంపి మాంసం తింటున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్‌బాషా తెలిపారు. నగరంలోని నిప్పో కూడలి వద్ద గల జిల్లా అట వీశాఖ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మా ట్లాడారు. వెంకటాచలం మండలం వెంకటకృష్ణాపురంలో నివాసం ఉంటున్న చల్లాకిష్టయ్య నెల్లూరు రేంజ్ పరిధిలోని ఆమంచర్ల సెక్షన్ కసుమూరు రిజర్వు ఫారెస్ట్‌లో జింకను చంపి మాంసం తింటున్న సమయంలో ఆయన్ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972 కింద అరెస్ట్ చేసి రిమాండ్ పంపామన్నారు. వన్యప్రాణులను చంపితే కఠిన శిక్షలు పడతాయని డీఎఫ్‌వో హెచ్చరించారు. సమావేశంలో నెల్లూరు రేంజర్ మాల్యాద్రి,సెక్షన్ అధికారి పాల్గొన్నారు.



రూపాయికి ఏం వస్తుంది. ఓ అగ్గిపెట్టె, ఓ చాక్లెట్.. ఇంతకుమించి ఏమీ రావు. కానీ నెల్లూరు నగరంలో ఆ ప్రాంతానికి వెళితే మాత్రం ఒక్క రూపాయికే బోండాలు లభిస్తాయి. వేడివేడి బోండాలతో పాటు వడలు, బజ్జీలూ అందుబాటులో ఉంటాయి. అయ్యప్పగుడి సమీపంలోని వెంకటరెడ్డినగర్ రామాలయం వీధిలో ప్రతిరోజూ సాయంత్రం ఒక్క రూపాయి బోండాలు విక్రయిస్తుండటంతో ఆహార ప్రియులు క్యూ కడుతున్నారు.

రూపాయి బోండా... కడుపునిండా!

ధర తక్కువైనా రుచి శుచిలో నో కాంప్రమైజ్



నగరంలోని వెంకటరెడ్డి నగర్ రామాలయం పక్కనే రేగల విజయలక్ష్మి మూడేళ్లకుపైగా తన ఇంటిముందే ఒక్క రూపాయి బోండాలను విక్రయిస్తోంది. ఈమె కుటుంబ సభ్యులు మరో నలుగురు మహిళలు కూడా కష్టమర్లకు టిఫిన్ అందించడంలో బిజీగా ఉంటారు. ఇక్కడ బోండాలు తినేకొద్దీ మరిన్ని తిందామా అన్నంత రుచిగా ఉంటాయి. టిఫిన్‌తో పాటు అందించే వేరుశనగ చట్నీ, కారం, వివిధ రకాల పొడులు ఇక్కడ ప్రత్యేకం. ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు కూడా కష్టమర్లతో బిజీగా ఉండే ఈ ప్రాంతం బోండాల సువాసనతో నిండిపోయి ఉంటుంది. అలాగే ఇదే రామాలయంవీధి చివరిలో కనకట్ల స్వాతి కూడా రూపాయి బోండాలు విక్రయిస్తుండటంతో సమీపంలోని ఆటోనగర్ కార్మికులు, స్థానికులు వీటిని ఆస్వాదిస్తున్నారు. అలాగే, బ్యాంక్ ఆఫ్ ఇండియా వీధి చివరలో గద్దేటి మహాలక్ష్మమ్మ కూడా ఒక రూపాయికే బోండాలు విక్రయిస్తున్నారు. బోండాలు తినే వారితోపాటు పెద్ద ఎత్తున పార్శిల్స్ కూడా తీసుకెళుతుంటారు. ఏమీ కొనేటట్లు లేదు.. ఏమీ తినేటట్లు లేదంటూ ధరలు పెరిగిపోతున్న ఈరోజుల్లో రూపాయికే రుచికర బోండాలను అందిస్తున్న వీరిని కస్టమర్లు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



కొలువుదీరిన సీతారామచంద్రమూర్తి, శ్రీదేవిభూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, విఘ్నేశ్వరుడు



యాగస్థలిలో కొలువు తీరిన కన్యకాపరమేశ్వరి

సంతాన వృద్ధి కోసం పుత్రకామేష్టి యాగం

భారీగా తరలివచ్చిన దంపతులు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు బాలాజీ నగర్‌లోని సీతారామ మందిరంలో శనివారం పుత్రకా మేష్టియాగాన్ని వైభవంగా నిర్వహించారు. పిల్లలు లేని దంపతులు సంతాన వృద్ధి కోసం ఈ యాగంలో పాల్గొన్నారు. మాచవోలు కోటేశ్వరశర్మ, ఆయన కుమారులు ఆధ్వర్యంలో పుత్రకామేష్టి, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. తొలుత ఆలయంలోని సీతారామచంద్ర మూర్తులు, కల్యాణ వేంకటేశ్వరస్వామి, వినాయక స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి.



పుత్రకామేష్టియాగం చేస్తున్న మాచవోలు కోటేశ్వరరావు, తదితరులు

కోశాధికారి కొప్పవరపు శివప్రసాద్, ఉపాధ్యక్షుడు వాకాటి నరసయ్య తదితరులు పర్యవేక్షించారు. యాగానికి ఉభయకర్తలు, అమర్త లూరు శ్రీనివాసులుగుప్తా, కరుణమ్మ, వెంకటేశ్వర్లు గుప్తా, గీతాంజలి, సురేంద్రనాథ్ గుప్తా, అన్నపూర్ణ, డాక్టర్ భారతి, డాక్టర్ విష్ణుతేజ, డాక్టర్ పీ. చిన్మయి వ్యవహరించారు.

● భక్తుల అనుభవాలు

కాగా 2023లో జరిగిన పుత్రకామేష్టి యాగంలో పాల్గొని సంతానం పొందిన విజయవాడకు చెందిన వెంకటనాగమణి నిధిర, ఆత్మకూరుకు చెందిన కే. స్వాతి, నగరానికి చెందిన రజనీ యాగ ఫలం అనుభవాలను భక్తులతో పంచుకున్నారు.

ఈ కార్యక్రమాలను ఉత్సవ కమిటీ చైర్మన్ అమరా మోహన్‌రావు, మందిరం కమిటీ అధ్యక్షుడు తన్నీరు మస్తాన్‌రావు, గౌరవాధ్యక్షుడు తాతా వెంకట కిషోర్‌కుమార్, గౌరవ సలహాదారు ఎంపీ ఆంజనేయులు, కార్యదర్శి సోమిరెడ్డి వెంకట రత్నం,



యాగంలో పాల్గొన్న దంపతులు

ఆ ఆలయాలను ఎండోమెంట్‌లో కలపొద్దు

● ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి అర్చకుల మొర ● అవి ఎప్పుడో కలిశాయి : ధర్మకర్త

కావలి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని కలుగోళ్లశాంభవి, పాతూరు శివాలయం, విష్ణాలయంలను ఎండోమెంట్‌లో కలిపితే తమ ఉపాధి పోతుందని, ఈ ఆలయాలను దేవాదాయశాఖ పరిధిలోకి తేవద్దని ఆ మూడు ఆలయాల ప్రధాన అర్చకులు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం కావలిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేని కలిసి ఆ మూడు ఆలయాలను ఎప్పటిలాగనే కొనసాగించేలా చూడాలని కోరారు. అయితే స్పందించిన ఎమ్మెల్యే ఇది తన పరిధిలో లేదని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాక తానేమీ చేయలేనని స్పష్టం చేశారు. అయితే ఆలయ అర్చకులుగా మీరే కొనసాగేలా చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. మీరు వద్దంటే ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేపట్టాల్సి వస్తోందని అన్నట్లు తెలిసింది. కాగా ఈ మూడు ఆలయాలు ఎండోమెంట్‌లో ఎప్పుడో కలిసాయని, ఇప్పుడు పాలనా సౌలభ్యం కోసం కొండబిట్రగుంట ఆలయ ఈవో రాధాకృష్ణకు నిర్వహణల బాధ్యతలు అప్పగించారని ఈ మూడు ఆలయాల ధర్మకర్త కృష్ణమోహన్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. తాను వ్యవస్థాపక ధర్మకర్తగా ఆలయ ఈవోకు ఆలయాల నిర్వహణకు సహకరిస్తానని చెప్పారు. ఆలయాల్లో ఎప్పటిలాగే పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు.

రైలులో చోరీ కేసులో ముగ్గురిని గుర్తించాం..

● దొంగతనాలకు పాల్పడింది ఆరుగురిగా అనుమానం

● త్వరలోనే నిందితుల అరెస్టు ? ● గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్ మీనా

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరు రోడ్డు సమీపంలో రైల్లో జరిగిన చోరీలో కేసులో ముగ్గురు నిందితులను గుర్తించామని, త్వరలోనే వారిని అరెస్ట్ చేస్తామని గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. శనివారం ఆయన జిల్లాలో పర్యటించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రోడ్డు మార్గం గుండా ఆయన అల్లూరు రోడ్డు సమీపంలో రైలులో చోరీ జరిగిన ప్రాంతానికి చేరుకున్నారు. దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. అధికారులనడిగి వివరాలు తెలుసుకున్నారు. అక్కడ నుంచి అల్లూరు రోడ్డు స్టేషన్ వద్దకు చేరుకొని పరిశీలించారు. అనంతరం పడుగుపాడు రైల్వే స్టేషన్‌కు చేరుకొని పరిశీలించారు. సాయంత్రం నగరంలోని పోలీసు గెస్ట్‌హౌస్‌కు మీనా చేరుకున్నారు. రాత్రి రైల్వే డీఎస్పీ కార్యాలయానికి చేరుకొని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ రైల్లో జరిగిన చోరీలో ఆరుగురు ఉన్నట్లు అనుమానిస్తున్నామ న్నారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో ముగ్గురు నిందితులను గుర్తించామని, త్వరలోనే వారిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక టీమ్‌లు గాలిస్తున్నాయన్నారు. చోరీ కేసును త్వరితగతిన ఛేదించాలని డీజీపీ ప్రత్యేకంగా చెప్పారని, త్వరలోనే ఛేస్తామన్నారు. సమావేశంలో రైల్వే డీఎస్పీ మురళీధర్, ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

● సిగ్నల్ ప్రాంతం తనిఖీ

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి) : బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని అల్లూరు రోడ్డు రైల్వే స్టేషన్ ఉత్తర హోం సిగ్నల్ ప్రాంతాన్ని గుంతకల్ జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనా శనివారం తనిఖీ చేశారు. ఈనెల 2న రాత్రి అల్లూరు రోడ్డు రైల్వే స్టేషన్ వద్ద మధురై ఎక్స్‌ప్రెస్‌లో దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. ఈ విషయమై రైల్వే అధికారులు విచారణను వేగవంతం చేశారు. అందులో భాగంగా గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్ మీనా ఒంగోలులో శాఖ అధికారులతో ముందుగా సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం రైల్వే డీఎస్పీ మురళీధర్, సీఐ సుధాకర్‌లను వెంట పెట్టుకుని అల్లూరురోడ్డులోని హోం సిగ్నల్, ట్యాంపర్ ప్రాంతాన్ని పరిశీలించారు.

నృసింహుడి సన్నిధి.. భక్తుల దోపిడీ ఇది!

టెంకాయ రూ.100, పూలమాల రూ.300 ● మూడొంతుల అధిక ధరతో విక్రయం

మాలకొండలో భక్తుల నిలువు దోపిడీ

అన్నీ తెలిసినా పట్టించుకోని అధికారులు

మాలకొండ. ఇదో పవిత్ర పుణ్య క్షేత్రం. వారంలో ఒకరోజు మాత్రమే ఇక్కడ ఆలయ ప్రవేశం ఉంటుంది. ఆ ఒక్క రోజే ఎక్కడెక్కడి నుంచో వేలాదిమంది భక్తులు తరలివచ్చి లక్ష్మీనృసింహ స్వామి వారిని దర్శించుకుంటారు. ఇలా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వ్యాపారుల తీరుతో బెంబేలెత్తిపోతున్నారు. స్వామి వారికి కొబ్బరాయ కొట్టి, పూల మాల సమర్పించి మొక్కు తీర్చుకోవాలంటేనే హడలిపోతున్నారు. ఎక్కడా లేని విధంగా పూజా సామగ్రి ధరలు ఆకాశా న్నంటుతూ సామాన్య భక్తులకు అందనంత ఎత్తుకు పెంచేశారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)



మాలకొండలోని కొబ్బరికాయల దుకాణం

రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం ఒకటి. ఈ దేవాలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రతి శనివారం 10 వేల మందికిపైగానే భక్తులు వస్తుంటారు. భక్తులు ఆలయంలోకి అడుగుపెట్టిన దగ్గర నుంచి తిరిగి వెళ్లే వరకు ప్రతి చోట నిలువు దోపిడీకి గురవుతున్నారు. తొలుత టోల్‌గేట్ నుంచి ప్రారంభమయ్యే ఈ బాదుడు పుణ్యక్షేత్ర ప్రాంగణంలో నిర్వహిస్తున్న దుకాణాల వరకు అన్నింటిలోనూ అధిక ధరలు వసూలు చేస్తున్నారు. దుకాణదారులు ఇష్టం వచ్చిన ధరతో పూజా సామగ్రి విక్రయిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ శనివారం భక్తులను బెంబేలెత్తించేలా ధరలు ముడొంతులు పెంచేశారు. కొబ్బరికాయ రూ.100, పూల మాల రూ.300 లకు విక్రయించారు. ఈ ధరలు చూసి భక్తులు ఖంగుతిన్నారు. గత వారంలో కొబ్బరికాయ, అరటిపండు, పూలు, పసుపు, కుంకుమ, సాంబ్రాణి కడ్డీలతో కలిపి రూ 50, పూలమాల సైజును బట్టీ రూ.150 నుంచి 200లకు విక్రయించారు. అలాంటిది ఈ వారం వీటి ధర అమాంతం పెరగడంతో భక్తులు ఆందోళన చెందారు. వీటి ధరలు ఇలా ఉంటే స్వామి, అమ్మవారికి సమర్పించే చీర, జాకెట్, పూలు, పండ్లు, నిమ్మకాయలు గాజులు, పసుపు, కుంకుమ, అగరబత్తీలు తదితర పూజా ద్రవ్యాలకు ఇంకెంత దోచుకొంటారోనని బహిరంగంగా చర్చించుకోవడం విశేషం. వారం రోజుల వ్యవధిలోనే పూజాద్రవ్యాలకు మూడొంతులు రేట్లు పెరిగాయా, ఈ రేట్లు ఎక్కడా లేవంటూ పలువురు భక్తులు ఆలయ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని భక్తులు వాపోయారు. ఎవరైనా భక్తులు ఈ ధరల గురించి ప్రశ్నిస్తే అధిక ధరలు పెట్టి పాటలు పాడుకున్నామంటూ వారితో వాగ్వావానికి దిగుతున్నట్లు భక్తులు చెబుతున్నారు. వాస్తవానికి ఆలయ టెండర్ల నిబంధనల ప్రకారం 12 అంగుళాల చుట్టుకొలత కలిగిన కొబ్బరి కాయ రూ.30లకు విక్రయించాలి. అయితే దుకాణదారులు మూడొంతులు పెంచి విక్రయిస్తున్నారు. అయితే, దుకాణం ఎదుట తాటికాయంత అక్షరాలతో టెంకాయ రూ.30 అని ధరల పట్టిక పెట్టి ఉండడం కొసమెరుపు.

మాలకొండ ఆదాయం రూ.11,16,458

వలేటవారిపాలెం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.11,16,458 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు ఒక ప్రకట నలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ.5,950, కుంకుమార్చనకు రూ.17,440, తల నీలాలు సమర్పణకు రూ.42,400, వాహన పూజలకు రూ.3,320, ప్రత్యేక దర్శనానికి రూ.3,37,300, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ.640, రూము అద్దెలు రూ.32,700, కవర్లు విక్రయంతో రూ.9600, లడ్డుప్రసాదానికి రూ.1,90,030, అన్నదానం ద్వారా రూ.4,66,962, విరాళములు రూ.10,116 ఆదాయం లభించినట్లు సాగర్‌బాబు తెలిపారు.

ఎక్కువ ధరకు అమ్మారు!



నేను ప్రతి శనివారం మాలకొండకు వస్తాను. గతంలో టెంకాయ, పూలమాల, అరటి పండు నిమ్మకాయ, సాంబ్రాణి కడ్డీలు, పసుపు, కుంకుమ, తదితర పూజాద్రవ్యాలు కలిపి రూ.200 తీసుకున్నారు. ఇప్పుడు రూ.400 తీసుకున్నారు.

- చెన్నయ్య, పొన్నలూరు

టెంకాయ వందా!?



టెంకాయ రూ.100 అమ్ముతున్నారు. ఇదేంది దుకాణం ముందు పెట్టిన ధరల పట్టికలో రూ.30 అని ఉంది కదా.. మీరు వంద అమ్మడమేమిటని అడిగితే మేము అమ్మేది ఇంతేనని నిర్లక్ష్యంగా చెప్పారు.

- ఝాన్సీ, పెదపవని

కొండ కింద టెంకాయ ముప్పయ్యే..



మా కుటుంబ సభ్యులు కొండకింద కొబ్బరికాయ రూ.30 లకే కొనుగోలు చేశారు. కొండపైన ఉన్నాయి కదా అని నేను పైకొచ్చాను. ఇక్కడేమో రూ.100 తీసుకున్నారు. అదేంది కొండ కింద రూ.30 అంటే అక్కడికే వెళ్లి తెచ్చుకోమన్నారు.

- శేషాచలం, పెదపవని

విచారించి చర్యలు తీసుకుంటా



టెంకాయ రూ.100 అమ్ముతున్నట్లు భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఆలయ నిబంధనల ప్రకారం టెంకాయ రూ.30లకే విక్రయించాలి. దీనిపై విచారించి వాస్తవమైతే చర్యలు తీసుకుంటాం.

- సాగర్‌బాబు, డిప్యూటీ కమిషనర్, మాలకొండ

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టులో కులం పేరుతో దూషిస్తూ దాడికి యత్నించారని, ఓ న్యాయవాది ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు శనివారం ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, న్యాయవాది హరిబాబు బార్ అసోషియేషన్‌లో 18 ఏళ్లుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ నెల 4న ఆయన క్లయింట్‌కు సంబంధించిన ఎన్‌వోసీ విషయంపై న్యాయవాది ఎం. లక్ష్మి, ఆమె భర్త కలిసి హరిబాబును తక్కువ కులానికి చెందిన వాడివని దూషిస్తూ, దాడికి యత్నించారు. అంతటితో ఆగకుండా న్యాయవాది లక్ష్మి కాలికి ఉన్న చెప్పు తీసి హరి బాబుపైకి విసిరింది. ఆమె భర్త బాధితుడి కాలర్ పట్టుకొని 'నీ అంతు చూస్తా'.. అంటూ దాడి చేశాడు. అక్కడే ఉన్న న్యాయవాదులు అడ్డు కొని ఇరువురిని పక్కకు లాగారు. ఈ మేరకు బాధితుడు చిన్నబజారు పోలీ సులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి

వెంకటాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాకుటూరు గ్రామానికి చెందిన కొత్త తన్మయ్ (13) గ్రామ సమీపంలోని కొత్త చె రువులో ఈతకు వెళ్లాడు. చెరువులో భారీ గ్రావెల్ గుంతలు ఉండడంతో లోతు తెలియక తన్మయ్ మునిగిపోయాడు. మిగిలిన ఇద్దరు స్నేహితులు రక్షించడానికి ప్రయత్నాలు చేసిన ఫలించలేదు. బాలుర కేకలు విని స్థానికులు వచ్చి చెరువులో గాలించారు. కొద్దిసేపటికి గుర్తించి బయటకు అప్పటికే మృతి చెందాడు. బాలుడి మృతిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు. తన్మయ్ చెముడుగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు.